అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 08-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 159 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

బడిబాటకు వినూత్న ప్రచారం

19 వరకు నిర్వహించనున్న ప్రభుత్వం

- అమ్మ ఆదర్శ కమిటీలకే వసతుల కల్పన బాధ్యత
- రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షలు ఆదా అవుతాయంటూ వెల్లడి
- ప్రయివేటు మోజు నుంచి తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చే యత్నం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం.. విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం నుంచి చేపట్టింది. ఈ ఏడాది ప్రభుత్వం వినూత్నంగా ఈ ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేలా వారిని చైతన్యవంతులను చేస్తున్నది. ప్రయివేటు పాఠశాలల్లో చేరితే ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పిస్తే ఆ డబ్బు ఆదా చేసే అవకాశముంటుందనీ, పిల్లల ఉన్నత చదువులకు పొదుపు చేయొచ్చని సరికొత్త ప్రచారానికి సర్కారు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రయివేటుపై మోజు తగ్గించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధనతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఒక జత షూను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి మొదలైన బడిబాట ఈనెల 19 వరకు నిర్వహిస్తారు. బడిఈడు పిల్లలను, బడిమానేసిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతోపాటు, విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. బడిబాట సందర్భంగా ప్రయివేటు స్కూళ్లపై మోజు తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల పునర్వైభవానికి కృషి చేసేలా విస్తృత ప్రచారం చేపట్టాలనీ, తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నం జరగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర బాగోగులు, బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించటం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో ఆశించిన స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

రూ.667 కోట్లతో సర్కారు బడులకు కొత్త హంగులు

రాష్ట్రంలో మొత్తం 26,823 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటిలో 20,680 చోట్ల ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశారు. 17,729 పాఠశాలల్లో అవసరమైన పనులన్నీ ఆయా కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది.

పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డులు, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి తాత్కాలిక మరమ్మతుల పనులన్నింటినీ ప్రభుత్వం ఈ వేసవిలోనే మొదలు పెట్టింది. ఈ పనులకు రూ.667.25 కోట్లు కేటాయించింది. అందులో ఇప్పటికే రూ.147 కోట్లు కమిటీలకు అడ్వాన్సుగా చెల్లించింది. రాష్ట్రమంతా ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి అధ్వర్యంలో అన్ని పాఠశాలలనూ కొత్త హంగులతో తీర్చిదిద్దబోతున్నది.

పెద్దపల్లి జిల్లాలో చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పెద్దపల్లి జిల్లాలోని మానేరు వాగు చుట్టూ ఆయా గ్రామాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం కోసం నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులను ఇచ్చింది. ఈమేరకు సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా వేర్వేరుగా జీవోలో ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలో మానేరు వాగు చుట్టూ చెక్‌డ్యాం నిర్మాణం కోసం రూ.27.09 కోట్లు మంజూరు చేశారు. అలాగే ఇదే మండలంలోని మంచరామి గ్రామంలో కూడా మానేరు వాగు చుట్టూ చెక్‌డ్యాం నిర్మించడానికి రూ.30.67 కోట్లు కేటాయించారు. ఇదిలావుండగా పెద్దపల్లి జిల్లా సిద్దులకుంట పునరుద్ధరణ పనుల కోసం రూ.2.23 కోట్లను మంజూరు చేస్తూ రాహుల్ బొజ్జా ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సీఈలతోపాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ చర్యలు తీసుకోవాలని ఆయా జీవోల్లో పేర్కొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తాం

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తామని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నుంచి పునఃప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా 3 నెలల సుదీర్ఘ విరామం తరువాత ఈ కార్యక్రమం తిరిగి ప్రారంభమైనందున ప్రజల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారికి సిఫారసు చేస్తామని తెలిపారు. కాగా అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 373 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120 దరఖాస్తులు, విద్యా శాఖకు సంబంధించి 43, మున్సిపల్ శాఖకు సంబంధించి 43, హోం శాఖకు సంబంధించి 29, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 18, ఇతర శాఖలకు సంబంధించి 120 దరఖాస్తులు అందినట్టు ప్రజావాణి అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో మెదడు కణితి ఆపరేషన్ విజయవంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అనేక అరుదైన చికిత్సలు, శస్త్రచికిత్సలను విజయవంతం చేసిన నిమ్స్ మరో ఘనతను సాధించింది. ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగం డాక్టర్లు అత్యంత సంక్లిష్టమైన మెదడు కణితి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. తద్వారా తీవ్రమైన తల నొప్పి, వాంతులతో బాధ పడుతున్న సంగారెడ్డికి చెందిన నహారి (35 ఏండ్లు) అనే వ్యక్తి ప్రాణాన్ని నిలిపారు. బాధితుడు న్యూరో సర్జరీ విభాగంలోని డాక్టర్ వై.తిరుమల్ నేతృత్వంలోని వైద్యుల బృందాన్ని చికిత్స కోసం సంప్రదించారు. ఆతడికి ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ చేసిన వైద్యులు మెదడు మధ్య భాగంలో అతి ముఖ్యమైన రక్తనాళాల మధ్యలో కణితి ఉన్నట్టు గుర్తించారు. దాని తీవ్రతను అంచనా వేసిన డాక్టర్లు 3డీ వెన్ట్‌గామ్ పరీక్ష ద్వారా ప్రి ఆపరేటివ్ ప్లానింగ్‌ను సిద్ధం చేశారు. గత వారం ట్రాన్‌సిల్వియన్ అప్రోచ్ పద్ధతిలో శస్త్రచికిత్స పూర్తి చేశారు. ప్రస్తుతం నహారి పూర్తిగా కోలుకున్నారు. ఆపరేషన్ చేసిన వైద్య బృందంలో ఉన్న డాక్టర్ తిరుమల్, డాక్టర్ నరేన్, డాక్టర్ విశాల్, డాక్టర్ దీపక్ తో పాటు న్యూరో సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ సుచంద, డాక్టర్ వంశీ క్రిష్ణ, అనేస్తీషియా, రేడియాలజీ విభాగాల బాధ్యులున్నారు. వారందరిని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ఈ సందర్భంగా అభినందించారు.

కేజీబీవీల్లో హాస్టల్ పర్యవేక్షణ విధానం

సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య బట్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో హాస్టల్ పర్యవేక్షణ విధానాన్ని అమల్లోకి తెస్తామని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య బట్టు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బీసీ గురుకులాల్లో హాస్టల్ పర్యవేక్షణ విధానాన్ని అమలు చేసి మెరుగైన ఫలితాలను సాధించామని అన్నారు. దాన్ని కేజీబీవీల్లో అమలు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా యాప్‌ను రూపొందించి దాని సహాయంతో పర్యవేక్షణ చేస్తామని అన్నారు. ఇప్పటి వరకు కేజీబీవీల్లో వంటసామగ్రి, కూరగాయలు, ఇతర అవసరాలకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసి ఆ బిల్లులను సమర్పించాలంటే జిల్లా కేంద్రాలకు రావాలని చెప్పారు. జిల్లా కేంద్రాల అధికారులు బిల్లులు మంజూరు కావాలంటే హైదరాబాద్‌కు రావాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. ఆ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెస్తున్నామని వివరించారు. కూరగాయలు, ఇతర అవసరాలకు సంబంధించిన ఎమైనా కొనుగోలు చేస్తే ఆ బిల్లులను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. దాన్ని పరిశీలించి బిల్లులు చెల్లిస్తామని అన్నారు. వాటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారా, ఎమైనా దుర్వినియోగం జరుగుతుందా? అనేది తెలుసుకోవడానికి అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్ధారణ చేసుకుంటాయని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం కోసం ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయడం దీని ఉద్దేశమని అన్నారు.

రేపు గ్రూప్-1 ప్రిలిమ్స్

- 897 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 4.03 లక్షల మంది అభ్యర్థుల దరఖాస్తు: టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను ఆదివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అదనపు కలెక్టర్లతోపాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్‌గా నియమించామని తెలిపారు. ప్రతి 20 కేంద్రాలకు ఒక రీజినల్ కోఆర్డినేటర్‌ను కూడా నియమించామని పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని వివరించారు.

ఆదేరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం పది గంటలకు అంటే పరీక్షా ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసేస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యేటప్పుడు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు (ఒరిజినల్) వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్, మూడు నుంచి ఐదు కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆదివారం ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్‌ఆర్టీసీని కోరామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, మ్యాథమెటికల్ టేబుల్స్, బ్యాగ్‌లు, ప్యాడ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని వివరించారు. హాల్‌టికెట్‌లో పొందుపర్చిన నిబంధనలను తప్పనిసరిగా అభ్యర్థులు పాటించాలని కోరారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1కు 4.03 లక్షల దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే.

రామోజీరావుకి తీవ్ర అస్వస్థత

- ఐసీయూలో చికిత్స



హైదరాబాద్ : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మెన్ రామోజీరావు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్టు తెలిసింది. అనారోగ్య కారణంగా రామోజీరావు గత కొంతకాలంగా ఇంటికే పరిమితమయ్యారు. ఇంట్లోనే ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రామోజీరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్య వర్గాలు రాత్రి 10.30 గంటల వరకు ఎటువంటి ప్రకటనా విడుదల చేయలేదు.

అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌లోకి ప్రవేశించిన సునీతా విలియమ్స్

ఆనందంతో డ్యాన్స్



వాషింగ్టన్ : భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ శుక్రవారం ఉదయం అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌లోకి ప్రవేశించారని అమెరికా రోదసీ సంస్థ తెలిపింది. వీరిద్దరిని తీసుకెళ్లిన నాసా బోయింగ్ స్టార్‌లైనర్ 5వ తేదీన ఫ్లోరిడాలోని కేప్ కెన్నెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుండి బయలుదేరిన 26గంటల ప్రయాణం అనంతరం అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌తో అనుసంధానమైంది. వారిద్దరు లోపలకు ప్రవేశిస్తున్న దృశ్యాన్ని నాసా విడుదల చేసింది. అప్పటికే లోపల వున్న ఎక్స్‌పెడిషన్ 71 సిబ్బంది ఆయన ఏడుగురు వ్యోమగాములు సునీత, బుచ్‌లను స్వాగతించారు. లోపలకు రాగానే సునీతా విలియమ్స్ ఆనందంతో డ్యాన్స్ చేస్తున్న వీడియోని నాసా పంచుకుంది.

డిగ్రీలో కొత్తగా బయోమెడికల్ సైన్స్ కోర్సు

- కాలేజీలు, ఆస్పత్రులు, ఫార్మాస్యూటికల్ సంస్థలతో ఉన్నత విద్యామండలి ఒప్పందం

ఈ విద్యాసంవత్సరంనుంచి దోస్త్ ద్వారా సీట్ల భర్తీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిగ్రీ విద్యలో మరో కొత్త కోర్సు అందుబాటులోకి రానుంది. బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ (ఆనర్స్) నాలుగేండ్ల కోర్సును ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టింది. శుక్రవారం డిగ్రీ కాలేజీలు, ఆస్పత్రులు, బయో ఫార్మాస్యూటికల్ సంస్థలతో ఉన్నత విద్యామండలి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, రెడ్డీస్ ల్యాబొరేటరీస్, ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీస్, ఫార్మా డీఈఎం సొల్యూషన్స్ డైరెక్టర్లు, ఉస్మానియా, నిమ్స్, మహవీర్ ఆస్పత్రుల నుంచి సీనియర్ వైద్యులు, ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ, రెడ్డి మహిళా కళాశాల, వివేకానంద కాలేజీ ప్రిన్సిపాళ్లు, ఎస్సీ గురుకులాల జాయింట్ సెక్రెటరీ, ఇతర ప్రయివేటు కాలేజీల నుంచి ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. ఈ మేరకు శ్రీరాం వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 విద్యాసంవత్సరంలో 15 ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ (ఆనర్స్) కోర్సును ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఒక్కో కాలేజీలో 50 చొప్పున మొత్తం 750 సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. దోస్త్ రెండో విడత కౌన్సెలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. పరిశ్రమ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఉపాధిని పెంపొందించే లక్ష్యంతో ఈ కోర్సును ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమ ఆధారిత కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు టాయని వివరించారు. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులకు కార్పొరేట్ ఆస్పత్రులు, బయో ఫార్మాస్యూటికల్ పరిశ్రమలతోపాటు డయాగ్నస్టిక్ కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలుంటాయని తెలిపారు. వాటిలోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రయత్నం విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి 24 నుంచి నిరసనలు

- టీఎంఎస్‌టీఏ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24 నుంచి నిరసన కార్యక్రమాలను చేపడతామని తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) తెలిపింది. ఈ మేరకు మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం అధ్యక్షుడు భూతం యాకమల్లు కలిసి నోటీసును ఇచ్చారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులతోపాటు 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని సూచించారు. జేఎల్ స్థాయి వేతనం, 2013 నుంచి 2018 వరకు రావాల్సిన సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌ను చెల్లించాలని తెలిపారు. ఈనెల 23 నాటికి బదిలీల షెడ్యూల్‌ను ఇవ్వాలని, మిగతా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే 24 నుంచి నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 08-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 159 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు వెల : 6.50

నేటినుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు
- టెట్ లేకుండానే టీచర్లకు ప్రమోషన్స్
- గతంలో ఆగిపోయినప్పటి నుంచి ఇప్పుడు ప్రారంభం
- మల్టీజోన్-1లో 22 వరకు నిర్వహణ

8లో..

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

బెంగుళూరు కోర్టు నుంచి బెయిల్



బెంగుళూరు : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆయనకు బెంగుళూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రధాన వార్తాపత్రికల్లో కాంగ్రెస్ పరువు నష్టం కలిగించే వార్తలు...15లో

ఎన్డీఏ నేతగా మోడీ

బలపర్చిన చంద్రబాబు, నితీశ్ | ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించిన రాష్ట్రపతి



లోక్‌సభాపక్ష నేతగా మోడీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాక చప్పట్లతో నేతల అభినందన..

మూడోసారి ప్రధానిగా ఆదివారం ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ : బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి చెందిన పలు పార్టీల ఎంపీలు మోడీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్ హాల్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు రాజ్‌నాథ్‌సింగ్.. మోడీ పేరును ప్రతిపాదించారు. ఆయన నాయకత్వాన్ని సమర్థిస్తూ ఎన్డీఏ ఎంపీలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీంతో ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయటానికి ఆయనకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానికి ఎన్డీఏలోని పలు పార్టీల అధినేతలు, ముఖ్యనాయకులు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఎన్డీఏ ఎంపీల సమావేశానికి ముందు బీజేపీ సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. ఆదివారం నాడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం చేస్తాడని స్పష్టం చేశారు. ఈ నెల 9న సాయంత్రం ఆరు గంటలకు మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్ హాల్‌లో మోడీ నాయకత్వాన్ని సమర్థించటానికి సమావేశమైన ఎన్డీఏ నేతలతో ప్రహ్లాద్ జోషి అన్నారు.

ఎన్డీఏ భేటీలో పొగడ్తలే...

నరేంద్ర మోడీ నాయకత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. భారత్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు దొరికారని, ఆయన మోడీ అని చంద్రబాబు పొగిడారు. మోడీకి విజన్, ఉత్సాహం ఉన్నాయన్నారు. పరిపూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడని అన్నారు.

దేశానికి మోడీ ఒక స్ఫూర్తి: పవన్ కల్యాణ్

ఎన్డీఏ నేతగా మోడీ పేరును బలపరుస్తూ మాట్లాడిన పవన్ కల్యాణ్ ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశానికి మోడీని ఒక స్ఫూర్తిగా అభివర్ణించారు. ఆ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో అద్భుత విజయం సాధించామన్నారు. ఆయన దిశానిర్దేశంతో ఏపీలో 91 శాతం పైగా సీట్లు సాధించామని తెలిపారు. మోడీ వెనుక తామంతా ఉన్నామని ప్రకటించారు. ఎన్డీఏ పక్ష నేతగా మోడీకి వారి పూర్తి మద్దతు ఉంటుందన్నారు

మోడీ కూడా పోటీపడి..

ప్రధాని మోడీ మాట్లాడుతూ లక్షలాది మంది కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడటంతో ఎన్డీఏ కూటమి మెజార్టీ సాధించిందని ప్రధాని మోడీ అన్నారు. కూటమికి మద్దతు తెలిపిన పార్టీలు, అధినేతలు, ఎంపీలకు మోడీ ధన్యవాదాలు తెలియజేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మోడీ ప్రశంసలు కురిపించారు. "ఇక్కడ కూర్చున్నాడు చూడండి.. ఈయన పవన్ కల్యాణ్ కాదు, తుఫాన్" అని సంబోధించారు. దానికి పవన్ కల్యాణ్ ఉబ్బితబ్బిబ్బైపోయారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు అఖండ విజయం అందజేశారని గుర్తుచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తో కలిసి పవన్ కల్యాణ్ చారిత్రాత్మక విజయం సాధించారని అన్నారు.

ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా..

ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా మోడీ పేరును సీనియర్ బీజేపీ నాయకుడు రాథ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు బీజేపీ నాయకులతో పాటు ఎన్డీఏ నేతలు మద్దతు పలికారు. లోక్‌సభలో బీజేపీ నాయకుడిగా, ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ, బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా.. ఇలా మూడు ప్రతిపాదనలకు మోడీ పేరును రాజ్‌నాథ్ సింగ్ సిఫారసు చేశారు. మద్దతు తెలిపిన బీజేపీ అగ్రనాయకులు అమిత్ షా, నితిన్ గడ్కరీ వంటి సీనియర్ నాయకులు, ఎన్డీఏ ఇతర సీనియర్ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, హెచ్‌డి కుమారస్వామి (జేడీఎస్, కర్నాటక), బీహార్ సీఎం, జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్‌లు ఉన్నారు. దీంతో భారతదేశ మూడో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయటానికి మోడీకి మార్గం...15లో



ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మద్దతు లేఖను రాష్ట్రపతి ముర్ముకు అందజేస్తున్న మోడీ



డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించండి

ప్రభుత్వ శాఖలకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, ఆరోగ్యశ్రీ విభాగాల పనితీరును సమీక్షించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండేండ్ల ఆర్థిక ప్రగతిని పరిశీలించారు. అన్ని శాఖలు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్టపరిచి బడ్జెట్ అంచనాలను అందుకోవాలని సూచించారు. అలాగే ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును ఆర్టీసీ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేట్లను సమీక్షించుకొని, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలు బదలాయించుకోవాలని ఆదేశించారు. ఇటీవల సింగరేణిలో ఇలాంటి ప్రయోగం చేయడం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిందంటూ ఆ వివరాలను ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులకు వివరించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయనీ, ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ ప్రక్రియ ప్రారంభమైనా పురోగతి లేకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్రయోజనం పొందే ప్రమాదం ఉందనీ, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. హౌసింగ్...15లో

హస్తినలో సీఎం..

సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొననున్న రేవంత్

ఎంపీలకు నేడు ఖర్గే డిన్నర్

వివరాలు 15లో

ఆందోళన వద్దు.. అవగాహన పెంచుకోండి

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలే ప్రధానం

రిస్క్ గ్రూప్ అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ ఇంటర్వ్యూలో హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. జ్వరం, దగ్గు, విరేచనాలు, నీరసం, వాంతులు వంటి లక్షణాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నీటి నిల్వలు పేరుకుపోవడం, నీటి కాలుష్యంతో వచ్చే వ్యాధులు, అపరిశుభ్రత కారణంగా దోమకాటుతో వచ్చే వ్యాధులు, ఆహార కాలుష్యంతో తలెత్తే సమస్యలతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రోగుల ఆందోళనలతో కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రులు లెక్కకు మించి రోగ నిర్ధారణ పరీక్షలకు సిఫారసు చేసిన తర్వాతే చికిత్స అందించేందుకు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులకు తోడు, మరోవైపు అనారోగ్యంపాలై రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి బారిన పడిన వారు ఏం చేయాలి?, ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్న చికిత్సలపై తదితరాంశాలను హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ విశదీకరించారు. నవతెలంగాణకు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు....

అకాల వర్షాలు కురిశాయి. మరోవైపు వానాకాలం కూడా సమీపిస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. అవి రాకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

వర్షాకాలంలో నీటిసంబంధిత వ్యాధులతో పాటు ఆహార కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులు ప్రబలే అవకాశముంది. ముఖ్యంగా డయేరియా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, జాండిస్ (కామెర్లు), డిఫ్తీరియా, చికెన్ పాక్స్ (అమ్మతల్లి), మీజిల్స్ (తట్టు), టెటనస్ (ధనుర్వాతం) మమ్స్ (దవడ బిళ్లలు) తదితర వ్యాధులు ప్రబలే అవకాశముంది. కలుషిత ఆహారం తీసుకోవడం, నీటిని నిల్వ ఉంచడం, దోమలు పెరిగేందుకు ఆస్కారమిచ్చేలా అపరిశుభ్ర వాతావరణంతో పాటు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం, ఉష్ణోగ్రత తక్కువగా ఉండటంతో వైరల్, బాక్టీరియా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతుంటాయి. వర్షంలో తడిస్తే దగ్గు, జలుబు, గొంతునొప్పి, నీరసం సాధారణంగా...8లో

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

గుర్తింపు లేని కాలేజీలు రద్దు చేయాలి



హైదరాబాద్‌లో

సర్కారు కళాశాలల్లో సదుపాయాలు కల్పించాలి

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ముట్టడి ఉద్రిక్తం

గేట్లు ఎక్కి పలువురు నేతలు నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గుర్తింపు లేకుండా నడుపుతున్న కాలేజీలు, అకాడమిలను రద్దు చేయాలని కోరింది. అక్రమంగా లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటర్...15లో

కవిత పాత్రపై సీబీఐ మరో చార్జిషీట్

ఈ అంశంపై జులై 6 విచారణ

కవిత జ్యుడీషియల్ కస్టడీ 21 వరకు పొడిగింపు



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్ ను దాఖలు చేసింది. దాదాపు 2...5లో



తీన్మార్..విజయం

- వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నిక
- సెకండ్ ప్రియార్టీ కౌంటింగ్‌తో తేలిన ఫలితం
- నిర్దేశిత ఓట్లు 1,55,095 సాధించి రాకేశ్‌రెడ్డిపై మల్లన్న గెలుపు
- మూడ్రోజుల పాటు కొనసాగిన కౌంటింగ్

8లో..

పాఠాలు నేర్పిన ఫలితాలు

ఓట్లు రాల్చని హిందూత్వ | ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ అపజయాలే



(ఫైల్)

లోక్‌సభలో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ విజయం సాధించింది. ఈ క్రమంలో ప్రతిపక్షాలు అనేక అవరోధాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇద్దరు ముఖ్యమంత్రులను జైలుకు పంపారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రధాన స్రవంతి మీడియా బీజేపీతో కుమ్మక్కైంది. ప్రతిపక్షాలకు నిధులు అందకుండా ఎక్కడికక్కడ అష్టదిగ్బంధం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకూ సమానావకాశాలు లభించి ఉంటే ఇండియా కూటమి కచ్చితంగా మ్యాజిక్ ఫిగర్ 272ని దాటేసి ఉండేది. కానీ అది అసాధ్యమైంది. అయినప్పటికీ ఇండియా కూటమి ఛైర్‌పర్సన్ మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతి ఒక్క ప్రతిపక్ష నాయకుడూ ప్రజల హృదయాలను గెలుచుకున్నారు.

న్యూఢిల్లీ : అసాధారణ రీతిలో వచ్చిన ఫలితాలను ప్రజా విజయంగా అందరూ భావించారు. అనేకమంది భారతీయులు దీనిని తమ వ్యక్తిగత విజయంగా తీసుకొని సంబరాలు చేసుకున్నారు. ఎందుకంటే వారు భారతీయ ఆత్మ కోసం జరిగిన చారిత్రక పోరాటంలో భాగస్వాములయ్యారు.

అంతర్గత తిరుగుబాట్లు అనివార్యం

బీజేపీ ఓటమికి కారణాలు అనేకం. ఆ పార్టీలో సంస్థాగత సమస్యలు వేళ్లూనుకుపోయాయి. మోడీ పాలనలో బీజేపీ సంస్థాగతంగా బలహీనపడింది. పైగా బీజేపీ, సంఘ్ పరివార్ మధ్య సంబంధాలు సజావుగా సాగలేదు. అధికార పంపిణీ, ఆధిపత్యం విషయంలో తీవ్రమైన విభేదాలు పొడసూపాయి. ప్రత్యామ్నాయ...15లో

పార్టీలో రాజుకుంటున్న అసమ్మతి కుంపట్లు

మిత్రుల నుంచీ ఒత్తిళ్లు ?



రైతులు అధైర్య పడొద్దు

వర్షాకాలం పంటలకు నీరందిస్తాం



తుమ్మిడిహట్టి నిర్మిస్తాం

ఎన్డీఎస్ నివేదిక ఆధారంగా యుద్ధ ప్రాతిపదికన డ్యామ్‌కు మరమ్మతులు

జ్యుడీషియల్ ఎంక్వయిరీ తర్వాత దోషులకు శిక్ష తప్పదు : భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వివరాలు 5లో

సంపాదకీయం

అస్మదీయుల చేతివాటం!

ముచ్చటగా మూడవసారి మోడీ ప్రమాణ స్వీకారానికి ముందే, అసలు ఫలితాలు పూర్తిగా రాకముందే, ఇంకా చెప్పాలంటే ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే రూపుదిద్దుకున్న అతి పెద్ద కుంభకోణం ఇది. దేశంలో షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే మధ్యతరగతి 'నిర్భాగ్య' జీవులు ఐదు కోట్ల మందే ఉండి ఉండచ్చు. వాళ్ల జూదం ఆడే 'సెన్సెక్స్' షేర్లు యాభై పేరు మోసిన కంపెనీలవే అయి ఉండచ్చు.

కాని జూన్ 4 డి-డే నాడు (ఇంగ్లీషులో డూమ్స్ డే అంటే ఉపద్రవం ముంచుకొచ్చిననాడు) 31 లక్షల కోట్ల రూపాయల మదుపుదార్ల సంపద ఆవిరై పోయింది. దాన్నే జూన్ 5న బ్లడ్ బాత్ (రక్తపు స్నానం) అని, మార్కెట్ల అల్లకల్లోలమని (మేహెమ్) పత్రికలు ప్రచురించాయి. దీనికి కారణాలు ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రజావ్యతిరేక సంస్కరణలకు బ్రేక్ పడ్తుందనే భయం పట్టుకున్నప్పుడల్లా మార్కెట్లో అమ్మకాలు జరుగుతాయి. మార్కెట్లు కుప్పకూలుతాయి. దీన్నే మరోలా చెప్పుకోవాలంటే, పెట్టుబడికి చెలికాడుగా ఉన్న మోడీ సర్కార్ పడిపోతుందనే భయం మార్కెట్ల బ్లడ్ బాత్‌కి కారణం. ఏడాదికిపైగా రైతాంగం ఢిల్లీ చుట్టూ గేరి వేసి పోరాడినా నిర్దాక్షిణ్యంగా ఆ ఉద్యమాన్ని అణిచివేసే ప్రయత్నం చేసిన మోడీ (చివరికి రైతుల పట్టుదలముందు తలదించినా) సర్కారు పడిపోవడం అంటే పెట్టుబడిదార్లకు ఎంత నష్టం? ప్రతిపక్షాన్ని బయటికి నెట్టేసి నాలుగు కార్మిక కోడ్‌లు ఆమోదించిన ప్రభుత్వాన్ని పెట్టుబడి చేజార్చుకుంటుందా?

ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ దీని వెనకున్న కారణాలపై విచారణ జరపాలని డిమాండ్ చేయడం సకారణంగానే. తమ ఆధ్వర్యంలో, స్థిరమైన ప్రభుత్వం మరింత పెద్ద మెజారిటీతో వస్తోంది కాబట్టి షేర్ మార్కెట్‌లో, కొంత రిస్క్ అయినా, పెట్టుబడిపెడితే బాగా లాభపడతారని సాక్షాత్తూ మోడీయే చెప్పారు. షేర్

స్థూలంగా, కోట్లాది కష్టజీవులకు నష్టం కలిగించే సంస్కరణలను ముందుకు తీసుకెళ్లే 'మొనగాండ్ల'కు నష్టం జరిగితే షేర్ మార్కెట్లు కూలతాయి. దీన్ని బట్టే "మోడీ 3.0"ను అంచనా కట్టాలి. జరిగిన నష్టంపై విచారణ జరగాల్సిందే! ఒకటవ తేదీ ఎగ్జిట్ పోల్స్‌కు 4వ తేదీ ఫలితాలొచ్చే నాటి "బ్లడ్ బాత్"కు మధ్యనున్న లింకే కీలకం. దానిపైనే విచారణ జరపాలని డిమాండ్ చేయడం.



మార్కెట్ పెరుగుదల గురించి ఒక అస్మదీయునితో ప్రశ్న వేయించుకున్న అమిత్‌షా తానేమీ జ్యోతిష్కుణ్ణి కాదని, స్థిరమైన ప్రభుత్వాలుంటే షేర్ మార్కెట్ ఉరుకులు పెడ్తుందని, తమ పార్టీ మరింత పెద్ద మెజారిటీతో అధికారంలోకొస్తామని నర్మగర్భంగా పెట్టుబడులు పెట్టమనే చెప్పాడు. ఇవన్నీ ఓ రెండు వారాలముందు ఘటనలు.

ప్రతిపక్షాల ఆరోపణేమంటే ఎన్డీయేకు అంత భారీ మెజారిటీ వచ్చే అవకాశమే లేదని వేగుల నివేదికలు అప్పటికే వచ్చాయి. అయినా ఎన్నికల్లో ఓట్లడుక్కోకుండా షేర్ మార్కెట్లలో జూదానికి జనాన్ని పురికొల్పుడేంటని? అసలు ఇలాంటి ఘటనలు దేశంలో అంటే పాలకులే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజలను ఈ షేర్ల జూదానికి ప్రోత్సహించిన ఘటనలు ఇప్పటిదాకా లేవు. పెట్టుబడిదారుల మరో ఇష్ట సఖుడు పియూష్ గోయల్ భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంటే రాహుల్‌గాంధీ దాన్ని వెనక్కి లాగుతున్నాడని చెప్పడం విస్తుగొలిపే అంశం.

"తమకు 220 సీట్లు దాటవన్న అంశం తెలిసినా జరిగిన ప్రచారంతో స్టాక్ మార్కెట్లు ఎగిసిపడ్డాయి. చివరికి 31 లక్షల కోట్ల రూపాయల మదుపర్ల సొమ్ము ఆవిరైంది. మార్కెట్లు రక్తమోడాయి" అని రాహుల్‌గాంధీ అన్న మాటలను కొట్టేయలేము. షేర్ మార్కెట్లు పెరగడానికి దోహదపడ్డ ఎగ్జిట్‌పోల్స్, 4వ తేదీతో అధఃపాతాళానికి దొర్లిపోవడం కీలకాంశం. దేశంలో స్టాక్ మార్కెట్లు పడ్డ సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. వామపక్షాలకు అరవై ఒక్క సీట్లు వచ్చి, లెఫ్ట్‌పై ఆధారపడ్డ యూపీఏ ప్రభుత్వం వస్తున్న సందర్భంలో సంస్కరణలు ఆగిపోతాయన్న భయానికి ఒకసారి 'బ్లడ్ బాత్' జరిగింది. 1996లో వాజ్‌పాయ్ 13 రోజుల సర్కార్ పడిపోయిన తర్వాత కూడా మార్కెట్లు రక్తమోడాయి. గతంలో హర్షద్ మెహతా, కేతన్‌పరేఖ్‌ల షేర్ మార్కెట్ స్కాంలను చూశాం. వీళ్ళు షేర్ బ్రోకర్లు. అది కాంగ్రెస్ పాలనలో, మోడీ హయంలో పెట్టుబడికి కాళ్ళు రావడమేకాదు. కోరలూ మరింత పదును తేలాయి. చట్టాలన్నీ వారికి చుట్టాలైనాయి. అన్నింటినీ దేశ, విదేశీ పెట్టుబడిదార్లకే సమర్పిస్తున్నారు.

స్థూలంగా, కోట్లాది కష్టజీవులకు నష్టం కలిగించే సంస్కరణలను ముందుకు తీసుకెళ్లే 'మొనగాండ్ల'కు నష్టం జరిగితే షేర్ మార్కెట్లు కూలతాయి. దీన్ని బట్టే "మోడీ 3.0"ను అంచనా కట్టాలి. జరిగిన నష్టంపై విచారణ జరగాల్సిందే! ఒకటవ తేదీ ఎగ్జిట్ పోల్స్‌కు 4వ తేదీ ఫలితాలొచ్చే నాటి "బ్లడ్ బాత్"కు మధ్యనున్న లింకే కీలకం. దానిపైనే విచారణ జరపాలని డిమాండ్ చేయడం. అసలు కీలక విషయమేమంటే ప్రజలు తమకు ఎవరు బాగా మంచి చేస్తారనుకుంటారో ఆ పార్టీకే ఓట్లు వేస్తారు. మార్కెట్లు పడిపోవడం కోసం కాదన్న విషయం ఈ మార్కెట్ విశ్లేషకులుగా చెప్పుకునేవారు అర్థం చేసుకోవటం అవసరం.

విధి వైపరీత్యం : హిందూ దేవుని బిడ్డకేమిటీ పరిస్థితి!



ఎం కోటేశ్వరరావు
8331013288

మన దేశంలో విధిని నమ్మేవారు ఎక్కువ, నమ్మనివారు తక్కువ. విధి వైపరీత్యం గురించి చెప్పే బాబాలు, జ్యోతిష్కులు, ప్రవచనకారులను రోజూ చూస్తూనే ఉన్నాం. పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానమంటూ కొత్త కొత్త అంశాల గురించి అనేక మంది చెబుతారు. ఫ్రెంచి జ్యోతిష్కుడు నోస్ట్రాడమస్ 1,555లోనే నరేంద్రమోడీ గురించి జోస్యం చెప్పాడని కేంద్ర మంత్రి కిరెన్ రిజుజు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. 2014లో హిందువులు అధికారానికి వస్తారని (అటల్ బిహారీ వాజ్‌పేయ్‌ని హిందువుగా గుర్తించలేదా లేక దుర్భిణికి కనిపించలేదా) భూమ్యాకాశాలను పాలిస్తారని, ఆసియాలో వారిని ఎవరూ నిరోధించలేరని, భారత అధినాయకుడు గుజరాత్‌లో జన్మిస్తాడని, అతని తండ్రి టీ అమ్ముతారని, అతని మొదటి నామం నరేన్‌దసు అని, 2026వరకు అధికారంలో ఉంటారని రాతపూర్వకంగా ఉందని సదరు మంత్రి సెలవిచ్చారు. ఇన్ని చెప్పిన సదరు జ్యోతిష్కుడు బాబరీ మసీదు కూల్చివేత, గుజరాత్ మారణకాండల గురించి, ఆ కారణంగా అమెరికా తన గడ్డమీద అడుగు పెట్టనివ్వదనీ, 2024లో ముస్లిం అనుకూల పార్టీల దయతో ఏలుబడిలోకి వస్తారని ఎలా పసిగట్టలేకపోయారన్నది ప్రశ్న. ఇంకా చాలా ఉన్నాయి. అయోధ్యలో రామమందిరం కట్టిస్తారని, ఓట్ల కోసం దాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తారని, చివరకు అక్కడ పార్టీని గెలిపించటంలో మోడీ చతికిల పడతారని, రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారని నరేంద్రమోడీ ఎవరి గురించి చెప్పారో ఆ సమాజ్‌వాది పార్టీ ప్రతినిధిని ఆ రాముడే తన ఆలయ రక్షణకు గెలిపిస్తారని, బీజేపీని ఓడిస్తారని ఎందుకు చెప్పలేదు. హిందూ హృదయ సామ్రాట్టుగా మన్ననలను అందుకున్న, ముస్లింల సంతుష్టీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన 56 అంగుళాల ఛాతీ ఉన్న ధైర్యవంతుడిగా స్తోత్రపాఠాలు అందుకున్న నేతపట్ల విధి ఎందుకు ఇంత విపరీతంగా ప్రవర్తించినట్లు?నోస్ట్రాడామస్‌ను పక్కన పెడదాం, సాధారణ మానవుల మాదిరిగాక దైవాంశ సంభూతుడిగా జన్మించినట్లు చెప్పుకున్న కారణజన్ముడు సైతం రాగల పరిణామాలను ఎందుకు ఊహించలేకపోయారు.


తాను బతికుండగా ముస్లిం రిజర్వేషన్లను అనుమతించే ప్రసక్తి లేదని నరేంద్రమోడీ ప్రతిజ్ఞ చేశారు, దేశానికి గ్యారంటీ అన్నారు. తాము అధికారంలోకి వస్తే నాలుగుశాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని చంద్రబాబు చెప్పారు. నితీష్ కుమార్ కూడా ముస్లింలకు అనుకూలంగానే వ్యవహరించారు. బీహార్‌లో కులగణన సర్వే వివరాలు నిలిపివేయాలని కోరిన కేసులో సుప్రీంకోర్టు తిరస్కరించిన తీర్పు మరుసటి రోజు 2023 అక్టోబరు ఏడున నితీష్ కుమార్ తన నివాసంలో ముస్లిం మత పెద్దలతో సుదీర్ఘసమావేశం నిర్వహించారు. మైనారిటీల సంక్షేమం, సామాజిక భద్రత గురించి వారికి హామీ ఇచ్చి లోక్‌సభ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కుల సర్వే వివరాల ప్రకారం బీహార్‌లో ముస్లిం జనాభా 17.7శాతం ఉంది. కులగణనలో ముస్లింలలో ఉన్న పాతిక కులాల వారిని అత్యంత వెనుకబడిన తరగతి(ఇబిసి)గా పరిగణించి లెక్కించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్లకు అర్హత కల్పించారు.నితీష్ కుమార్ రిజర్వేషన్ ఫార్ములా ప్రకారం దళితులకు 16, గిరిజనులకు ఒకటి, ఇబిసిలకు 18, ఓబిసిలకు 12, ఇబిసి మహిళలకు మూడు శాతం అని చెప్పారు. ఇదంతా చేసిన తరువాత ఆ పెద్ద మనిషి ఇండియా కూటమినుంచి ఫిరాయించి తిరిగి ఎన్డీయే కూటమిలో చేరి బీజేపీతో అధికారాన్ని పంచుకున్నారు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేశారు. వచ్చే ఏడాది అక్టోబరు-నవంబరు మాసాల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. నితీష్‌కుమార్‌కు అవి పెద్ద పరీక్షగా మారతాయి. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే పార్టీలకు వచ్చిన ఓట్లను చూసినపుడు 2019లో వచ్చిన ఓట్లకంటే ఆరుశాతం తగ్గగా ఇండియా కూటమి ఓట్లు 3.5శాతం పెరిగాయి. ఓట్లపరంగా చూసినపుడు ఆర్‌జెడి 22.41శాతం ఓట్లతో పెద్ద పార్టీగా ఉంది. బీజేపీ 20.5శాతంతో ద్వితీయ, 18.52శాతంతో జెడియు మూడవ స్థానంలో ఉంది.బీజేపీ, జెడియు రెండూ గతంలో ఉన్న లోక్‌సభ స్థానాలలో తొమ్మిదింటిని కోల్పోయాయి. తెలుగు ప్రాంతాలలో ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్లు అనే లోకోక్తి తెలిసిందే. తమ పార్టీ ఓట్ల కోసం ఎవరినీ సంతుష్టీకరించదు, మిగతా పార్టీలన్నీ మైనారిటీల సంతుష్టీకరణకు పాల్పడుతున్నట్లు ఊరూవాడా ప్రచారం చేసిన బీజేపీ గురించి తెలిసిందే. ముస్లిం సంతుష్టీకరణకు వ్యతిరేకం, ఎట్టి పరిస్థితిలోనూ దానికి లొంగేది లేదని చెప్పిన వారు ఇప్పుడు ముస్లిం అనుకూల విధానాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ నాయకత్వంలోని పార్టీల దయమీద కేంద్రంలో అధికారానికి రావటాన్ని ఏమనాలి? ముస్లిం రిజర్వేషన్లు అమలు జరిపితీరుతామని చెప్పిన చంద్రబాబుతో మోడీ రాజీపడతారా లేక చంద్రబాబు నాయుడు నితీష్ కుమార్ ఇద్దరూ మోడీతో సర్దుకుపోదాం పదండి అంటారా? విధి వైపరీత్యం ఎవరితో ఎలా ఆడుకుంటుందో, వారిని నమ్మిన వారిని ఏం చేస్తుందో చూద్దాం.

నరేంద్రమోడీని ఇప్పటి వరకు అనేక మంది విశ్వగురువుగా, ప్రపంచ దేశాలను ప్రభావితం చేసే నేతగా ప్రచారం చేశారు. నిజమే అని నమ్మి అబ్‌కీబార్ ట్రంప్ సర్కార్ అని బాహాటంగా ప్రకటించిన నరేంద్ర మోడీ అమెరికాలో చేతులు కాల్చుకున్నది తెలిసిందే. సదరు ట్రంప్ అధికారం పోయింది. స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేకుండా మోడీకి జనం తగిన పాఠం చెప్పారు. అదే ట్రంప్ మనదేశం వచ్చి నరేంద్ర మోడీకి అనుకూలంగా చెప్పి ఉంటే ఏం జరిగేదో అనూహ్యం.ఎన్నికల తరువాత మోడీ గురించి ప్రపంచం ఏమనుకుంటోంది అంటే మీడియా వ్యాఖ్యలను చూడాల్సిందే. బీజేపీ పెద్దలు తరచూ పాకిస్తాన్‌తో పోల్చి తాము సాధించిన విజయాల గురించి చెప్పుకుంటారు.అదే పాక్ ఆంగ్ల పత్రిక "డాన్ " మన ఎన్నికల గురించి పతాకశీర్షిక పెట్టింది." విద్వేషాన్ని ఓడించిన భారత్, ముస్లిం అనుకూల పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన మోడీ" అని రాసింది. దీన్ని చూస్తే మోడీ భక్తులకు మామూలుగా మండదు. మామ తిట్టినందుకు కాదు తోడల్లుడు తొంగిచూసి కిసుక్కున నవ్వినందుకు అనే ఒక సామెత గుర్తుకు రావటం లేదూ ! అందరూ ఈ వార్తను చూస్తారో లేదోనని ఆ పత్రిక మొదటి పేజీని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి తన 'ఎక్స్' ఖాతాలో పంచుకొని మోడీని ఎద్దేవా చేశారు. నరేంద్రమోడీ హిందూత్వ ఉత్సాహం, ముస్లింలు, ఇతర మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవటాన్ని అంగీకరించని బీహార్, ఆంధ్రప్రదేశ్‌లోని లౌకిక పార్టీల దయమీద ఆధారపడాల్సి వచ్చిందని, కేరళలో తొలి సారిగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థికూడా మైనారిటీలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తని కూడా డాన్ పేర్కొన్నది. బలహీనపడినప్పటికీ ఇంకా ప్రాణాంతకమే అంటూ బీజేపీ, నరేంద్రమోడీ గురించి అదే పత్రిక మరో విశ్లేషణలో హెచ్చరించింది.

"భారత్‌లో మోడీ పార్టీ బీజేపీ తన ఆధిక్యతను ఎలా కోల్పోయింది" అనే ప్రశ్నార్థక శీర్షికతో అంతర్జాతీయ ఎఎఫ్‌పి సంస్థ వార్త ఇచ్చింది. పదేండ్ల క్రితం హిందూ జాతీయనేత అధికారానికి వచ్చిన తరువాత తొలిసారిగా సంపూర్ణ మెజారిటీని సాధించటంలో భారత ప్రధాని నాయకత్వంలోని బీజేపీ విఫలమైంది అని వ్యాఖ్యానించింది. వరుసగా మూడోసారి భారీ మెజారిటీ సాధించటంలో వైఫల్యానికి కారణాలను పేర్కొన్నది. విభజనవాద ప్రచారం దెబ్బతీసింది. హిందూ మెజారిటీని సమీకరించుకొనేందుకు అసాధారణ రీతిలో ముస్లింలకు వ్యతిరేకంగా మోడీ మాట్లాడారు. తన సభల్లో వారిని చొరబాటుదార్లు అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ అధికారానికి వస్తే దేశ సంపదలను ముస్లింలకు పంచుతుందని చెప్పారు. ఇది హిందూ ఓటర్లను ఉత్సాహపరచలేకపోయింది, మైనారిటీల మద్దతు ప్రతిపక్షానికి గట్టిపడేట్లు చేసింది.ఎన్నికల సందర్భంగా తాము ఓటర్లను కదిలించినపుడు ప్రభుత్వ భావజాల(హిందూత్వ) అజెండా కంటే తమకు నిరుద్యోగ సమస్య ప్రధానమని చెప్పినట్లు పేర్కొన్నది. జనం తమ జీవనం, నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి ఎక్కువ ఆవేదన చెందినట్లు, మోడీ, బీజేపీ చెబుతున్నవి తమకు సంబంధం లేని అంశాలుగా జనం భావించారని మోడీ జీవిత చరిత్రను రాసిన నిలంజన్ ముఖోపాధ్యాయ కూడా అన్నట్లు ఈ వార్తా సంస్థ పేర్కొన్నది. పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లలో విఫలం కావటం, దక్షిణాది రాష్ట్రాలలో బలం పెంచుకొనేందుకు పదేపదే పర్యటించినా ఫలితం లేకపోవటం, అయోధ్యలో ఓటమి తదితర అంశాలను అది ఉటంకించింది.

"భారత ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బలు, మోడీ విజయం" అంటూ అమెరికా టీవీ సిఎన్ఎన్ వార్తలను ఇచ్చింది.ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థలో ఓటర్లు ప్రజాకర్ష హిందూ దేశానికి అగ్రతాంబూలం అనే దృక్పథాన్ని ఓటర్లు పాక్షికంగా తిరస్కరించారని విశ్లేషణలో పేర్కొన్నది.మోడీ ముద్రగల హిందూ దేవాలయం ఉన్న పెరటితోటలో తిరుగులేని ఓటమి అంటూ అయోధ్య గురించి న్యూస్‌వీక్ పత్రిక పేర్కొన్నది. ఎట్టకేలకు మేలుకున్న భారతీయ ఓటర్లు అంటూ న్యూయార్క్ టైమ్స్ పత్రిక శీర్షిక పెట్టి విశ్లేషణ రాసింది.అజేయమైన శక్తి అనే మోడీ ప్రతిష్ఠకు చిల్లుపడింది, సంకీర్ణ రాజకీయాలు తిరిగొచ్చాయి అని పేర్కొన్నది. మోడీ, ఆయన పార్టీకి తిరుగులేని దెబ్బ అని వాషింగ్టన్ పోస్టు పేర్కొన్నది. మోడీ పేలవ ప్రదర్శన ప్రతిపక్షం పుంజుకోవటానికి నిదర్శనం అని బ్రిటన్ పత్రిక ఇండిపెండెంట్ పేర్కొన్నది. "మోడీ విజయంతో చైనా, అమెరికాలతో భారత్ మరింత దగ్గర " అంటూ చైనా పత్రిక గ్లోబల్‌టైమ్స్ విశ్లేషణ శీర్షిక పెట్టింది. మోడీ ఏలుబడి తొలి ఐదేండ్లలో చైనాతో ముద్దులతో మొదలై గుద్దులదాకా వచ్చింది, తరు వాత మరింత ఆర్థిక సహకారం కోసం ఉద్రిక్తతలను సడలించింది.2019 నుంచి సరిహద్దు ప్రతిష్ఠంభను ఒక ప్రధాన సమస్యగా చేసింది. మూడోసారి మరింత జాగ్రత్తలతో కూడిన మార్పులు జరగవచ్చు. శాంతియుత, స్థిరమైన సంబంధాలు రెండుదేశాలకూ కీలకం, సంబంధాలు దెబ్బతిన్న ప్పటికీ రెండు దేశాల మధ్య వాణిజ్యం 2023లో అమెరికా-భారత్ లావాదేవీలను అధిగమించింది. గుడ్డిగా వివాదపడితే ఎవరికీ ఉపయోగం ఉండదని రుజువైందని పేర్కొన్నది.

అనేక అంతర్జాతీయ మీడియా సంస్థల విశ్లేషణలు ఇంకా రానున్న రోజుల్లో వెలువడతాయి. వాటితో మోడీ ప్రతిష్ఠ మరింత మసకబారేదే తప్ప వెలిగేది కాదు. దేశీయంగా సంపూర్ణ మెజారిటీ లేని నరేంద్రమోడీ ఇతర పక్షాల మీద ఆధారపడి ఎలా పని చేస్తారో చూడాల్సి ఉంది. అజేయశక్తి అనుకున్న నేత బలహీనత వెల్లడైన తరువాత ప్రపంచ దేశాలు, నేతలు గతం మాదిరే గౌరవిస్తారా?ఎలా స్పందిస్తాయన్నది ప్రశ్న. బీజేపీ, నరేంద్ర మోడీ బలహీన పడివుండవచ్చు తప్ప ప్రమాదకరంగా ఉంటారన్నది ఇండియా కూటమే కాదు, ఎన్డీయే పక్షాలూ గ్రహించాలి. తన మిత్రపక్షాలను అది ఎలా మింగేసిందీ టీడీపీ, శివసేనకూ తెలిసిందే.



తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే పార్టీలకు వచ్చిన ఓట్లను చూసినపుడు 2019లో వచ్చిన ఓట్లకంటే ఆరుశాతం తగ్గగా ఇండియా కూటమి ఓట్లు 3.5శాతం పెరిగాయి. ఓట్లపరంగా చూసినపుడు ఆర్‌జెడి 22.41శాతం ఓట్లతో పెద్ద పార్టీగా ఉంది. బీజేపీ 20.5శాతంతో ద్వితీయ, 18.52శాతంతో జెడియు మూడవ స్థానంలో ఉంది.బీజేపీ, జెడియు రెండూ గతంలో ఉన్న లోక్‌సభ స్థానాలలో తొమ్మిదింటిని కోల్పోయాయి.తెలుగు ప్రాంతాలలో ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్లు అనే లోకోక్తి తెలిసిందే. తమ పార్టీ ఓట్ల కోసం ఎవరినీ సంతుష్టీకరించదు, మిగతా పార్టీలన్నీ మైనారిటీల సంతుష్టీకరణకు పాల్పడుతున్నట్లు ఊరూవాడా ప్రచారం చేసిన బీజేపీ గురించి తెలిసిందే. ముస్లిం సంతుష్టీకరణకు వ్యతిరేకం, ఎట్టి పరిస్థితిలోనూ దానికి లొంగేది లేదని చెప్పిన వారు ఇప్పుడు ముస్లిం అనుకూల విధానాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ నాయకత్వంలోని పార్టీల దయమీద కేంద్రంలో అధికారానికి రావటాన్ని ఏమనాలి? ముస్లిం రిజర్వేషన్లు అమలు జరిపితీరుతామని చెప్పిన చంద్రబాబుతో మోడీ రాజీపడతారా లేక చంద్రబాబు నాయుడు నితీష్ కుమార్ ఇద్దరూ మోడీతో సర్దుకుపోదాం పదండి అంటారా?

బీఆర్ఎస్‌కు ఎందుకీ దుస్థితి?



గుండెబోయిన శ్రీనివాస్
9985194697

మంగళవారం వెలువడిన లోకసభ ఎన్నికల ఫలితాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు ఒక్క స్థానం కూడా దక్కకపోవడం ఆశ్చర్యం గొలిపే విషయమే. ఎందుకంటే ఆరునెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికలలో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ కన్నా కేవలం రెండు శాతం లోపు ఓట్ల తేడాతో రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించిన ఆ పార్టీ, ఇప్పుడు లోకసభలో అసలు ప్రాతినిధ్యమే లేని స్థితికి చేరుకోవడం వెనుక బలమైన కారణాలే కనిపిస్తాయి. ప్రజా పోరాటం ద్వారా రాష్ట్రాన్ని, తద్వారా అధికారాన్ని కైవసం చేసుకున్న ఆ పార్టీ ఆ ఉద్యమానికి సంబంధించిన ఏ చిన్న ఆనవాలును కూడా మిగలకుండా చేయడం వల్ల ప్రస్తుతం ఆ పార్టీకి కూడా ఏమీ మిగలకుండా పోయే పరిస్థితి దాపురించింది. చివరికి పార్టీ 'పేరును' కూడా చెరిపేసుకున్న చెడ్డ పేరును మూటకట్టుకోవడం కూడా అందులో ఒక భాగమే. 'ఇకనుండి టీఆర్ఎస్ ఉద్యమ పార్టీ కాదు - ఫక్తు రాజకీయ పార్టీ' అని రాష్ట్రం ఏర్పడిన కొత్తలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఉద్యమ పార్టీగా ఉండక పోయినా కనీసం ఉద్యమ స్ఫూర్తితో అయినా పనిచేయక పోతుందా? అని సరి పెట్టు కున్న చాలా మందికి తీవ్ర నిరాశే ఎదురయింది. అందుకు ఈ దశాబ్దకాలంలో అది అందించిన పాలన, అవలంబించిన ఎత్తుగడలు, చేసిన రాజకీయాలే బీఆర్ఎస్ ఈ దుస్థితి రావడానికి ముఖ్య కారణం. తనతో పాటు ఉద్యమించిన 'దోస్తుల' ను దూరం చేసుకుని ఉద్యమ 'ద్రోహుల'ను అక్కున చేర్చుకోవడం వల్ల కలిగిన పర్యవసానాలను తరువాత కాలంలో తెలంగాణ సమాజం సునిశితంగానే గమనిస్తూ వచ్చింది.

'నీళ్లలో అవకతవకలే, 'నియామకాల'లో అవకతవకలే,ఇక 'నిధుల' గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఆ పార్టీ వ్యవహార శైలి మూలంగా 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదపు స్ఫూర్తి పూర్తిగా నీరు కారిపోయింది. తెలంగాణను ఒక కుటుంబంగా, తనను తాను ఆ కుటుంబానికి పెద్దగా అభివర్ణించుకున్న అధినేత అధికారం సొంతమయ్యాక మాత్రం తన సొంత కుటుంబమే తెలంగాణ కుటుంబం అన్నట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. తన కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెట్టడం మీద ఉన్న శ్రద్ధ,యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో చూపించకపోవడం తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా బాధించిన విషయాలలో ఒకటి. ఎదుటి పార్టీలను చీల్చడం ద్వారా వాటిని బలహీనపరచాలనుకోవడం, వ్యక్తుల గుణగణాలతో సంబంధం లేకుండా అర్హతలేని వారిని ఎందరినో పార్టీలో చేర్చుకోవడం ద్వారా పార్టీ బలపడతుందనుకున్నాడు. దానికి బదులు, పార్టీ నిర్మాణం మీద కనుక శ్రద్ధ చూపించినట్లయితే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే ఆశ్చర్యకరంగా ఇరవై శాతం ఓటు బ్యాంకును కోల్పోయి ఉండేవారు కాదు. 'మా నాయకుడు మొరిగే కుక్కలను పార్టీలో చేర్చుకొని పిల్లుల్ని చేసి ఓ మూలన పడవేశాడు' అని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఆ పిల్లులే గోడ మీది పిల్లులై నేడు దర్జాగా గోడలు దూకే కార్యక్రమంలో నిమగ్నం కావడం ఊహించి ఉండరు. శాసనసభ ఎన్నికల తరువాత ప్రారంభమైన ఈ క్రతువు, ఉధృతమై,ఒక ఉద్యమంలా సాగి, ఆఖరికి పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడితే అందుకు అధినాయకత్వాన్నే తప్ప ఇతరులను తప్పు పట్టలేము.

ఆయన రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూస్తే ప్రజలు ఆయన పార్టీకి లోకసభలో ప్రాతినిధ్యమే లేకుండా చేశారు. ఇది నిజంగా విషాదమే. పాలనలో పారదర్శకత లోపించడం, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించకపోవడం, ఎవరికీ అందుబాటులో ఉండకపోవడం, హద్దులు మీరిన అభిజాత్యం, స్వపక్షాన్ని కూడా సంప్రదించక పోవడం, అంతా ఏకపక్షంగా వ్యవహరించడం అనే అవలక్షణాల వల్ల ఆ పార్టీ చేసినటువంటి కొన్ని మంచి పనులు కూడా మరుగున పడే పరిస్థితి ఏర్పడింది. పాలన గాడి తప్పింది. ఒక ఉద్యమం ద్వారా సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యమ గొంతుకలకు భిన్నాభిప్రాయాలకు స్థానం లేకపోవడం దేనికి సంకేతం? అసలు ఉద్యమ స్ఫూర్తిని నిర్వీర్యం చేయడం వల్లనే వ్యవస్థలు నిర్వీర్యం కావడం ప్రారంభమయ్యాయన్నది జనాభిప్రాయం. ఏ ఆత్మగౌరవం కోసం అయితే ఇక్కడ ఉద్యమం జరిగిందో రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజలకు ఆ ఆత్మగౌరవానికి చోటే లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజలలో బలంగా నాటుకుపోయింది. ఒక దశాబ్దం క్రితం వరకు టీఆర్ఎస్‌ను గానీ, దాని అధి నాయకుడైన కేసీఆర్‌ను గానీ విమర్శించాలని ప్రయత్నిస్తే, తెలంగాణ ప్రజలు ఆ విమర్శకులను రాళ్లతో కొట్టే పరిస్థితి ఉండేది.కానీ ఇప్పుడు ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయి, దాని అవినీతి, కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్న సందర్భంలో, ఆ పార్టీని, దాని అధినేతను సమర్థించాలని ప్రయత్నిస్తే, ఆ సమర్థకులను ప్రజలు రాళ్లతో కొట్టే పరిస్థితులు ఈ రాష్ట్రంలో నెలకొనడం, ఆ పార్టీ స్వయంకృతం.


నిరంతర రచనా పథికుడు 'దాశరథి'



కామిడి సతీష్‌రెడ్డి
9848445134

"నేను కత్తీ, డాలూ పట్టుకోలేను. సాయుధుడినై ఎదిరించలేను. నా పెన్నే నా గన్ను" అని చాటిన ఘనాపాటి దాశరథి రంగాచార్యులు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన ధీరుడు. ఆయన బాల్యం నుంచి మొదలుకుని చివరిశ్వాస వరకు వివిధ సాహితీ ప్రక్రియల్లో రచనలు చేశారు. ఆయన తన రచనల ద్వారా ప్రజల్ని మేల్కొల్పడానికి, అన్యాయాన్ని ఎదిరించేలా పురిగొల్పడానికి ఇష్టపడేవారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నినదించిన దాశరథి కృష్ణమాచార్యులు రంగాచార్యకు స్వయాన అన్న. తెలంగాణ వేదనను, వీరత్వాన్ని దాశరథి సోదరులు స్వయంగా అనుభవించి సాహిత్యంలో పలవరించారు. ఆంధ్ర మహాసభ ప్రేరణతో అన్న నైజాం సంస్థానానికి వ్యతిరేకంగా ఉద్యమబాట పట్టారు. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధన చేసేవారు. ఇంతలో అన్న కృష్ణమాచార్య జైలు పాలుకావడంతో ఇంటి బాధ్యతలన్నీ రంగాచార్య మోయాల్సి వచ్చింది. కుటుంబం ఉద్యమ ప్రభావంలోకి వెళ్లడంతో తండ్రి వెంకటాచార్యులు భార్యబిడ్డలను వదిలేసి వెళ్లిపోయారు. బతుకుదెరువు కోసం తల్లి వెంకటమ్మ హరికథలు చెబితే, రంగాచార్యులు లైబ్రేరియన్‌గా పనిచేశారు. ఉద్యమం చివరిదశకు చేరుకున్న సమయంలో రజాకార్లు పేట్రేగి దాశరథి కుటుంబంపై దాడులు చేశారు. ఆ సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన రంగాచార్య తుపాకీ పేల్చడంలో శిక్షణ తీసుకుని రజాకార్లను ఎదురొడ్డి నిలిచారు.

1948 సెప్టెంబరు 16న పోలీస్ యాక్షన్ తరువాత రంగాచార్య ఉద్యమం నుండి బయటకొచ్చారు. స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత ప్రజలను పీడించిన దొరలే ఖద్దరు, గాంధీ టోపీ ధరించి రాజకీయ నాయకులుగా అవతారమెత్తారు. రంగాచార్య వారి మధ్య ఇమడలేక పోయారు. స్వయంకృషితో చదువుకొని 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరి 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా రిటైరయ్యారు. మారేడ్‌పల్లి మున్సిపల్ ప్లేగ్రౌండ్ పక్కన ఉన్న ఇరుకైన సందులోని మూడు గదుల ఇల్లు ఆయన గడిపిన సాధారణ జీవితానికి అద్దం పడుతుంది. తెలంగాణ సాయుధ పోరాటానికి రంగాచార్య రచనలు ఎంతగానో దోహదం చేశాయి. ఒక లక్ష్యశుద్ధితో తన రచనలు కొనసాగించారు. ఆయన సాహితీ సేవ విలక్షణమైనది, విస్తృతమైనది, విభిన్నమైనది. రంగాచార్య రచనలు భావోద్రేకాలు రగిలించేకన్నా భావోద్వేగాలు కలిగిస్తాయి. మహా రచయిత వట్టికోట ఆళ్వారుస్వామి రచనలు ప్రజలపై ఎంతటి ప్రభావం చూపాయో అందరికీ తెలిసిందే. ఆళ్వారు స్వామి వదిలి వెళ్లిన రచనా ఉద్యమాన్ని రంగాచార్య తన భుజ స్కంధాలపై మోశారు. ఆయన తన దైన పద్ధతిలో తెలంగాణ ప్రజల జీవన చిత్రణ కోసం నవలా రచనకు పూనుకున్నారు. మొత్తం తొమ్మిది నవలలు రాశారు. వీటిలో 'చిల్లరదేవుళ్లు', 'మోదుగుపూలు', 'జనపదం' పీరియాడిక్ నవలలు



కావడంతో ఒక నవల ముగింపు మరో నవలకు ప్రారంభమవుతుంది. ఆయన తన తొలి నవల 'చిల్లరదేవుళ్ల'ను 1969లో వెలువరించారు.

రంగాచార్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొనడం ద్వారా నాటి వాతావరణాన్ని, ఆ కాలంలోని బానిస పరిస్థితులను ఈ నవలల్లో విస్పష్టంగా ప్రస్ఫుటీకరించారు. గార్ల ప్రాంతంలోని జాగీర్దార్ల దాష్టికాలను ఈ నవలలో కండ్లకు కట్టించారు. ఈ నవలలోని పీరిగాడు, పాణిమంజరి, ఇందిర పాత్రలు ఆనాటి సమాజంలోని ప్రజలకు ప్రతినిధులు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942-48 మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. రంగాచార్య నిర్వహించిన పోరాట చిత్రణమే ఈ నవలలోని ఇతివృత్తం. ఈ నవల చదివే చంద్ర రాజేశ్వరరావు రంగాచార్యను 'ఆంధ్ర గోర్కీ'గా అభివర్ణించారు. ఆయన రాసిన నవలల్లో తెలంగాణ పలుకుబడులను, నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. నగర సమస్యల ఇతివృత్తంతో 'మాయాజలతారు' నవల రాశారు.సుదీర్ఘ తెలంగాణ సామాజిక పరిణామాలను తన రచనల్లో ప్రతిబింబించిన రంగాచార్య తన ఆత్మకథను 'జీవనయానం'పేరుతో తీసుకొచ్చారు. మౌలికంగా ఈ రచన ఆయన స్వీయచరిత్రే అయినా పాఠకులకు ఎక్కడా స్వోత్కర్ష కనపడదు. తానేమిటో చెప్పేకన్నా, ఒక రచయితగా తన బాధ్యత ఏమిటో జీవనయాత్రలో అవగతం చేశారు. ఈ రచనలో రంగాచార్య తన జీవితంలో పాటు, ఏడు దశాబ్దాల తెలుగు జాతి జీవనాన్ని చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010లో వెలువరించారు.

రంగాచార్య నవలలు ఎక్కువగా రాసినా తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథా సాహిత్యం అంటే ఆయనకెంతో అభిమానం.రంగాచార్య చేతి నుంచి జాలువారిన కథా సంపుటి 'నల్లవాగు'. సమర సాహిత్యానికి చెందిన 'రణరంగం', 'రణభేరి', 'జనరంగం' ఆయన రచనలే. తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితుడైన రంగాచార్య తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకున్నారు. అనంతర కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి 'అభినవ వ్యాసుని'గా ఖ్యాతిగాంచారు. వేదాలను అనువాదం చేయడానికి ముందు ఆయన తన వేషధారణ కూడా మార్చుకున్నారు. పంచె కట్టుకోవడం, చొక్కా వేసుకోకుండా శాలువా కప్పు కోవడం, నుదుట నామాలు పెట్టుకోవడం చాలామందిని ఆశ్చర్యపర్చింది. ఇది ఆయన జీవితంలో వైరుధ్యంగా కనిపించిన విషయం. దీనికి ఆయన 'మతం వ్యక్తిగతమైనది. మార్క్సిజానికి, నా వేషధారణకు, వేదాల అనువాదానికి మధ్య వైరుధ్యమేమీ లేదు" అంటూ నిక్కచ్చిగానే సమాధానమిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ చిన్నగూడురులో 1928 ఆగష్టు 24న జన్మించిన రంగాచార్య 2015 జూన్ 8న చనిపోయారు. అయితే ఆయన జన్మించిన మానుకోట నేలకు ధాశరథి జిల్లాగా పేరు పెట్టాలనేది ఈ ప్రాంతవాసుల కోరిక. ఆయన తెలంగాణ సమాజాన్ని తన రచనల ద్వారా చైతన్యపరిచిన తీరును నేటితరం రచయితలు, కవులు అధ్యయనం చేసి ఆచరణకు పూనుకోవడమే దాశరథి సోదరులకు మనమిచ్చే నివాళి.

(నేడు దాశరథి రంగాచార్య వర్ధంతి)

తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితుడైన రంగాచార్య తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకున్నారు. అనంతర కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి 'అభినవ వ్యాసుని'గా ఖ్యాతిగాంచారు. వేదాలను అనువాదం చేయడానికి ముందు ఆయన తన వేషధారణ కూడా మార్చుకున్నారు. పంచె కట్టుకోవడం, చొక్కా వేసుకోకుండా శాలువా కప్పు కోవడం, నుదుట నామాలు పెట్టుకోవడం చాలామందిని ఆశ్చర్యపర్చింది. ఇది ఆయన జీవితంలో వైరుధ్యంగా కనిపించిన విషయం. దీనికి ఆయన 'మతం వ్యక్తిగతమైనది. మార్క్సిజానికి, నా వేషధారణకు, వేదాల అనువాదానికి మధ్య వైరుధ్యమేమీ లేదు" అంటూ నిక్కచ్చిగానే సమాధానమిచ్చారు.



పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనై నిలుస్తా..

- పేదలకు ఇండ్లు, స్థలాల పట్టాలకు కృషి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- సీపీఐ కార్యాలయం సందర్శన.. నేతలకు కృతజ్ఞతలు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

పార్లమెంటులో వరంగల్ ప్రజల గొంతుకనై నిలుస్తానని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఎంపీగా గెలిచిన కడియం కావ్య స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి శుక్రవారం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులను కలిసి ఎన్నికలలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విలేకర్ల సమావేశంలో కడియం కావ్య మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను సొంత పార్టీ అభ్యర్థిగా భావించి సీపీఐ కార్యకర్తలు కష్టపడి పనిచేసి గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్‌లో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో పేదలు, గుడిసె వాసులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలకు పట్టాలు అందించేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ...పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని మట్టికరిపించేందుకు సీపీఐ కార్యకర్తలు కృషి చేశారన్నారు. కాంగ్రెస్ గెలుపులో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. పార్లమెంటులో ఈ ప్రాంత సమస్యలపై గళం వినిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, పి.సుగుణమ్మ, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే భాషామియా, మద్దెల ఎల్లేష్ పాల్గొన్నారు.

హోమియోపతి ఆస్పత్రిలో కూలిన స్లాబ్ పెచ్చులు ఇద్దరికి గాయాలు

- రామంతాపూర్‌లో ఘటన



నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి ఇన్ పేషంట్ వార్డులో సిలింగ్ పెచ్చులు ఊడి మీద పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పీజీ విద్యార్థిని స్నేహిత, హెడ్ నర్సు గాయపడ్డారు. వారిని మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు తెలిపారు. స్నేహిత తలకు బలమైన గాయమై.. 8 కుట్లు పడ్డాయి. హెడ్ నర్స్ సునీతకు స్వల్ప గాయాలయ్యాయి. ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, నాయకులు ఆస్పత్రిని పరిశీలించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఆస్పత్రులకు నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.

మౌలిక సదుపాయాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోమియోపతి ఆస్పత్రికి ఇటీవల రూ.10 లక్షల గ్రాంట్ విడుదల అయిందని, మరమ్మతులు, ఇతర సదుపాయాల కోసం విడుదల చేశారని సూపరిం టెండెంట్ లక్ష్మీదేవి చెప్పారన్నారు. ఆ నిధులను సక్రమంగా వాడనందునే ఈ ఘటన జరిగిందన్నారు. నాణ్యత పాటించకుండా పనులు చేసి రంగులతో ఆస్పత్రి భవనాన్ని ముస్తాబు చేశారని ఎద్దేవా చేశారు. తక్షణమే ఈ వార్డులోని పేషంట్‌లను ఇతర వార్డులకు మార్చాలన్నారు. ప్రభుత్వం, డిపార్టుమెంట్ ఆఫ్ ఆయుష్ శాఖ ఈ ఘటనపై విచారణ జరిపించి నిర్లక్ష్యం కనబర్చిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అమెరికాతో హైదరాబాద్ బంధం బలమైనది

- అమెరికా స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అమెరికాతో హైదరాబాద్ బంధం బలమైనదనీ, రాబోయే రోజుల్లో ఇది మరింత బలోపేతం అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. యునైటెడ్ స్టేట్స్ కాన్సలేట్ జనరల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి లోని ఓ ప్రయివేటు హోటల్లో జరిగిన యూఎస్ 248 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూఎస్ కాన్సలేట్ జనరల్ జెన్నీ ఫర్ లార్సన్ ఆయన్ని స్వాగతించారు. ఈ సదర్భంగా యూఎస్ పోలీసుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ప్రజాస్వామ్యాన్ని పరిఢవిల్లేలా కృషి చేస్తున్నదన్నారు. భారతదేశానికి వ్యూహాత్మకంగా అమెరికా మంచి మిత్ర దేశమనీ, తెలుగు ప్రజలకు అమెరికాతో అవినాభావ సంబంధం ఉం దని తెలిపారు. భారతదేశ ప్రజలు అభివృద్ధి చెందేందుకు అమెరికా అండగా నిలిచిందని చెప్పారు.

సాగునీటిపారుదల సలహాదారుగా ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యనాథ్ దాస్

- సర్కారు ఉత్తర్వులు జారీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ సాగునీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సలహాదారుగా మాజీ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్ నియమితు లయ్యారు. ఆయన 1987 బ్యాచ్‌కు చెందిన ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి కావడం గమనార్హం. దాస్ 2021 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి జీవో నెంబరు 811ని విడుదల చేశారు. ఇటీవల మరణించిన రంగారెడ్డి స్థానంలో ఆదిత్యనాథ్ దాస్‌ను నియమించారు.

రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని ప్రవేశ పెట్టొద్దు

- ముఖ్యమంత్రికి బీఆర్ఎస్ నేత క్రిశాంక్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని ప్రవేశ పెట్టొద్దని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్తగా మద్యం కంపెనీలకు అనుమతివ్వలేదని ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత నెలలో ప్రకటించిన వారం రోజులకే మధ్యప్రదేశ్‌కు చెందిన సోమ డిస్టలరీకి అనుమతిచ్చారని ఆరోపించారు. సదరు కంపెనీపై దేశ వ్యాప్తంగా అనేక ఆరోపణలున్నాయని గుర్తు చేశారు. ఆ కంపెనీ రాష్ట్రాల ఖజానాలకు గండి కొడుతూ, ప్రభుత్వ సంస్థల వద్ద రుణాలను తీసుకొని ఎగ్గొడుతూ, కల్తీ మద్యం వ్యాపారం చేయడంలో ప్రఖ్యాతిగాంచిందని విమర్శించారు. అవినీతి అక్రమాలకు పాల్పడే సోమ డిస్టలరీకి రాష్ట్రంలో అనుమతిస్తే కల్తీ మద్యం ఏరులై పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే సదరు కంపెనీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులు అధైర్య పడొద్దు

వర్షాకాలం పంటలకు నీరందిస్తాం | **తుమ్మిడిహట్టి నిర్మించి తీరుతాం**

- ఎన్డీఎస్ నివేదిక ఆధారంగా యుద్ధ ప్రాతిపదికన డ్యామ్‌కు మరమ్మతులు
- జ్యుడీషియల్ ఎంక్వయిరీ తర్వాత దోషులకు శిక్ష తప్పదు :భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ- భూపాలపల్లి/మంథని

రైతులు అధైర్య పడొదు.. ఈ వానాకాలం సీజన్‌కు సాగునీళ్లిస్తామని భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నాసిరకంగా నిర్మించడం వల్లే మేడిగడ్డ కుంగిందన్నారు. ప్రాజెక్టు రిపేర్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకుని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద మరమ్మతు పనులు చేపట్టినట్టు చెప్పారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం, మేడిగడ్డ లక్ష్మీబ్యారేజ్, పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల(పార్వతి) బ్యారేజీని మంత్రి సందర్శించారు. మరమ్మతు పనులను పరిశీలించి.. ఇంజినీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేడిగడ్డలోని ఎల్‌ఎంటీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ప్రాజెక్టు మరమ్మతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తాము అధికారంలోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులతో ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు రక్షణ కోసం 3 ఏజెన్సీలకు పనులు అప్పగించినట్టు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పిదాలను తెలుసుకునేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్ బ్యారేజీ సందర్శనకు వస్తుందన్నారు. తమ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా తమ్మిడిహెట్టి ప్రాజెక్టు తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. వర్షాకాలం లోపు మరమ్మతులు వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నారం ప్రాజెక్ట్‌లో 60శాతం, మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌లో 80 శాతం పనులు పూర్తి కావొచ్చాయన్నారు. సుందిళ్లలో మాత్రం పనులు నత్తనడకన సాగుతుండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టడానికి గత ప్రభుత్వం రూ.94 వేల కోట్లు ఖర్చు చేస్తే లక్ష ఎకరాల ఆయకట్టు మాత్రమే తయారైందని, అది కూడా ఇప్పుడు కుంగుబాటుకు గురైందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మూడు బ్యారేజీలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన 94 వేల కోట్ల రూపాయలకు వడ్డీ కడుతున్నామన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను ఎల్‌అండ్‌టి, అన్నారం ఆఫ్రాన్ కన్‌స్ట్రక్షన్స్, సుందిళ్ల బ్యారేజీని నవయుగ కంపెనీలతో తాత్కాలిక మరమ్మతులు చేపిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జ్యుడీషియల్ విచారణ నడుస్తోందని తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన దోషులకు శిక్ష తప్పదని అన్నారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డికి రూ.23,500 కోట్లు ఖర్చు పెట్టి ఎకరం ఆయకట్టు ఇవ్వలేదన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ.7000కోట్లు ఖర్చుపెట్టినా ఎకరం ఆయకట్టు ఇవ్వలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే తుమ్మిడిహట్టి దగ్గర రూ.38వేల కోట్లతో 16లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు డిపిఆర్ సిద్ధం చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టు పక్కన పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే దీని కరెంట్ బిల్లే రూ.10 వేల కోట్లు వస్తోందని ఎద్దేవా చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలు సాగులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

సుందిళ్ల మరమ్మతులపై అసంతృప్తి

సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనుల్లో ఆలస్యంపై మంత్రి ఉత్తమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలన్నారు. బ్యారేజ్ సమీపంలో గల పంప్‌హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రితో కలిసి అంచనా వేసి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారిని ఆదేశించారు.

మంత్రి వెంట ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జనరల్ జి.అనిల్ కుమార్, ఇంజినీర్లు, ఎల్‌అండ్‌టీ, అస్కాన్, నవయుగ సంస్థల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

జాతీయ హోదా ఇవ్వలేదు..

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదని గత ప్రభుత్వ నాయకులు తెలిపారని, తాము అధికారంలోకొచ్చిన తర్వాత కేంద్ర జల వనరులశాఖ మంత్రిని కలిస్తే అసలు జాతీయ హోదా కోసం వారు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరితే 60శాతం నిధులు కేంద్రం నుంచి కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గతంలోనే డిజైన్ చేసిన డీపీఆర్ ప్రకారం పనులు పూర్తి చేస్తామని తాము మ్యానిఫెస్టోలో కూడా ప్రకటించినట్టు గుర్తు చేశారు.

ఎల్‌అండ్‌టి ఇంజినీరింగ్ చీఫ్ మాట్లాడుతూ.. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచనల మేరకు జీఆర్‌పీ టెస్ట్, ఈఆర్‌పి టెస్ట్, స్టైండ్ ఫైల్స్, ఇంటిగ్రిటిసిటీ చేయమన్నారని, గేట్లు ఎత్తి ఉంచాలని తెలిపారన్నారు. వరదలు వస్తే 5మీటర్ల ఎత్తులో జియో ట్యూబ్‌లు ఏర్పాటు చేస్తే నీటిని ఎత్తిపోయొచ్చన్నారు. అన్నారంలో 11మీటర్లు నీటిని ఆపితే ఎత్తిపోయొచ్చని, సుందిళ్లలో 9 మీటర్లు ఆపితే ఎత్తిపోయొచ్చని అన్నారు.

గళమెత్తిన గ్రామ పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకుంటే విధులను బహిష్కరిస్తామని హెచ్చరిక



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి, తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు వెళ్లబోమని దాదాపు గంటపాటు అక్కడే బైటాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న వారికి, కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యలను పరిష్కరిస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి జిల్లాలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తూ తదితర న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుండా కార్మికులందరూ నిరవధిక సమ్మెకి సిద్ధం ఉన్నారని, వారంలోపు వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించనున్నట్టు హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూశం రమేష్, అన్నల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, అంజయ్య, మహేష్, నర్సయ్య కార్మికులు పాల్గొన్నారు.

కవిత పాత్రపై సీబీఐ మరో చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

వేలకు పైగా పేజీలతో కవిత రోల్ ను సీబీఐ పేర్కొన్నట్టు తెలిసింది. శుక్రవారం కవితపై దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్ అంశాన్ని సీబీఐ తరపు న్యాయవాదులు రౌస్ ఎవెన్యూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చట్ట ప్రకారం నిర్ణీత సమయంలో కవితపై ఈ చార్జిషీట్ ను దాఖలు చేశామని, దీనిని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. అయితే ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకునే అంశంపై జులై 6 విచారణ చేపడతామని కోర్టు వెల్లడించింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈ ఏడాది మార్చి 15 ఈడీ, ఏప్రిల్ 11న కవితను దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐలు అరెస్ట్ చేశాయి. ఇప్పటికే ఈ కేసులో కవిత పాత్రపై ఈడీ సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేయగా, 3న ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. తాజాగా కవిత పాత్రపై సీబీఐ మరో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. వాస్తవానికి రౌస్ ఎవెన్యూ కోర్టులో ఏడేండ్ల వరకు శిక్ష పడే కేసుల్లో దాదాపు 60 రోజుల్లో అరెస్ట్ చేసిన నిందితులపై చార్జి షీట్ దాఖలు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత పెట్టుకున్న మధ్యంతర, రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను ట్రయల్ కోర్టు తిరస్కరించింది. దీంతో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, గత నెల 28న ఇరువైపు వాదనలు ముగించిన జస్టిస్ సర్వకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు.

జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

సీబీఐ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ ఎవెన్యూ కోర్టు మరోసారి పొడగించింది. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో శుక్రవారం కవితను జైలు అధికారులు వీడియో కాన్ఫరెన్స్(విసి) ద్వారా కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కవిత కస్టడీని పొడిగించాలని సీబీఐ తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, కవిత జ్యుడీషియల్ కస్టడీని 21 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు వెల్లడించారు.

స్నేహితుల మధ్య మనస్పర్థలతోనే ఇద్దరి హత్య

- వివరాలు వెల్లడించిన శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డి



నవతెలంగాణ-శంషాబాద్

స్నేహితుల మధ్య ఏర్పడిన మనస్పర్థలు చివరికి ఇద్దరి దారుణ హత్యకు దారి తీశాయి. ఇటీవల జరిగిన ఇద్దరు యువకుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.నారాయణరెడ్డి శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కడ్తాల్ మండల పరిధిలోని గోవిందాయపల్లి గ్రామానికి చెందిన గండమోని శివ(28) చికెన్ షాప్ వర్కర్, శేషగిరి శివ(28) కారు డ్రైవర్. వీరిద్దరూ బంధువులు. వీరు స్వగ్రామం నుంచి మీర్‌పేట్‌లోని గాయత్రినగర్‌కు వలస వచ్చి పని చేస్తున్నారు. గతంలో బీజేవైఎంలో పనిచేశారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. అదే గ్రామానికి చెందిన జెల్కం రవి రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇతనికి శివలిద్దరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 4న రవి జన్మదిన వేడుకలను బటర్ ఫ్లై సిటీ విల్లాలో ఘనంగా చేసుకున్నారు. ఈ వేడుకలకు సంబంధించి తీసిన ఫొటోలను గ్రామానికి చెందిన గ్రూపులో పోస్ట్ చేశాడు. సుమారు 200 నుంచి 300 వరకు ఫొటోలు పోస్ట్ చేయడంతో గండమోని శివ వాటిని గ్రూప్ నుంచి తీసేసాడు. దీంతో అవమానంగా భావించిన జల్కం రవి అతనితో వాగ్వాదానికి దిగాడు. గండమోని శివపై రవి కక్ష పెంచుకున్నాడు. ఇందులో భాగంగానే జంగారెడ్డిపల్లికి చెందిన పల్లె నాగరాజుగౌడ్, గోవిందాయపల్లికి చెందిన తలకొండ రాజు, గెలుకుంట విజయ్, మిట్ట ప్రవీణ్, దాసు శేఖర్, టి.జగదీష్‌తో కలిసి పథకం వేశాడు. 5న రవి ఇన్నోవా కారులో మీర్‌పేట్ వెళ్లి గండమోని శివ, శేషగిరి శివను బలవంతంగా కారులో ఎక్కించుకున్నాడు. అక్కడి నుంచి రవి నివాసం ఉంటున్న విల్లాకు తీసుకె ళ్లాడు. వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన పోస్టులు, డిలీట్ చేసిన విషయంపై గండమోని శివపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో నాగరాజ్‌గౌడ్ తన దగ్గర ఉన్న కత్తితో శివను విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దాన్ని చూసి శేషగిరి శివ భయపడి పారిపోవడానికి ప్రయ త్నించాడు. లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో పారిపోలేకపోయాడు. దీంతో అందరూ కలిసి మూకుమ్మడిగా అతనిపైనా దాడి చేసి కత్తితో పొడిచి చం పేశారు.

పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి..

- ఇంటర్ వార్షిక పరీక్షలు విధులు నిర్వహించిన వారికి వెంటనే ఇవ్వాలి
- రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్ష మూల్యాంక కేంద్రాల వద్ద క్యాంప్ ఆఫీసర్లకు వినతిపత్రాలు



నవతెలంగాణ- విలేకరులు

ఇంటర్ బోర్డు నిర్వహించే ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల నిర్వహణలో పాల్గొనే వారికి పెండింగ్ రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఆందోళన నిర్వహిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మూల్యాంక కేంద్రాల వద్ద క్యాంప్ ఆఫీసర్లకు వినతి పత్రాలు ఇచ్చినట్టు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్- 475, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం ఇంటర్ పబ్లిక్ వార్షిక పరీక్షల, ప్రాక్టికల్స్, థియరీ మరియు స్పాట్ విధులు అనంతరం సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించేవారని, కానీ గత రెండు సంవత్సరాల నుంచి తెలంగాణ ఇంటర్ బోర్డు ఆన్లైన్ ద్వారా చెల్లిస్తానని చెబుతూ, చాలా ఇబ్బందులు గురి చేస్తోందని అన్నారు. 2023, 2024 పెండింగ్ రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించలేదని

,ఈ విషయంపై గత రెండు నెలలుగా అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవార ఇంటర్ మూల్యాంకన కేంద్రాల వద్ద భోజనం విరామ సమయంలో నిరసన తెలియజేసినట్టు తెలిపారు. ఖమ్మం, హనుమకొండ, జగిత్యాల, అదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌గర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, కొత్తగూడెం, నల్లగొండ, హైదరాబాద్ (కస్తూర్బా గాంధీ వెస్ట్ మారేడ్‌పల్లి) ఇంటర్ క్యాంప్ ఆఫీసర్లకు మూల్యాంక కేంద్రాల వద్ద వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 9న మూల్యాంక కేంద్రంలో పనిచేస్తున్న అధ్యాపకుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని క్యాంప్ ఆఫీసర్లకు ఇవ్వనున్నట్టు శ్రీనివాస్ కె. సురేష్ తెలిపారు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని ఇంటర్ వార్షిక పరీక్ష విధుల్లో పాల్గొనే సిబ్బందికి వెంటనే రెమినేషన్ చెల్లించేవిధంగా చూడాలని కోరారు. ఈ విషయమై ఇంటర్ బోర్డు కార్యదర్శి సానుకూలమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు.

సివిల్ సప్లై హమాలీ నూతన రేట్ల ఒప్పందం వెంటనే చేయాలి

- లేకపోతే జూన్ 20న సివిల్ సప్లై భవన్ ముట్టడి : తెలంగాణ సివిల్ సప్లైస్, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సివిల్ సప్లై హమాలీ నూతన రేట్ల ఒప్పందం వెంటనే చేయాలనీ, లేకపోతే జూన్ 20న సివిల్ సప్లై భవన్ ముట్టడిస్తామని తెలంగాణ సివిల్ సప్లైస్, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) హెచ్చరించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లై భవన్ ముందు హమాలీ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం పౌరసరఫరాలశాఖ కమిషన్ డీ.ఎస్.చౌహాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ధర్నాను ఉద్దేశించి ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు మాట్లాడుతూ సివిల్ సప్లైస్, జీసీసీ 178 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉండగా 3,260 మంది హమాలీ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి రోజూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు, హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనం నిర్వహించే పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకులను చేరవేయడంలో వీరి పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి రెండేండ్లకు ఒకసారి హమాలీ రేట్ల ఒప్పందం జరుగుతుందనీ, గతంలో చేసిన ఒప్పంద గడువు 2023 డిసెంబర్‌తో ముగిసిందని గుర్తుచేశారు. నూతన రేట్ల ఒప్పందం 2024 జనవరి ఒకటి నుంచి అమలు చేయాల్సి ఉందని తెలిపారు. కేవలం సివిల్ సప్లైస్ అధికారులు నిర్లక్ష్యంతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కమిషనర్‌కు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతోనే ధర్నా చేపట్టినట్టు తెలిపారు.

హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో హమాలీలు 20, 30 ఏండ్ల నుంచి పని చేస్తున్నా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గత ఒప్పందంలో అంగీకరించిన సమస్యలనూ పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లై హమాలీలకు అమలు చేస్తున్న పీఎఫ్‌లు జీసీసీ హమాలీలకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏండ్లు పైబడిన వారికి పెన్షన్, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, స్వీపర్లకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనీ, హమాలీలందరికీ కాలనీలో నిర్మాణం చేయాలని కోరారు. హమాలీ సంఘం నాయకులతో జాయింట్ మీటింగ్ పెట్టి చర్చించి ఒప్పందం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాలయ్య, జీసీసీ హమాలీల రాష్ట్ర అధ్యక్షులు బుస్సా మొగిలి, రాష్ట్ర నాయకులు వీరస్వామి, సవారి, గోపాల్, జంగయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

ముందున్నది ముసళ్ల పండగే...!

మోడీ ఏకచ్ఛత్రాధిపత్యానికి గండి

- నడ్డా వ్యాఖ్యలపై ఆర్‌ఎస్‌ఎస్ ఆగ్రహం
- పార్టీలో రగులుతున్న అసమ్మతి చిచ్చు
- మిత్రులను మెప్పించకుంటే ముప్పే



న్యూఢిల్లీ : దేశభక్తి ముసుగులో దశాబ్దం పాటు బీజేపీ సాగించిన ఆధిపత్యానికి ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీని చేరుకోలేకపోవడంతో మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బల నుండి కోలుకోవడానికి ఆ పార్టీకి చాలా కాలమే పట్టేలా ఉంది. గత పది సంవత్సరాలుగా కమలదళంలో అంతా కేంద్రీకృత రాజకీయాలే నడిచాయి. మోడీ ఆడింది ఆట...పాడింది పాటలా సాగిపోయింది. సంస్థాగతంగా పార్టీ బలపడలేదు. పాత మూస పద్ధతిలోనే వ్యవహారాలు నడిచాయి.

బీజేపీ సంస్థాగతంగా ప్రధాని మోడీ, ఆయన ఇద్దరు ప్రధాన సన్నిహితులు అమిత్ షా, జేపీ నడ్డాల నియంత్రణలో ఉండిపోయింది. ఈ ఇద్దరిలో కూడా అమిత్ షా తరచుగా ప్రధానితో సంప్రదింపులు జరిపేవారు. వారిద్దరూ తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేందుకే నడ్డా పరిమితమయ్యే వారు. బీజేపీ అధ్యక్షుడుగా నడ్డా పదవీకాలం జనవరితోనే ముగిసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆయన ఆ పదవిలోనే కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు నూతన అధ్యక్షుడిని బీజేపీ ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఆయన ఇటు... ఈయన అటు

2019లో అమిత్ షాకు కేంద్ర మంత్రి పదవిని, నడ్డాకు పార్టీ అధ్యక్ష పదవిని మోడీ కట్టబెట్టారు. అంతకుముందు నడ్డా కేంద్ర క్యాబినెట్‌లో ఉండేవారు. అమిత్ షా పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించే వారు. 2019లో మోడీ రెండోసారి ప్రధాని పదవిని చేపట్టిన తర్వాత వీరిద్దరి పదవులు మారాయి. అప్పటి మాదిరిగా ఇప్పుడు బీజేపీకి చట్టసభలో మెజారిటీ లేదు. మిత్రపక్షాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. గత దశాబ్ద కాలంలో కొనసాగిన కేంద్రీకృత రాజకీయాలను ఇప్పుడు మిత్రులు సహిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిన విషయం.

ప్రక్షాళన అనివార్యం

మోడీ ప్రభుత్వంలో అమిత్ షాకు లభించిన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. క్యాబినెట్‌లో ఆయనది రెండో స్థానం. ఇప్పుడు ఆ స్థానాన్ని మిత్రపక్షాలు అంగీకరించకపోవచ్చు. విధానపరమైన ప్రతి నిర్ణయం ప్రధాని కార్యాలయంలోనే జరగడానికి ఆ పార్టీలు ఒప్పుకోకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో మోడీ ముందున్న తక్షణ కర్తవ్యం ప్రభుత్వాన్ని సుస్థిరపరచుకోవడం. ముందుగా మిత్రుల డిమాండ్లను తీరుస్తూ, ఆ తర్వాత తన అధికారాన్ని పెంచుకోవడానికి ఆయన ప్రయత్నించాల్సి ఉంటుంది. నడ్డా స్థానంలో పార్టీ అధ్యక్షుడిని నియమించుకోవడంతో పాటు సంస్థాగతంగా బీజేపీని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నూతన అధ్యక్షుడే తన బృందాన్ని ఎంపిక చేసుకోవాలి.

అదంత ఈజీ కాదు

బీజేపీలోని త్రిమూర్తుల (మోడీ, షా, నడ్డా) మధ్య సంబంధాలు, వీరిలో కూడా నడ్డాకు పెద్దగా అధికారాలు లేకపోవడం వంటి అంశాలను పరిశీలిస్తే ఆయన తనకు తానుగా అలాంటి ప్రకటన చేసి ఉంటారని భావించలేము. ఈ ప్రకటన పార్టీ అత్యున్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయం మేరకు వచ్చిందేనని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా ఇలాంటి ప్రకటనలు మోడీని ముమ్ముందు మరిన్ని ఇబ్బందుల్లో పడేసే అవకాశం ఉంది. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పలువురు ప్రచారక్‌లను (పూర్తి స్థాయి కార్యకర్తలు) పార్టీ కోసం పనిచేసేందుకు పంపారు. ఈ నేపథ్యంలో బీజేపీ వ్యవహారాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రమేయాన్ని తక్కువగా అంచనా వేయలేము. ఎన్నికల ఫలితాలను చూస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావం నుండి బీజేపీ బయటపడడం అంత సులభంగా కన్పించదు.

ఆర్‌ఎస్‌ఎస్ సహకారం లేకుంటే...

అమిత్ షా బీజేపీ అధ్యక్షుడు అయిన తర్వాత ఆ పార్టీలో ఎవరైనా చేరేందుకు వీలుగా 'మిస్డ్ కాల్' విధానాన్ని ప్రవేశపెట్టారు. బీజేపీ సభ్యత్వం పొందాలంటే పెద్దగా కష్టపడాల్సిన పని లేకుండా చేశారు. ప్రపంచంలో బీజేపీయే అతి పెద్ద పార్టీ అని, చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం కంటే బీజేపీ సభ్యులే అధిక సంఖ్యలో ఉన్నారని నాయకత్వం భావించింది. కానీ ఓ సిద్ధాంతానికి, కార్యక్రమానికి పార్టీ నాయకత్వం కట్టుబడలేదు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసే కార్యకర్తలు ఆ పార్టీకి లేరు. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకుల వ్యవస్థ తోడ్పాటు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించడం బీజేపీకి సాధ్యమయ్యే పనికాదు. నడ్డా ప్రకటన నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు పొందడం ఇకపై బీజేపీకి అంత సులభం కాదు. నడ్డా ప్రకటనతో ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమే కాదు...దాని అనుబంధ కార్మిక, రైతు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. బాహాటంగా నిరసన వ్యక్తం చేయకపోయినప్పటికీ లోలోన రగిలిపోతున్నాయి.

బీజేపీ సెల్ఫ్ గోల్

అయితే బీజేపీ ఎదుర్కోబోయే అతి పెద్ద సవాలు ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు. ఎన్నికల ప్రచారం సందర్భంగా నడ్డా ఓ సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాలలో...అవి ఎన్నికలు కావచ్చు లేదా ప్రచారం కావచ్చు... ఆర్‌ఎస్‌ఎస్ అవసరం లేదని స్పష్టం చేశారు. నడ్డా వ్యాఖ్యలతో బీజేపీ సెల్ఫ్ గోల్ చేసుకుంది. ఆయన వ్యాఖ్య కారణంగానే బీజేపీ మ్యాజిక్ ఫిగర్ 272ని చేరుకోలేకపోయిందన్న వాదన కూడా విన్పిస్తోంది.

పెల్లుబుకుతున్న అసమ్మతి

బీజేపీ నాయకత్వానికి పార్టీలోని పలువురు సీనియర్ నేతలు మద్దతు ఇస్తూ ఉండవచ్చు. కానీ అనేక రాష్ట్రాల్లో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. అది ఏ క్షణంలో అయినా అగ్నిపర్వతం మాదిరిగా పేలి పోవచ్చు. ముఖ్యంగా సంవత్సరాల తరబడి బీజేపీ కోసం కష్ట పడుతూ విధేయులుగా ఉన్న వారికి కాకుండా ఇటీవలే పార్టీ తీర్థం పుచ్చుకున్న వలస వాదులకు టిక్కెట్లు ఇవ్వడంతో ఆగ్రహం పెల్లుబుకు తోంది. ఒకవేళ మోడీ ముమ్ముందు కూడా ఫిరాయింపులను ప్రోత్సహిస్తే ఈ ఆగ్రహజ్వాలలు మరింతగా ప్రజ్వరిల్లే ప్రమాదం ఉంది. ఇదిలావుండగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లో మోడీకి ఉన్న సంబంధాలు అంత సజావుగా లేవు. యోగి ప్రాధాన్యత ఎక్కడ పెరుగుతుందోనన్న ఆందోళన మోడీలో కన్పిస్తోంది. అందుకే యోగిని ఎప్పటికప్పుడు నియంత్రించేందుకు ప్రయత్నించారు. నితిన్ గడ్కరీ వంటి పలువురు సీనియర్ నేతల విషయంలోనూ మోడీ ప్రవర్తన ఇలాగే ఉంది. తాజా ఎన్నికల్లో మోడీ ప్రాభవం మసకబారడంతో అసమ్మతి కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది. వీటిని పరిష్కరించ లేకపోతే మోడీ నాయకత్వానికే ఎసరు రావచ్చు.

ఈ జాగ్రత్తలు తప్పవు

2001లో మోడీ తొలిసారిగా రాజ్యాంగ పదవిని చేపట్టారు. అప్పటి నుండి నిన్నటి వరకూ ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టినా, ప్రధాని పదవిని నిర్వహించినా పూర్తి మెజారిటీతోనే ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలన సాగించారు. ఇప్పుడు తొలిసారిగా మెజారిటీకి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రధాని తన పనితీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో వ్యవహరించేటప్పుడు ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయాల విషయంలో కూడా మిత్రులు, పార్టీ నేతలను ఎప్పటికప్పుడు సంప్రదించాల్సి ఉంటుంది. సొంత పార్టీ నేతలతోనూ, సంఘ్ పరివార్‌తోనూ జాగ్రత్తగా మసలు కోవాల్సి ఉంటుంది. నూతన భారతావనిని ఆవిష్కరించడం మాట అటుంచి, ముందుగా నూతన బీజేపీకి రూపకల్పన చేసే విషయంపై దృష్టి సారిస్తే మంచిది. లేకుంటే ముందున్నది ముసళ్ల పండగే అవుతుంది.

కులగణన చేపట్టాలి

- మోడీని కోరుతా : మాజీ ఎంపీ వి హనుమంతరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధాని మోడీని కలిసి కులగణన చేపట్టాలంటూ డిమాండ్ చేస్తానని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. మరోసారి మోడీకి ప్రజలు అవకాశం ఇచ్చారనీ, ఈ రకమైన ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సీలింగ్ ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మోడీ బడుగు బలహీనవర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమిలో జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు కీలక పాత్ర పోషించబోతున్నదని తెలిపారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్లు బీసీలకు వచ్చిందన్నారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోడీ కొనసాగించాలని కోరారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే...బీసీలకు మేలు జరుగుతుందనీ, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైనా కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు.

యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలు

- వామపక్ష శక్తుల హవా : ఎగ్జిట్ పోల్స్

అమెస్టర్‌డామ్ : యూరోపియన్ దేశాల నిర్ణయాలను ప్రభావితం చేసే యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి కలిగిస్తున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఎన్నికలు ఈ నెల 9 వరకూ జరగనున్నాయి. ఈసారి ఎన్నికల్లో వామపక్ష శక్తులు గణనీయమైన వృద్ధితో సీట్లు సాధించనున్నాయని వివిధ ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. నెదర్లాండ్స్, ఐర్లాండ్, చెక్ రిపబ్లిక్ వంటి ఎనిమిది యూఈ దేశాల్లో నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ వామపక్ష శక్తుల హవాను ఖాయం చేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఈపీపీ) గ్రూపు స్పష్టమైన మెజారిటీని సాధిస్తుందని యురోన్యూస్ ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. సోషలిస్టులు రెండో శక్తిగా ఉంటారని, రెన్యూ యూరోప్ ఉదారవాదులు ఈసారి ఎక్కువ సంఖ్యలో స్థానాలు కోల్పోయినా మూడోస్థానంలో ఉంటారని అంచనా. వామపక్ష శక్తులు ఎక్కువ సంఖ్యలో స్థానాలు గెలుచుకున్నా కొత్తగా ఎన్నికైన పార్లమెంట్‌లో వీరి ఆధిపత్యం ఉండదని నిపుణులు చెబుతున్నారు.

యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌లో మొత్తం 720 మంది సభ్యులు (ఎంఈపీ) ఉంటారు. 27 దేశాల నుంచి వీరిని ఎన్నుకుంటారు. ప్రతీ ఐదేండ్లకు ఎన్నికలు నిర్వహిస్తుంటారు.

రామడి పేరుతో వ్యాపారం

- దేశాన్ని మోసం చేశారు
- ప్రజలు దీన్ని అర్థం చేసుకున్నారు
- అయోధ్యలో గెలిచిన ఫైజాబాద్ ఎంపీ, ఎస్పీ నేత అవధేశ్ ఆరోపణలు



లక్నో : రాముడి పేరుతో బీజేపీ వ్యాపారం చేసిందనీ, అసత్యాలు ప్రచారం చేసి దేశాన్ని మోసం చేసిందని ఫైజాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిపై సంచలన విజయం సాధించిన దళిత నేత, సమాజ్‌వాద్ పార్టీ(ఎస్పీ) నాయకుడు అవధేశ్ ప్రసాద్ ఆరోపించారు. వాస్తవానికి రామ మందిర నిర్మాణం జరిగిన అయోధ్య ప్రాంతం.. ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కిందకు వస్తుంది. రామ మందిర నిర్మాణం పేరుతో ఫైజాబాద్‌తోనే కాకుండా దేశం మొత్తం హిందువుల ఓట్లను కొల్లగొట్టాలని బీజేపీ భావించింది. అయితే, బీజేపీకి ఫైజాబాద్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ నుంచి రెండు సార్లు ఎంపీగా విజయం సాధించిన బీజేపీ నాయకుడు లల్లూ సింగ్‌ను.. ఎస్పీ దళిత నాయకుడు అవధేశ్ ప్రసాద్ మట్టికరిపించారు. రామ మందిర ప్రాంతంలోనే ఈ ఓటమి బీజేపీకి మింగుపడటంలేదని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

కాగా, రిజర్వ్‌కాని సీటు నుంచి పోటీ చేసి, బీజేపీ ఇలాఖాలో ఆ పార్టీ అభ్యర్థిని ఓడించిన అవధేశ్ విజయం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన విజయాన్ని స్థానిక ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న దళిత నాయకులు, సామాజికవేత్తలు అభినందిస్తున్నారు. ఎస్పీ వ్యవస్థాపక సభ్యుడైన అవధేశ్.. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యారు. అయితే, బీజేపీపై అవధేశ్ మాత్రం సంచలన ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ రాముడి పేరుతో వ్యాపారం చేసిందని అన్నారు. 'హమ్ రామ్ కో లాయే హై (మేము రాముడిని తిరిగి తీసుకువచ్చాము)' అంటూ బీజేపీ దేశంలో అసత్యాలను ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాముడి పేరుతో దేశాన్ని మోసం చేశారు. రాముడి పేరుతో వ్యాపారం చేశారు. రాముడి పేరుతో ద్రవ్యోల్బణం పెరిగేలా చేశారు. రాముడి పేరుతో నిరుద్యోగాన్ని సృష్టించారు. రాముడి పేరుతో పేదలను, రైతులను ఏరివేసారు. రాముడి గౌరవాన్ని ధ్వంసం చేసేలా బీజేపీ పని చేసింది. ప్రజలు దీన్ని అర్థం చేసుకున్నారు" అని ఎస్పీ ఎంపీ అవధేశ్ ప్రసాద్ అన్నారు. " నాపై అందరికీ నమ్మకం ఉంది. కులం ప్రస్తావనకు రాలేదు. రాజ్యాంగాన్ని మార్చాలంటే బీజేపీకి 400 సీట్లు అవసరమని లల్లూ సింగ్ అన్నారు. అతను ఇలా అనకూడదు. ఆయన వ్యాఖ్యలకు ప్రజలు ఇష్టపడలేదు" అని తన గెలుపునకు గల కారణాన్ని అవధేశ్ చెప్పారు.

రాజకీయ రంగంలోకి ఇలా..

న్యాయశాస్త్రంలో పట్టభద్రుడైన అవధేశ్ ప్రసాద్.. తన 21వ ఏట క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అతను చరణ్ సింగ్‌కు చెందిన భారతీయ క్రాంతి దళ్‌లో చేరాడు. 1974లో అయోధ్య జిల్లాలోని సోహవాల్ నుంచి తన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. ఎమర్జెన్సీ సమయంలో,ఆయన ఎమర్జెన్సీ వ్యతిరేక సంఘర్ష్ సమితికి ఫైజాబాద్ జిల్లా కో-కన్వీనర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో ఆయన అరెస్టయ్యాడు. జైలులో ఉన్నప్పుడు ఆయన తల్లి మరణించింది. ఆమె అంత్యక్రియలకు హాజరు కావటానికి కూడా అతను పెరోల్ పొందలేకపోయాడు. " నేను మా అమ్మను (ఆమె చివరి క్షణాల్లో) చూడలేకపోయాను. ఎమర్జెన్సీ కాలంలో నేను జైలులో ఉన్నాను. ఆమె మృతదేహాన్ని ఐదు రోజులు ఉంచారు. కానీ అమ్మ చివరి దర్శనం చేసుకోలేకపోయాను. నేను జైల్లో ఉన్నప్పుడు మా అమ్మ నన్ను కలవటానికి వచ్చింది. ఆ సమయంలో ఆమె చాలా సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

ఎమర్జెన్సీ తర్వాత, అవధేశ్ ప్రసాద్ పూర్తి స్థాయి రాజకీయ నాయకుడిగా మారటానికి న్యాయవృత్తిని విడిచిపెట్టాడు. 1981లో అప్పటి లోక్‌సభ ఉపఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్ గాంధీపై పోటీ చేసిన లోక్‌దళ్ అభ్యర్థి శరద్ యాదవ్‌కు కౌంటింగ్ ఏజెంట్‌గా అమేథీలో ఉండటంతో అవధేశ్ ప్రసాద్ తన తండ్రి అంత్యక్రియలకు హాజరు కాలేదు. "చౌదరి చరణ్ సింగ్ నన్ను తన కారులో కూర్చోబెట్టి, 'అవధేష్ జీ, ఎన్నికలు ముగిసిన తర్వాతే మనం తిరిగి వెళ్లగలం' అని చెప్పాడు. నేను కౌంటింగ్ ఏజెంట్‌ని. మా నాన్న మరణవార్త తెలియగానే చివరిసారిగా ఆయనను చూడాలా లేక నా రాజకీయ గురువు చౌదరి చరణ్ సింగ్ మాట వినాలా అనే సందిగ్ధంలో పడ్డాను. నేను చరణ్ సింగ్ ఆదేశాలను అనుసరించి 14 రోజుల తర్వాత ఇంటికి వెళ్లాను"అని ఆయన గుర్తు చేసుకున్నాడు.

అవధేశ్ ప్రసాద్.. 1992లో ఎస్పీని ప్రారంభించినప్పుడు ములాయంసింగ్ యాదవ్ పక్షాన నిలిచారు. ఆ తర్వాత ఆయన పార్టీ జాతీయ కార్యదర్శిగా, కేంద్ర పార్లమెంటరీ బోర్డు సభ్యునిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఎస్పీలో అతిపెద్ద దళిత నాయకుడిగా ఉన్నాడు. "ఇది(ఫైజాబాద్ ఎంపీగా) నా విజయం కాదు. ఇది అయోధ్యలోని గొప్ప వ్యక్తుల విజయం" అని అవధేష్ ప్రసాద్ చెప్పాడు.



కాంగ్రెస్ సెంచరీ

- ఇండిపెండెంట్ 'మహా' ఎంపీ బేషరతు మద్దతు
- వందకు చేరిన హస్తం పార్టీ బలం
- సాంగ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన విశాల్ పాటిల్

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో 99 స్థానాల వద్ద ఆగిపోయిన కాంగ్రెస్ ఇప్పుడు సెంచరీ మార్కును చేరింది. మహారాష్ట్రలోని సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎంపీగా ఎన్నికైన విశాల్ పాటిల్ కాంగ్రెస్ పార్టీకి తన బేషరతు మద్దతును ప్రకటించారు. దీంతో 18వ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ బలం పెరిగింది. కాంగ్రెస్‌కు ఇప్పుడు 100 మంది ఎంపీలు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత, కాంగ్రెస్ సంప్రదాయక కంచుకోట అయిన సాంగ్లీ సీటు శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)కి దక్కటంతో కాంగ్రెస్ కార్యకర్తలు కలత చెందారు. అయితే విశాల్ పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. విశాల్ పాటిల్ మహావికాస్ అఘాడి(ఎంవీఏ), మహాయుతి(ఎన్డీఏ) రెండింటి అభ్యర్థులను ఓడించారు. రెండుసార్లు బీజేపీ ఎంపీగా ఎన్నికైన సంజయ్ పాటిల్ కంటే విశాల్ పాటిల్‌కు 1,00,053 ఓట్లు ఎక్కువ వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతూ పాటిల్ లేఖ అందిన తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ వంటి స్ఫూర్తిదాయక మహనీయులకు విశాల్ పాటిల్ నిర్ణయం సముచితమైన నివాళి అని ఖర్గే ప్రశంసలు గుప్పించారు.

విశాల్ పాటిల్ ఎవరు?

విశాల్ పాటిల్ కుటుంబానికి కాంగ్రెస్, గాంధీ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వసంతదాదా పాటిల్ మనవడు విశాల్ పాటిల్. విశాల్ దివంగత తండ్రి ప్రకాష్ బాపు పాటిల్ కూడా ఎంపీగా ఉండగా, ఆయన సోదరుడు ప్రతీక్ పాటిల్ యూపీఏ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గం ఎప్పుడూ కాంగ్రెస్‌కు కంచుకోటే. అయితే 2014లో లోక్‌సభ ఎన్నికల్లో విశాల్ సోదరుడు ప్రతీక్ పాటిల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2019 లో, విశాల్.. రైతు నాయకుడు రాజు శెట్టి స్వాభిమాని షెట్కారీ పార్టీ నుంచి ఎన్నికలలో పోటీ చేశాడు. అయితే ఓట్ల చీలిక కారణంగా.. బీజేపీ అభ్యర్థి సంజయ్ పాటిల్ రెండోసారి ఇక్కడ నుంచి గెలిచారు.

దళిత, ముస్లిం ఓట్లు నిర్ణయాత్మక అంశం

2019 లోక్‌సభ ఎన్నికలలో సాంగ్లీ లోక్‌సభ నియోజకవర్గంలో చీలిక ఏర్పడింది. వంచిత్ బహుజన్ అఘాడి(వీబీఏ) అభ్యర్థి 2.5 లక్షలకు పైగా ఓట్లు సాధించటంతో అది కాస్తా విశాల్ ఓటమికి దారితీసింది. అయితే, ఈ ఏడాది ఎన్నికల్లో వీబీఏ తన సొంత అభ్యర్థిని నిలబెట్టకుండా విశాల్‌కు మద్దతిచ్చింది. దీంతో దళిత, ముస్లిం ఓట్లు విశాల్‌కు కలిసొచ్చాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మరోవైపు, మహాయుతి అభ్యర్థి సంజయ్ పాటిల్ కోసం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ర్యాలీలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో అభివృద్ధి పనుల కంటే హిందుత్వ, హిందూ-ముస్లిం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ప్రజల మధ్య విభేదాలు రెచ్చగొట్టి మతం ఆధారంగానే ఓట్లు సాధించాలనేది వారి ప్రచార ప్రసంగాల్లో కనిపించింది. అయితే, సాంగ్లీలోని ఓటర్లు మాత్రం హిందుత్వ కార్డును తిరస్కరించి విశాల్ పాటిల్‌ను తమ ఎంపీగా ఎన్నుకున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగానూ ఎన్డీఏకు చేదు ఫలితాలు రావటంతో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్.. తన పదవికి సిద్ధమైన విషయం విదితమే.

ఇండియాలో అన్ని కులాలకూ ప్రాతినిధ్యం

- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకూ సముచిత స్థానం
- ఎన్డీఏ ఎంపీల్లో కానరాని ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు
- అగ్ర కులాలకే అధిక ప్రాధాన్యత

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరంలో కులాలు ప్రధాన పాత్ర పోషించాయి. అటు అధికార ఎన్డీఏ, ఇటు ప్రతిపక్ష ఇండియా ఫోరం సామాజిక న్యాయాన్ని పరస్పర విరుద్ధమైన దృష్టితో చూశాయి. ఒకే మతం నీడన హిందూ కులాలను ఏకం చేసేందుకు బీజేపీ ప్రయత్నించింది. మరో వైపు సామాజిక న్యాయ సాధనకు కులం కీలకమైన సాధనమని ప్రతిపక్ష కూటమి భావించింది. మొత్తంమీద ఎన్డీఏతో పోలిస్తే ఇండియా బ్లాక్ లోనే వివిధ కులాలు, వర్గాలకు సముచిత ప్రాధాన్యత లభించినట్టు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో 2019, 2024 ఎన్నికల్లో దిగువసభలో వివిధ కులాలు, వర్గాలకు లభించిన ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే...

ఏ కులం వారు ఎందరు?

17వ లోక్‌సభ సభ్యుల్లో 28.5 శాతం మంది అగ్రకులాల వారు ఉండగా 18వ సభకు 25.8 శాతం మంది మాత్రమే ఎన్నికయ్యారు. కర్నాటకకు చెందిన ఒక్కళిగులు, తమిళనాడులోని వెల్లలాలు, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని జాట్లు, బీహార్‌లోని కుర్మీలు, కొయిరీలు, మధ్యప్రదేశ్‌లోని లోధాలు, ఆంధ్రప్రదేశ్‌లోని కమ్మ రెడ్లు...ఇలా కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైన కులాల వారు గత సభలో 14.4 శాతం మంది ఉంటే రాబోయే సభలో 13.6 శాతం మంది ఉంటారు. ఓబీసీల సంఖ్య 22.8 శాతం నుంచి 25.4 శాతానికి పెరిగింది. ఎస్సీల సంఖ్య 15.5 శాతం నుంచి 15.8 శాతానికి స్వల్పంగా పెరగ్గా ఎస్టీల సంఖ్య 10.1 శాతం వద్ద స్థిరంగా ఉంది. ముస్లింల సంఖ్య 5.0 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది. క్రైస్తవుల సంఖ్య అప్పుడు, ఇప్పుడూ 1.3 శాతంగానే ఉంది. సిక్కుల సంఖ్య 2.0 శాతం నుంచి 2.4 శాతానికి పెరిగింది. గత లోక్‌సభలో బౌద్ధులు 0.2 శాతం మంది ఉంటే ఇప్పుడు ఒక్కరు కూడా లేరు. గుర్తించని కులాల వారు గత సభలో 0.2 శాతం మంది ఉంటే 18వ లోక్‌సభలో వారి సంఖ్య 1.1 శాతానికి పెరుగుతుంది.



హిందీ రాష్ట్రాల్లో...

హిందీ రాష్ట్రాల్లో కులాలు, వర్గాల ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే... అగ్ర కులాల వారి సంఖ్య 38.9 శాతం నుంచి 32.7 శాతానికి తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమైన కులాలకు చెందిన వారి సంఖ్య 6.2 శాతం నుంచి 6.6 శాతానికి పెరిగింది. ఓబీసీ సభ్యుల సంఖ్య కూడా 25.7 శాతం నుంచి 31.0 శాతానికి పెరిగింది. ఎస్సీల సంఖ్య 17.3 శాతం నుంచి 17.7 శాతానికి, ఎస్టీల సంఖ్య 8.0 శాతం నుంచి 8.4 శాతానికి పెరిగింది. హిందీ రాష్ట్రాల నుంచి ముస్లింల ప్రాతినిధ్యం మాత్రం 3.5 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గిపోయింది.

కూటముల వారీగా...



కులాలు, వర్గాల వారీగా ఎన్డీఏ, ఇండియా ఫోరం తరఫున లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల వివరాలను పరిశీలిస్తే...ఎన్డీఏ ఎంపీల్లో అగ్రకులాల వారు 33.2 శాతం, ఇండియా బ్లాక్‌కి చెందిన వారు 12.4 శాతం మంది ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే కన్పించే కులాలకు సంబంధించిన సభ్యులు ఎన్డీఏ పక్షాన 15.7 శాతం మంది ఎన్నికైతే ఇండియా బ్లాక్ నుంచి 11.9 శాతం మంది గెలుపొందారు. ఎన్డీఏ ఎంపీల్లో ఓబీసీలు 26.2 శాతం మంది ఉంటే ఇండియా బ్లాక్ ఎంపీలు 30.7 శాతం మంది ఉన్నారు. ఎన్డీఏ ఎంపీల్లో ఎస్సీలు 13.3 శాతం, ఎస్టీలు 10.8 శాతం మంది ఉండగా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు ప్రాతినిధ్యం లేదు. అదే ఇండియా బ్లాక్‌లో ఎస్సీలు 17.8 శాతం, ఎస్టీలు 9.9 శాతం, ముస్లింలు 7.9 శాతం, క్రైస్తవులు 3.5 శాతం, సిక్కులు 5 శాతం ఉన్నారు.

బిజినెస్

ఎనిమిదో'సారీ' వడ్డీ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ : అధిక వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం కోరుకుంటున్న రుణ గ్రహీతలకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి నిరాశనే మిగిల్చింది. వరుసగా ఎనిమిదోసారి కూడా వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. గతంలో 2023 ఫిబ్రవరిలో చివరిసారి రెపో రేటును మార్చింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరింగ్ పాలసీ కమిటీ (ఎంపీసీ) భేటీ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడుతూ.. రెపో రేటు 6.5 శాతంగానే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రెపో రేటును యథాతథంగా ఉంచేందుకు ఆరుగురు ఎంపిసి సభ్యుల్లో నలుగురు అనుకూలంగా ఓటు వేశారన్నారు. ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య వరుసగా వడ్డీ రేట్లను పెంచింది. ఆరు సార్లలో 2.50 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెంచి 6.50 శాతానికి చేర్చింది. దీంతో వడ్డీ, వాయిదా చెల్లింపులు ఎక్కువై రుణాలు భారం అయ్యాయి. ఈ క్రమంలోనే అనేక మంది గృహ, వాహన, వ్యక్తిగత రుణ గ్రహీతలు ఇకనైనా వడ్డీ రేట్లలో తగ్గుదల ఉండొచ్చని ప్రతీ సారి ఆశించిన వారికి భంగపాటే జరుగుతోంది

శాఖహారం 9 శాతం ప్రియం

- క్రిసిల్ రిపోర్ట్



న్యూఢిల్లీ: శాకహారం భోజనం మరింత ఖరీదు అయ్యింది. ఉల్లి, టమోటా, బంగాళ దుంపల రేట్లు పెరిగిపోవడం వల్ల గడిచిన ఏప్రిల్‌లో శాఖహార భోజనం ప్లేట్ 'వెజ్ థాలీ' వ్యయం 9 శాతం పెరిగిందని క్రిసిల్ ఎంఅండ్ఎ రీసెర్చ్ వెల్లడించింది. మరోవైపు చికెన్ రేట్లు తగ్గడం వల్ల మాంసహార ప్లేట్ ధర దిగివచ్చిందని పేర్కొంది. గతేడాది మేలో మాంసహార థాలీ ధర రూ.59.9గా ఉండగా.. గడిచిన నెలలో రూ.55.9కి తగ్గింది. బ్రాయిలర్ చికెన్ ధరలు 16 శాతం క్షీణించడంతో నాన్ వెజ్ థాలీ ధర తగ్గినట్లు నివేదిక తెలిపింది. క్రిసిల్ రిపోర్ట్ ప్రకారం..

రోటీ, కూరగాయలు, అన్నం, పప్పు, పెరుగు, సలాడ్‌లతో కూడిన వెజ్ థాలీ ధర మే నెలలో నెలలో రూ.27.80కి పెరిగింది. గతేడాది ఇదే నెలలో పెరిగిన రూ.25.5తో పోలిస్తే ఎక్కువ. గడిచిన మే నెలలో టమాటా ధరలు 39 శాతం, బంగాళదుంపలు 41 శాతం, ఉల్లి ధరలు 43 శాతం పెరగడమే వెజ్‌థాలీ ధర పెరుగుదలకు కారణం. బియ్యం, పప్పుల ధరలు కూడా వరుసగా 13 శాతం, 21 శాతం చొప్పున ఎగిశాయి. జీలకర్ర, మిర్చి, కూరగాయల నూనె ధరలు వరుసగా 37 శాతం, 25 శాతం, 8 శాతం తగ్గడం కొంత ఉపశమనం కలిగిందని నివేదిక పేర్కొంది.

నీటి సంరక్షణపై స్మార్టర్ హోమ్స్ ప్రచారం

హైదరాబాద్ : నీటి కొరత, పరిరక్షణ గురించి అవగాహన క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ వాటర్ మీటరింగ్ సొల్యూషన్స్ సంస్థ స్మార్టర్ హోమ్స్ తెలిపింది. నీటి సంరక్షణ ఆవశ్యకతను తెలుపుతూ "సమ్మర్ ఆఫ్ సస్టైనబిలిటీ 2024 -వాటర్ వైజ్ కమ్యూనిటీస్" ప్రారంభిస్తున్నట్లు స్మార్టర్ హోమ్స్ సిఒఒ జితేందర్ తిర్వాణి పేర్కొన్నారు. ఈ ప్రచారం ద్వారా నీటి సంరక్షణ పట్ల సమాజ ప్రమేయం, సామూహిక బాధ్యత భావాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

సెన్సెక్స్‌కు 1600 పాయింట్ల లాభం

ముంబయి : వరుసగా మూడో రోజూ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1619 పాయింట్ల లాభంతో 76,693కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 469 పాయింట్ల లాభంతో 23,290 వద్ద ముగిసింది. సెన్సెక్స్- 30లో మహీంద్రా అండ్ మహీంద్రా, విప్రో, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టాటా స్టీల్ షేర్లు అధికంగా లాభపడిన వాటలో ఉన్నాయి.

వాణిజ్య వాహన అమ్మకాల్లో 7శాతం పతనం

- ఇక్రా అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో వాణిజ్య వాహన రంగం అమ్మకాల్లో 4-7 శాతం పతనం చోటు చేసుకోవచ్చని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా అంచనా వేసింది. గడిచిన 2023-24లో టోకు అమ్మకాల్లో 1 శాతం, రిటైల్ విక్రయాల్లో పెరుగుదల ఉందని తెలిపింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మౌలిక వసతుల రంగం కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో చివరి త్రైమాసికం అమ్మకాల్లో 4 శాతం తగ్గుదల చోటు చేసుకుందని పేర్కొంది. ఈ ఏడాది తేలికపాటి వాణిజ్య వాహన అమ్మకాలు ఏకంగా 5-8 శాతం తగ్గొచ్చని విశ్లేషించింది. మౌలిక వసతుల రంగంలో నెలకొన్న పలు సవాళ్లు వాహన రంగంపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని ఇక్రా పేర్కొంది.

పాట్ కమిన్స్ న్యూబ్యాలెన్స్ స్టోర్ సందర్శన

హైదరాబాద్ : ప్రముఖ క్రికెటర్ పాట్ కమిన్స్ హైదరాబాద్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లోని న్యూ బ్యాలెన్స్ స్టోర్‌ను సందర్శించారు. స్పోర్ట్స్ బ్రాండ్‌లలో ఒకటైన న్యూ బ్యాలెన్స్ బ్రాండ్ పట్ల తన కతజ్ఞతలు తెలిపారు.

జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్ ప్రారంభం



హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్‌లో హైదరాబాద్ జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్) ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. జూన్ 7 నుంచి 9వ తేది వరకు 16వ జరగనున్న ఈ ప్రదర్శనను శుక్రవారం హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు అడ్మినిస్ట్రేషన్ జె పరిమళ హనా నూతన్ లాంచనంగా ప్రారంభించారు. హెచ్‌జెఎఫ్2024ను ఒక ప్రీమియర్ ఈవెంట్‌గా ఇన్‌ఫార్మా మార్కెట్స్, ఇండియా నిర్వహిస్తుంది. దీనిలో 350 మంది ఎగ్జిబిటర్‌లు 750 కంటే ఎక్కువ బ్రాండ్‌లను ప్రదర్శిస్తున్నారు.

ఈ ఎక్స్‌పో లో 200,000 కంటే ఎక్కువ తాజా డిజైన్‌లు 8,000 మంది వాణిజ్య కొనుగోలుదారులను ఆకర్షించనున్నాయని భావిస్తున్నారు. 2030 నాటికి రత్నాలు మరియు ఆభరణాల ఎగుమతులను యుఎస్ 75 బిలియన్ డాలర్ల కు (రూ.6.2 లక్షల కోట్లు) పెంచాలనే భారతదేశం ప్రతిష్టాత్మక లక్ష్యానికి ఇది మద్దతు ఇస్తుందని ఇన్ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ ముద్రాస్ పేర్కొన్నారు.

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడిగా కామెరూన్ మాజీ ప్రధాని

ఐక్యరాజ్య సమితి : కామెరూన్ మాజీ ప్రధాని ఫిలెమాన్ యాంగ్‌ను ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) 79వ సమావేశాలకు అధ్యక్షుడిగా గురువారం ఎన్నుకున్నారు. ఇప్పటివరకు 78వ యుఎన్‌జిఎ సెషన్‌కు నేతృత్వం వహించిన ట్రినిడాడ్ అండ్ టుబాగో అధ్యక్షుడు డెనిస్ ఫ్రాన్సిస్ స్థానంలో యాంగ్ బాధ్యతలు చేపట్టనున్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో సెప్టెంబరు 10న ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి.

"మన విభేదాలు, మన వైవిధ్యతను దాటి మనందరం శాంతిని పెంపొందించేందుకు కలిసికట్టుగా వ్యవహరించాలి. ఎక్కడా ఎలాంటి యుద్ధం జరగకుండా చూడాలి. ఐక్యతా స్ఫూర్తితో విపత్తులను నివారించాలి." అని ఎన్నికైన సందర్భంగా యాంగ్ పేర్కొన్నారు. బహుముఖ వాదాన్ని బలోపేతం చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితి నిబంధనావళి, సిద్ధాంతాలు, నిబంధనలకు ఇదే పునాదని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో తన పదవీకాలంలో వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు.

రష్యాలో నలుగురు భారత వైద్య విద్యార్థుల మృతి

- స్నేహితురాలిని కాపాడేయత్నంలో నదిలో మునక

మాస్కో : రష్యాలో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లి అనుకోని ప్రమాదంలో చిక్కుకొని భారత్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు నదిలో మునిగి చనిపోయారు. కేంద్ర విదేశాంగ శాఖ, మాస్కోలోని భారత దౌత్య కార్యాలయం శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం..మహారాష్ట్రలోని జలగావ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న నోవ్‌గార్డ్ స్టేట్ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఇద్దరు అమ్మాయిలు, మరో ముగ్గురు అబ్బాయిలు. 18-20 ఏళ్ల మధ్య వయస్సున్న ఈ ఐదుగురు వర్సిటీకి సమీపంలోనే ఉన్న వోల్ఖోవ్ నదీ తీరానికి సరదాగా గడిపేందుకు వెళ్లారు. మిత్రులంతా ఆనందోత్సవాల్లో మునిగితేలుతున్నారు. ఇంతలోనే వారిలో ఒక అమ్మాయి నదీ తీరం నుంచి జలాల్లోకి వెళ్లగా ఆమె కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన మిగిలిన నలుగురు విద్యార్థులు నదిలో కొట్టుకుపోతున్న స్నేహితురాలిని కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో మిగిలిన నలుగురు కూడా ఆమెతో పాటు నీట మునిగారు. విషయాన్ని గమనించిన స్థానికులు కూడా వారిని రక్షించేందుకు శక్తిమేరా ప్రయత్నించారు. ఒక అబ్బాయిని మాత్రం క్షేమంగా ఒడ్డుకు చేర్చగలిగారు. మిగిలిన నలుగురు అప్పటికే నీట మునిగిపోవడంతో ఊపిరాడక ప్రాణాలొదిలారు.

ఈ విషాద ఘటనపై సమాచారం అందుకున్న భారత దౌత్య కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. విద్యార్థుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. విద్యార్థుల మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి పంపించేందుకు రష్యా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని భారత రాయబార కార్యాలయ అధికారులు తెలిపారు. క్షేమంగా ఒడ్డుకు చేరిన అబ్బాయిని స్థానిక ఆసుపత్రిలో చేర్చించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా కుదరదు

- హైకోర్టు తీర్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఆదివారం నిర్వహించబోయే గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలనే అప్పీల్ వ్యాజ్యాలను హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఇదే అంశంపై దాఖలైన పిటిషన్లను నాలుగు రోజుల క్రితం సింగిల్ జడ్జి కొట్టివేయడాన్నిసవాల్ చేస్తూ గణేష్, భూక్యా భరత్ సమర్పించిన అప్పీళ్లను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ డిస్మిస్ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఆసిస్టెంట్ సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-1 ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఆదివారం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నారనీ, కాబట్టి ప్రిలిమ్స్ వాయిదా వేయాలన్న పిటిషనర్ల వాదనను తిరస్కరించింది. 4.03 లక్షల మంది పరీక్ష రాసేందుకు టీజీపీఎస్సీ ఏర్పాటు చేసిన క్రమంలో పరీక్షను వాయిదా వేయలేమని తీర్పు చెప్పింది.

బీఆర్ఎస్ నేత షకీల్‌కు వెసులబాటు

బియ్యం అక్రమ నిల్వలు, వాటి మాయంపై సివిల్ సప్లయ్స్ శాఖ ఫిర్యాదు మేరకు బోధన్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్‌పై నిజామాబాద్ జిల్లా కోటగిరి పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు పేరుతో తనను పోలీసులు వేధిస్తున్నారని పేర్కొంటూ షకీల్ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. ఏడేళ్లలోపు శిక్షలు పడే సెక్షన్లతో షకీల్‌పై కేసులు నమోదు అయ్యాయనీ, ఇలాంటి కేసుల్లో సీఆర్ పీసీ సెక్షన్ 41ఎ నోటీసు ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తు చేశారు. షకీల్‌కు 41ఎ నోటీసు ఇచ్చి కేసు విచారించాలని పోలీసులను ఆదేశించారు. విచారణను ఈనెల 21కి వాయిదా వేశారు.

ప్రభుత్వానికి నోటీసులు

మత్స్యకార సంఘ సొసైటీ రాష్ట్ర చైర్మెన్ నియామకాన్ని సవాల్ చేసిన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం విచారించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పశు సంవర్ధకశాఖ, వ్యవసాయాఖ ముఖ్యకార్యదర్శులకు, మత్స్యశాఖ ఎండీ, సహకార సంఘాల కమిషనర్, సహకార సంఘాల సమాఖ్య జీఎమ్‌లను ఆదేశించింది. జిల్లా సొసైటీలకు ఎన్నికలు పూర్తి కాకుండా ఆయా సొసైటీలకు ఎన్నికైన వారితో కాకుండా రాష్ట్ర సొసైటీ చైర్మెన్‌గా బెస్త వర్గానికి చెందిన సాయికుమార్‌ను ప్రభుత్వం నియమించడాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.

రేవంత్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలు : ఎన్వీ సుభాష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్వీ సుభాష్ తెలిపారు. ఎంపీ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండం అన్న ఆయన ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రేవంత్ సొంత జిల్లా, ఇన్‌చార్జిగా ఉన్న చేవెళ్ల, తాను సిట్టింగ్ ఉన్న మల్కాజిగిరి స్థానాల్లో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. ఆ పార్టీ అబద్ధపు హామీలను ప్రజలు నమ్మకట్లేదనీ, ఫలితాల్లో అది స్పష్టంగా కనబడుతున్నదని చెప్పారు. రేవంత్‌రెడ్డి మాటలను సొంత మంత్రులు, నాయకులే వినడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలుచేస్తే.. కాంగ్రెస్ మరింతగా రాష్ట్రాన్ని నాశనం చేస్తోందని విమర్శించారు. ఏడు నెలలుగా రేవంత్ రెడ్డి ప్రజలను వంచిస్తూనే ఉన్నారనీ, ఎన్నికల కోడ్ చూపి గ్యారెంటీలను అమలు చేయలేదని ఆరోపించారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సోనియాగాంధీని ఆహ్వానిస్తానంటూ ఆమె మెప్పుకోసం రేవంత్‌రెడ్డి పాకులాడుతున్నారని విమర్శించారు. ఫలితాలు వెల్లువడిన తెల్లారి నుంచే బ్యాంకర్లు రైతులకు ఫోన్లు చేసి రుణాలు చెల్లించాలనీ, లేదంటే రెన్యూవల్ చేయించుకోవాలని ఒత్తిడి తెస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. లేదంటే సిబిల్ స్కోర్ తగ్గిపోతుందంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. రైతు శ్రేయస్సుపై చిత్తశుద్ధి ఉంటే పంద్రాగస్టులోగా రుణమాఫీ చేయాలని సీఎంను డిమాండ్ చేశారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా బీజేపీ ఎంపీలు, పార్టీ శ్రేణులు, ప్రజలకు ఆయన ధన్యవాదులు తెలిపారు.

వచ్చే ఐద్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షసూచన

తెలంగాణలో చురుగ్గా నైరుతి రుతుపవనాల విస్తరణ

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐద్రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా విస్తరిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి రాష్ట్రంలోని మెదక్, భద్రాచలం మీదుగా వెళ్తున్నది. రాబోయే మూడు నాలుగు రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయి. తెలంగాణ, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నెలకొని ఉంది. దీని ప్రభావం వల్ల పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. శని, ఆదివారాల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్ధిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముంది. సోమ, మంగళవారాల్లో నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం పడొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, అక్కడక్కడా జల్లులు పడే అవకాశముంది.

పైశాచికత్వం !

- 8 మాసాలుగా దాడులతో గాజాలో నరమేధానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్

గాజా : శుక్రవారంతో గాజాపై ఇజ్రాయిల్ దాడులు మొదలై 8మాసాలు గడిచాయి. 2010లో గాజా సంక్షోభంపై పుస్తకం రాస్తూ ప్రముఖ రచయిత, ప్రొఫెసర్ నోమ్‌చోమ్‌స్కీ రాసిన కొటేషన్ ఈనాటికీ సరిగ్గా సందర్భానికి అతికినట్లు సరిపోతుంది. "రాజకీయ ప్రయోజనాల కోసం పాలస్తీనియన్లకు అంతులేని నొప్పి, బాధ కలిగించడమనేది రాజ్యహింస, భయోత్పాతానికి మరో సుదీర్ఘ సిద్ధాంతం-వాస్తవానికి దాని మార్గదర్శక సూత్రం కూడా." అన్నది ఆ కొటేషన్. గత ఎనిమిది మాసాలుగా అంతులేని రీతిలో సాగుతున్న ఈ దాడులు పెను మానవ విషాదాన్ని. విధ్వంసాన్ని నమోదు చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ కూడా ప్రజానీకం ఇలాంటి దాడులను చూడలేదు. ఈ భూమండలంపైనే అత్యంత జనసాంద్రత కలిగిన గాజాలో విధ్వంసం సాగిన తీరు ఊహకు అందని రీతిలో వుంది. ఆ క్రూరత్వాన్ని, వారి కక్ష సాధింపును చూస్తుంటే మనస్సు చలించిపోతోంది. ఇప్పుడు గాజాను చూస్తుంటే శిధిలాలు, రాళ్ల రప్పలతో మట్టిదిబ్బల కుప్పగా మారింది. ఇళ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, బజార్లు మసీదులు, గ్రంథాలయాలు, ఇలా ప్రజా జీవనానికి పనికివచ్చేవి ఏవి వుంటాయో అవన్నీ కూడా నేలమట్టమైపోయాయి. అసలు పాలస్తీనా ప్రజలకు, ఇజ్రాయిల్ ప్రజలకు మధ్య తలెత్తిన ఈ ఘర్షణను పరిష్కరించాలని ఎవరైనా అనుకుంటే ముందు వారు సమస్య మూలాల్లోకి వెళ్ళాల్సి వుంటుంది.

అలాగే ఈ ఘర్షణల చరిత్ర ఒకసారి తవ్వి తీస్తే కారణాలు కూడా కనబడతాయి. ఈ దాడులతో శూన్యం చోటు చేసుకోకుండా చూడడం చాలా ముఖ్యమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదరిశ గుటెరస్ వ్యాఖ్యానించారు. 56ఏళ్ళుగా పాలస్తీనియన్లు ఈ ఆక్రమణల సమస్యను అనుభవిస్తున్నారు. ఊపిరాడని రీతిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సెటిల్‌మెంట్ల రూపంలో వారి భూమి క్రమేపీ దూరమవుతోంది. హింస అట్టుడుకుతోంది. వారి ఆర్థిక వ్యవస్థ నలిగిపోతోంది. వారి ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ఇంతలా ఆక్రమణలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సహజంగానే పాలస్తీనియన్లు ఎలాంటి అడ్డు ఆటంకం లేని రీతిలో స్వేచ్ఛను కోరుకుంటున్నారు. అచంచలమైన స్ఫూర్తితో వారు స్వేచ్ఛ కోసం పోరాడడం కూడా సహజమే.

77మంది మృతి

గత 24గంటల్లో 77మంది పాలస్తీనియన్లు మరణించారు. 221మంది గాయపడ్డారు. కాగా గాజాలో మొత్తంగా మృతుల సంఖ్య 36,731కి చేరగా గాయపడిన వారి సంఖ్య 83,530కి పెరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని ఒత్తిడి పెరుగుతున్నందున తాజా ప్రతిపాదనకు హమాస్ తన స్పందన తెలియచేయాలని ఈజిప్ట్, కతారీ మధ్యవర్తులు పేర్కొంటున్నారు. రోజుల తరబడి దాడులను ఎదుర్కొన్న అల్ అక్సా ఆస్పత్రి,ఎందుకు పనికి రాకుండా పోయిందని బోర్డర్స్ వితౌట్ డాక్టర్స్ తెలిపింది.

భూముల ధరల పెంపుపై ఉన్నత స్థాయి సమీక్ష

- త్వరలో మార్గదర్శకాలు విడుదలయ్యే అవకాశం?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూముల ధరలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 143 రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి ఇప్పటికే సమాచారం సేకరించినట్టు తెలుస్తున్నది. పెంపుపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులు ఇదే అంశంపై ఆ శాఖ అధికారులతో సర్కార్ అంతర్గత సమీక్ష నిర్వహించినట్టు సమాచారం. రెండేండ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాల భూముల ధరలను పెంచింది. అయితే సర్కార్ నిర్ణయించిన ధరలు, బయట మార్కెట్‌లో ఉన్న భూముల ధరల మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. ఈ క్రమంలో వాటిని పెంచాలని కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి మార్గదర్శకాలను ఇప్పటికే రిజిస్ట్రేషన్ల శాఖ రూపొందించింది. వాటికను గుణంగానే రాష్ట్రంలో త్వరలో భూముల ధరల పెంపు ఉంటుందని భావిస్తున్నారు.

ఇజ్రాయిల్ దాడులతో గాజాలో 80 శాతానికి నిరుద్యోగం

- ఐఎల్‌ఒ, పిసిబిఎస్ నివేదికలు

బీరుట్ : ఎనిమిది నెలల నుంచి జరుగుతున్న ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో జిడిపి క్షీణించిందని, నిరుద్యోగం 80 శాతానికి చేరుకుందని అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఒ), పాలస్తీనా సెంట్రల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పిసిబిఎస్) నివేదికలు తెలిపాయి. నిరుద్యోగిత రేటు గాజా స్ట్రిప్‌లో 79.1 శాతానికి, వెస్ట్‌బ్యాంక్‌లో 32 శాతానికి చేరుకుందని వెల్లడించాయి. ప్రజలు జీవనోపాధి, ఉద్యోగాలు కోల్పోయారని నివేదికలు తెలిపాయి. అలాగే, జిడిపి రేటు గాజాలో 83.5 శాతం, వెస్ట్‌బ్యాంక్‌లో 22.7 శాతం తగ్గింది. మొత్తంగా ఈ రెండు ప్రాంతాల్లో జిడిపి గత ఎనిమిది నెలల్లో సగటున 32.8 శాతం తగ్గింది. ఇజ్రాయిల్ చేస్తున్న భయంకరమైన యుద్ధం మానవ జీవితాలను బలితీసుకోవడమే కాకుండా.. జీవన పరిస్థితులను దారుణంగా మార్చిందని నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్థిక కార్యక్రమాలు, జీవనోపాధులు విధ్వంసమయ్యాయని తెలిపాయి.

ఆగస్టు 12న సెక్యూర్ ఐస్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం షురూ...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెక్యూర్‌ఐస్ సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (11వ బ్యాచ్) ఆగస్టు 12న ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం పెరిగిపోతున్నది. వారి కొరతను తీర్చేందుకు ఈ ఇంటెన్సివ్ 3 నెలల ఆన్‌లైన్ కోర్సును ప్రారంభిస్తున్నారు. ఈ కోర్సులో ఆన్‌లైన్ ల్యాబ్‌లు , ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ, అప్లికేషన్ సెక్యూరిటీ, గవర్నెన్స్ తదితర అంశాలుంటాయి. 9వ బ్యాచ్‌లో 90 శాతం ప్లేస్ మెంట్స్ దొరికాయి.

పచ్చిరొట్ట విత్తనాల బ్లాక్ మార్కెటింగ్

- నలుగురు వ్యవసాయ అధికారుల సస్పెండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడిన నలుగురు వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమీషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల వ్యవసాయ అధికారితో పాటు మరో ముగ్గురు వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏ.ఈ.ఓ) సస్పెండ్ చేశారు. తొర్రూరు మండలంలో పచ్చి రొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్ ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలింపుకు కారణమైన ఆ మండలం వ్యవసాయాధికారి కె. సోమకుమార్ యాదవ్, క్లస్టర్ గ్రేడ్ -2 ఏ.ఈ.ఓ. ఎం. జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో అజ్మీరా దీపిక, హరిపిరాల ఏఈవో సి.హెచ్. అరవింద్ సస్పెండ్ అయ్యారు.

బీసీ గురుకుల జూనియర్ కాలేజీల సీట్ల భర్తీకి రెండో జాబితా విడుదల

- ఈనెల 14లోగా సంబంధిత కాలేజీలో రిపోర్ట్ చేయాలి : కార్యదర్శి బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించిన రెండో జాబితాను ఆన్ లైన్ httpsmjpabcwreis. cgg.gov.inýË అందుబాటులో ఉంచామని తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 21,920 సీట్లు అందుబా టులో ఉన్నాయనీ, అందులో మొదటి విడతలో 18,749 సీట్ల భర్తీ ప్రక్రియను ప్రారంభించగా, 10,562 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారని తెలిపారు. మిగతా సీట్ల భర్తీకి రెండో జాబితాను వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచామనీ, విద్యార్థులకు కేటాయించిన కాలేజీల్లో ఈనెల 14 లోగా రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులందరూ తమకు కేటాయించిన సీట్ల వివరాలు తమ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన సూచించారు.

ఆందోల్‌లో నర్సింగ్ కాలేజీకి సర్కారు అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు వైద్యారోగ్యశాఖ పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఫిబ్రవరి 23న రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల నుంచి వచ్చిన లేఖను పరిశీలించి ఈ అనుమతిస్తున్నట్టు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ పేర్కొన్నారు. ఈ కళాశాల నిర్మాణ కోసం రూ.43 కోట్లను వెచ్చించనున్నారు. నాలుగేండ్ల బీయస్సీ (నర్సింగ్) కోర్సులో 60 సీట్ల సామర్థ్యంతో కళాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు అని చర్యలు తీసుకోవాలని డీఎంఈతో పాటు టీజీఎంఐడీసీ కార్యదర్శి ఆదేశించారు.

ఉక్రెయిన్‌కు నాటో దళాలను పంపాలన్న

మాక్రాన్‌ను అడ్డుకున్న బైడెన్

పొలిటికో

ఉక్రెయిన్‌లో కీవ్ దళాలకు శిక్షణ ఇవ్వడానికి పాశ్చాత్య శిక్షకులను పంపాలని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ నిరోధించినట్లు పొలిటికో పేర్కొంది. శుక్రవారం ప్రచురించిన ఒక కథనం ప్రకారం, ఉక్రెయిన్‌కు నాటో దళాలను పంపడం వల్ల కలిగే పర్యవసానాల గురించి బైడెన్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఉక్రెయిన్‌కు నాటో నిపుణులను పంపించే లక్ష్యంతో మాక్రాన్ పాశ్చాత్య దేశాల సంకీర్ణాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాడని వార్తా సంస్థలు గతంలో అనేక కథనాలను ప్రచురించాయి.

ఈ విషయాన్ని పారిస్ అధికారికంగా ధృవీకరించలేదు. "ఇంకా తీసుకోవలసిన నిర్ణయాలపై" తాను వ్యాఖ్యానించనని మాక్రాన్ పేర్కొన్నాడు. అయినప్పటికీ, ఫ్రెంచ్ ప్రధాన మంత్రి గాబ్రియేల్ అట్టల్ ఉక్రెయిన్‌కు సైనిక శిక్షకులను పంపడంపై "నిషేధం" లేదని చెప్పాడు. ఫ్రెంచ్ శిక్షకులు ఇప్పటికే ఫ్రాన్స్‌లో, దాని పొరుగు దేశాల భూభాగంలో దాదాపు 10,000 మంది ఉక్రేనియన్ దళాలకు శిక్షణ ఇచ్చారని ఆయన అన్నాడు. బాల్టిక్ ప్రాంతంలోని లిథువేనియా, ఎస్టోనియా వంటి అనేక నాటో సభ్య దేశాలు ఈ ఆలోచనకు మద్దతునిచ్చాయి. ఉక్రెయిన్‌కు శిక్షకులను పంపడానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. కొన్ని దేశాలు ఇప్పటికే ఉక్రెయిన్‌లో "సైనికులకు శిక్షణ ఇస్తున్నాయని" ఎస్టోనియన్ ప్రధాన మంత్రి కాజా కల్లాస్ పేర్కొన్నాడు. కానీ ప్రత్యేకంగా అవి ఏఏ దేశాలు అనే విషయాన్ని పేర్కొనలేదు. కీవ్ కూడా మాక్రాన్ ప్రణాళికను ధృవీకరించింది. ఫ్రెంచ్



శిక్షకులను ఉక్రేనియన్ శిక్షణా సౌకర్యాలను సందర్శించడానికి, ఉపయోగించడానికి, అనుమతించడానికి ఉక్రెయిన్ టాప్ కమాండర్ అలెగ్జాండర్ సిర్స్కీ ఇప్పటికే అన్ని పత్రాలను పూర్తి చేసినట్లు పేర్కొన్నాడు. సీనియర్ ఉక్రేనియన్ చట్టసభ సభ్యుడు అలెక్సీ గోంచరెంకో కూడా ఫ్రెంచ్ సైనిక నిపుణుల మొదటి బృందం ఇప్పటికే దేశానికి చేరుకుందని పేర్కొన్నాడు.

ఉక్రెయిన్‌లోని విదేశీ సైనిక సిబ్బంది ఎక్కడి నుంచి వచ్చినప్పటికీ, వారు సైనికులు/ శిక్షకులు అనే దానితో సంబంధం లేకుండా దాడులకు చట్టబద్ధమైన లక్ష్యాలుగా పరిగణించబడతారని రష్యా పదేపదే హెచ్చరించింది. "వాస్తవం ఏమిటంటే, ఉక్రేనియన్ సైన్యానికి శిక్షణ ఇవ్వడంలో పాల్గొనే శిక్షకులకు ఎటువంటి ప్రత్యేక రక్షణలు ఉండవు. వారు ఫ్రెంచా, కాదా అనేది పట్టింపు ఉండదు" అని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఈ వారం ప్రారంభంలో చెప్పాడు.

50శాతం పెరిగిన రష్యా చమురు ఆదాయం

బ్లూమ్‌బెర్గ్



పాశ్చాత్య ఆంక్షలకు అనుగుణంగా దేశాన్ని నడపటంతో ముడిచమురు ధరలు పెరిగాయి. ఏడాది క్రితంతో పోలిస్తే రష్యా చమురు ఆదాయం గత నెలలో దాదాపు 50శాతం పెరిగిందని బ్లూమ్‌బెర్గ్ గురువారం రిపోర్ట్ చేసింది. అంతర్జాతీయ ఒత్తిడి, లోటు అంచనాలు ఉన్నప్పటికీ క్రూడ్ అమ్మకాల ద్వారా వచ్చే మాస్కో ఆదాయం పెరిగింది.

రష్యా ఆర్థిక మంత్రిత్వ శాఖ డేటా ఆధారంగా తయారు చేసిన బ్లూమ్‌బెర్గ్ లెక్కల ప్రకారం మే నెలలో చమురు సంబంధిత పన్నులు 632.5 బిలియన్ రూబిళ్ల (7.1 బిలియన్ డాలర్ల)కు పెరిగాయి. మొత్తం చమురు, గ్యాస్ లాభాలు 39శాతం పెరిగి 793.7 బిలియన్ రూబిళ్ల (8.9 బిలియన్ డాలర్ల)కు చేరుకున్నాయని రష్యా ప్రధానంగా ఎగుమతి చేసే యురల్స్ క్రూడ్‌పై క్రమంగా పెరుగుతున్న ధరల డేటా చూపించింది.యురల్స్ బ్యారెల్ 74.98 డాలర్ల ధర ఆధారంగా మంత్రిత్వ శాఖ మే పన్నులను లెక్కించింది. ఇది ఏడాది క్రితం 58.63 డాలర్లు ఉండేది. రష్యన్ చమురుపై జి-7, యూరోపియన్ యూనియన్ ప్రవేశపెట్టిన ఆంక్షల కారణంగా బ్యారెల్‌కు 60 డాలర్ల ధర పరిమితి ఉన్నప్పటికీ, గ్లోబల్ బ్రెంట్ బెంచ్‌మార్క్‌లో యురల్స్ క్రూడ్‌కు ఇచ్చే డిస్కౌంట్ తగ్గింది. మాస్కో ఎగుమతి ఆదాయాలను తగ్గించడానికి డిసెంబర్ 2022లో ఆంక్షలు విధించబడ్డాయి. ఫిబ్రవరి 2023లో రష్యా పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై ఇలాంటి పరిమితులు విధించబడ్డాయి.

ఈ ఆంక్షలకు ప్రతిస్పందనగా రష్యా తన ఇంధన ఎగుమతులను ఆసియాకు - ముఖ్యంగా భారతదేశం, చైనాలకు మార్చింది. ఇక్కడ రష్యా చమురు పశ్చిమ దేశాల ధరల పరిమితి కంటే ఎక్కువగా విక్రయించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఫెడరల్ బడ్జెట్‌కు చమురు, గ్యాస్ ఆదాయాలపై ప్రాథమిక నివేదికను మేలో విడుదల చేసింది. ఇది జనవరి, ఏప్రిల్ మధ్య ఇంధన ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం 11.68 బిలియన్ రూబిళ్ల (131.2 మిలియన్ డాలర్లు) పెరిగింది. 2023లోని అదే కాలంతో పోలిస్తే ఇది 50.1శాతం పెరిగింది..ఆర్థిక మంత్రిత్వ శాఖ సమాచారం ఆధారంగా ఇంధన లాభాలు పెరిగినప్పటికీ ఈ ఏడాది చమురు, గ్యాస్ ఆదాయాల అంచనాలను 11.5 ట్రిలియన్ రూబిళ్ల (129.2 బిలియన్ డాలర్ల) నుంచి 10.99 ట్రిలియన్ రూబిళ్ల (123.4 బిలియన్ డాలర్ల)కు తగ్గించాలని ప్రతిపాదించారు. రష్యా చమురు ఈ ఏడాది 71.30 డాలర్ల మునుపటి ప్రొజెక్షన్‌తో పోలిస్తే ఈ ఏడాది బ్యారెల్‌కు 65 డాలర్ల వద్ద వర్తకం చేస్తుందని అంచనా వేస్తున్నందున ఈ డౌన్‌వర్డ్ రివిజన్ అవసరం ఏర్పడింది.

గర్వంగా చెప్పుకునే సూపర్ హీరో సినిమా



'శుక్ర', 'మాటరాని మౌనమిది' వంటి డిఫరెంట్ మూవీస్ తర్వాత దర్శకుడు సుకు పూర్వాజ్ రూపొందిస్తున్న కొత్త సినిమా 'ఏ మాస్టర్ పీస్'. మనీష్ గిలాడ, అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఫిల్మ్ ప్రొడక్షన్ స్టూడియో మెర్జ్ ఎక్స్ ఆర్‌తో కలిసి సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ నిర్మిస్తున్నారు. ఈ సినిమా మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ కలిసిన ఒక న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ ఎక్స్‌పీరియన్స్‌ను తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది.

శుక్రవారం ఈ చిత్ర టీజర్ లాంచ్‌ని ఘనంగా నిర్వహించారు. నటుడు, నిర్మాత మనీష్ గిలాడ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండటం సంతోషంగా ఉంది. ఈ మాస్టర్ పీస్ మాస్టర్ క్లాస్‌గా ఉంటుంది. మా అందరి కెరీర్‌లో గుర్తుండిపోయే మూవీ అవుతుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

'మనం వరల్డ్ సినిమాలోని ఎన్నో సూపర్ హీరోల సినిమాలను చూశాం. నాకూ చాలా సూపర్ హీరోల సినిమాలు ఇష్టం. ఆ సూపర్ హీరో క్యారెక్టర్‌కు మన పురణాల నేపథ్యాన్ని జోడిస్తే మన నేటివ్ సూపర్ హీరో ఫిల్మ్ చేయొచ్చనే ఐడియాతో ఈ సినిమాను ప్రారంభించాను. ఇందులో మన మైథాలజీ సోల్ ఉంటుంది. భాగవతంలోని జయ విజయుల నేపథ్యంతో హీరో, విలన్ క్యారెక్టర్స్‌ను డిజైన్ చేశాం. మైథాలజీని, సైన్స్ ఫిక్షన్‌ను కలిపేందుకు శివుడి పాత్రను సంధానంగా తీసుకున్నా. ఇది పురాణాల్లో ఉండదు. కల్పిత పాత్రగా రాసుకున్నా. అందుకే మా పోస్టర్‌లో మిథ్స్ రీ ఇమాజిన్డ్ అని రాశాం' అని దర్శకుడు సుకు పూర్వాజ్ తెలిపారు.

నిర్మాత శ్రీకాంత్ కండ్రేగుల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో 1500కు పైగా వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉంటాయి. వీటిని మెర్జ్ ఎక్స్ఆర్ అత్యద్భుంగా చేసింది' అని అన్నారు. హీరోయిన్ జ్యోతి పూర్వాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాధవ్, హీరో అరవింద్ కృష్ణ తదితరులు ఈ వేడుకలో పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

రీ రిలీజ్‌లోనూ విజయం ఖాయం



లింగం యాదవ్, ఉపేంద్ర, సైదులు

ఇండస్ట్రీ ఎప్పుడూ కొత్త పుంతలు తొక్కుతూనే ఉంటుంది. అందులో భాగమే ఈ 4కే రీరిలీజ్ ట్రెండ్. ఓల్డ్ బ్లాక్ బస్టర్ మూవీస్‌ను హై క్వాలిటీతో మరోమారు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై గ్రాండ్‌గా రీరిలీజ్ అవుతున్న చిత్రం ఏ.

కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర నటించిన ఈ చిత్రం ఓ ట్రెండ్. 1998లో అంటే సుమారు 26 సంవత్సారాల క్రితం విడుదలైన ఈ సినిమా ఓ కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. ఆ రోజుల్లో 100 రోజులు ఆడటమే కాకుండా దాదాపు 3, 4 వారాలు టికెట్లు సైతం దొరకలేదంటే ఆ సినిమా చేసిన మ్యాజిక్‌ను అర్థం చేసుకొవచ్చు. ఈ కల్ట్ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తూ వింటేజ్ రోజులను తెరపై అవిష్కరింపజేస్తున్నారు ప్రొడ్యూసర్ లింగం యాదవ్. చందు ఎంటర్‌టైన్మెంట్‌ని స్థాపించి పలు చిత్రాలను నిర్మించడమే కాకుండా సినిమాపై ఉన్న ప్యాషన్‌తో రీరిలీజ్‌లకు పూనుకున్నారు. అందులో భాగంగా హీరో ప్రభాస్ నటించిన 'ఛత్రపతి, యోగి' చిత్రాలను 4కేలో మళ్లీ విడుదల చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు 'ఏ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇప్పటికే కన్నడలో రీరిలీజ్ అయిన ఈ చిత్రం అద్భుతమైన స్పందనను రాబట్టింది. ఇక ఈనెల 21న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.

కన్నడ ఇండస్ట్రీలో ట్రెండ్ సెట్ చేసిన సినిమా ఏ (బుద్ధిమంతులకు మాత్రమే అనేది శీర్షిక). ఈ చిత్రంలో ఉపేంద్ర సరసన చాందినీ నటించారు. తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన ఈ చిత్రం కేవలం కన్నడలో 20 కోట్లకు పైగా వసూల్ చేసి ఇండస్ట్రీ రికార్డు క్రియేట్ చేసింది. అంతటి కల్ట్ ఫిల్మ్‌ని మరోమారు చూసేందుకు సినీలవర్స్‌తోపాటు ఉపేంద్ర అభిమానులు సైతం ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.



వరుణ్ తేజ్

భారీ సెట్‌లో మట్కా

వరుణ్ తేజ్ నటిస్తున్న పాన్-ఇండియా మూవీ 'మట్కా'. 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో రజనీ తాళ్లూరి ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ మూవీని హ్యూజ్ కాన్వాస్‌పై హైబడ్జెట్, టాప్ టెక్నికల్ వాల్యూస్‌తో రూపొందిస్తున్నారు.

ఈనెల 19 నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. 4 డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్న వరుణ్ తేజ్ ఈ చిత్రంలో మోస్ట్ ఛాలెంజింగ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు. యావత్ దేశాన్ని కదిలించిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా కథ డిఫరెంట్ టైమ్స్‌లో సెట్ చేయబడింది. త్వరలో మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లు మేకర్స్ తెలియజేస్తారు.

వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ఓపెనింగ్ బ్రాకెట్ టీజర్ విడుదల చేయగా, దానికి అద్భుతమైన స్పందన వచ్చింది. టీజర్ సినిమా ప్రిమైజ్‌ని అద్భుతంగా చూపింది. నవీన్ చంద్ర, పి రవి శంకర్ తదితర కొన్ని ముఖ్యమైన పాత్రలను కూడా పరిచయం చేసింది.

'వరుణ్‌తేజ్ ఇప్పటివరకు నటించిన చిత్రాల్లోని పాత్రలతో పోలిస్తే ఈ సినిమాలోని పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. పలు కాలాల్లో సాగే ఈ చిత్రంలో ఆయన నాలుగు భిన్నమైన గెటప్స్‌తో అలరించనున్నారు. ఈ గెటప్స్ కోసం ఆయన మేకోవర్ అయిన విధానం ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది' అని చిత్ర బృందం తెలిపింది.

తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి నటిస్తున్నారు. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిషోర్, రవీంద్ర విజయ్, పి రవి శంకర్ తదితరులు ఇతర కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఈచిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీవోపీ: కిషోర్ కుమార్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, సీఈఓ: ఈవీవీ సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్కే జానా, ప్రశాంత్ మండవ, సాగర్, కాస్ట్యూమ్స్: కిలారి లక్ష్మి.

నవచిత్రం

విజువల్ వండర్‌గా కన్నప్ప



మంచు విష్ణు

విష్ణు మంచు భారీ స్థాయిలో నిర్మిస్తున్న ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ దాదాపుగా పూర్తి కావొచ్చింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ వంటి మహామహులు నటిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను కేన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన సంగతి తెలిసిందే. 'ది వరల్డ్ ఆఫ్ కన్నప్ప'ను చూసి కేన్స్‌కు వచ్చిన అతిరథమహారథులు ప్రశంసల వర్షం కురిపించారు.

ఇక భారతీయ ప్రేక్షకులు ఈ టీజర్‌ను చూసే టైమ్ ఆసన్నమైంది. ఈనెల 14న 'కన్నప్ప' టీజర్ రాబోతోందని మేకర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ అందరిలోనూ మరింత ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. గుర్రం మీద విష్ణు కూర్చున్న తీరు, చుట్టూ కనిపిస్తున్న అటవీ ప్రాంతాన్ని చూస్తుంటే సిల్వర్ స్క్రీన్‌పై అద్భుతాన్ని చూడబోతున్నామనే ఫీలింగ్ కలిగేలా ఉంది.

అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద మోహన్ బాబు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'కన్నప్ప' ఫస్ట్ లుక్ పోస్టర్, ఇచ్చిన అప్డేట్లతో ఆడియెన్స్‌లో మంచి హైప్ క్రియేట్ అయింది. ఈ విజువల్ వండర్ కోసం దేశవిదేశాల నుంచి ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

అద్భుతమైన 8 వసంతాలు



అనంతిక సనీల్‌కుమార్

మైత్రీ మూవీ మేకర్స్ బిగ్ స్టార్లతో హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లను నిర్మించడమే కాకుండా కంటెంట్-రిచ్ మూవీలను రూపొందిస్తోంది. గోవా, ఖాట్మండు మోఫిల్మ్ ఫెస్టివల్స్‌లో రెండుసార్లు ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం 'మను'. ఈచిత్రంతో దర్శకుడిగా పరిచయమైన ఫణీంద్ర నర్సెట్టితో కాన్సెప్ట్ బేస్డ్‌గా '8 వసంతాలు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'మ్యాడ్' ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె పాత్రను శుద్ధి అయోధ్యగా పరిచయం చేశారు మేకర్స్. చెమ్మగిల్లిన కళ్లతో కదులుతున్న కవితలా, నవ్వుతూ కనిపించారు. కళ్లకు మాస్కరా, చెవిపోగులు, నోస్ రింగ్ ఆమెను మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేశాయి.

ఆమె సెన్సిబుల్ డాటర్, మంచి స్నేహితురాలు, అన్ కండీషనల్ లవర్, ఇంటెన్స్ మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్, ఇన్స్పైరింగ్ రైటర్, గ్రేస్ ఫుల్ హ్యూమన్ బీయింగ్. శుద్ధి అయోధ్య 19 ఏళ్ల నుండి 27 ఏళ్ల యువతి వరకు 8 సంవత్సరాల వ్యవధిలో విభిన్నమైన వ్యక్తులు, భావోద్వేగాలు, ప్రదేశాలను ఎక్స్‌ప్లోర్ చేయడంలో 8 వసంతాల ట్రాన్స్‌ఫర్మేషన్ జర్నీని ప్రజెంట్ చేస్తోంది. ఆమె వ్యక్తిత్వం ఆమె పేరు శుద్ధిని ప్రతిబింబిస్తుంది. ఆమె జీవితంలోని ప్రతి అంశంలో 'స్వచ్ఛత'గా ఉంటుంది. ఆమె మాటలు, ఆలోచనలు, పనులు, దయ డిగ్నిటీని ప్రజెంట్ చేస్తాయి. షీ ఈజ్ ఏ పోయెట్రీ ఇన్ ఎమోషన్' అంటూ ఆకట్టుకునే కోట్స్‌తో పాటు పోస్టర్‌లతో దర్శకుడు తన పొయిటిక్ సైడ్‌ని చూపించారు. టైటిల్ పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తూ అనంతిక ఫస్ట్-లుక్ పోస్టర్ 8 వసంతాల వరల్డ్ చూడాలని కోరుకునేలా చేస్తుంది. నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విశ్వనాథ్ రెడ్డి డీవోపీ కాగా, నరేష్ కుమారన్ సంగీతం అందిస్తున్నారు. అరవింద్ ములే ప్రొడక్షన్ డిజైనర్‌గా, శశాంక్ మాలి ఎడిటర్‌గా, బాబాసాయి కుమార్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.

నేటినుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు
- టెట్ లేకుండానే టీచర్లకు ప్రమోషన్స్
- గతంలో ఆగిపోయినప్పటి నుంచి ఇప్పుడు ప్రారంభం
- మల్టీజోన్-1లో 22 వరకు నిర్వహణ
- మల్టీజోన్-2లో 30 వరకు పూర్తి
- మూడేండ్లలోపు ఉద్యోగ విరమణ చేసే వారికి మినహాయింపు
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శనివారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానుంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను చేపడతామని స్పష్టం చేశారు. మూడేండ్లలోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుందని వివరించారు. మల్టీజోన్-1 పరిధిలో శనివారం నుంచి ఈనెల 22 వరకు, మల్టీజోన్-2 పరిధిలో శనివారం నుంచి ఈనెల 30 వరకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కోర్టు కేసులతో గతంలో ప్రక్రియ ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే ఇప్పుడు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామని వివరించారు. హైకోర్టులో స్టే ఉన్నందున రంగారెడ్డి జిల్లాకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 19 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశమున్నట్టు తెలిసింది. బదిలీల కోసం రాష్ట్రవ్యాప్తంగా 81,069 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. వారిలో సుమారు 60 వేల మంది వరకు బదిలీ అయ్యే అవకాశముందని సమాచారం.

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది. పదోన్నతులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అంటూ సెప్టెంబర్‌లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దానికితోడు 317 జీవో వల్ల ఇతర జిల్లాల నుంచి ఉపాధ్యాయులు రావడం వల్ల తమ సీనియార్టీ దెబ్బతిని నష్టపోతున్నామంటూ ఉన్నత న్యాయస్థానంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు పిటిషన్ దాఖలు చేశారు. అప్పటికే మల్టీజోన్-1లో గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. 782 మంది పదోన్నతులు పొందారు. స్కూల్ అసిస్టెంట్ బదిలీలు కూడా పూర్తయ్యాయి. అయితే స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను చేపట్టలేదు. బదిలీ అయిన వారిని పాత స్థానాల నుంచి రిలీవ్ చేయలేదు. ఎస్జీటీల బదిలీలు కూడా ఆగిపోయాయి.

మల్టీజోన్-1 పరిధిలో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలని బుర్రా వెంకటేశం ఆదేశించారు. శని, ఆదివారాల్లో స్కూల్ అసిస్టెంట్ ఖాళీల వివరాలతోపాటు సీనియార్టీ జాబితాను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈనెల 10,11 తేదీల్లో సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. 12న తుది సీనియార్టీ జాబితా అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈనెల 13 నుంచి 16 వరకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు ఎస్జీటీలు, తత్సమాన క్యాడర్ వారు వెబ్‌ఆప్షన్లను నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఎస్జీటీలకు జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్యాల్లో అన్ని సబ్జెక్టులకూ పదోన్నతులను కల్పించి ఉత్తర్వులను జారీ చేస్తారని తెలిపారు. 17న ఎస్జీటీల ఖాళీల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఎస్జీటీల బదిలీల కోసం వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. బదిలీల కోసం కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 21,22 తేదీల్లో ఎస్జీటీల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు.

మల్టీజోన్-2 పరిధిలో శనివారం జిల్లా పరిషత్ పాఠశాలల్లో హెడ్మాస్టర్ పదోన్నతుల కోసం సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని వెంకటేశం పేర్కొన్నారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల తొమ్మిదిన అభ్యంతరాలకు సమాధానమిస్తామని పేర్కొన్నారు. ఈనెల 10,11 తేదీల్లో తుది సీనియార్టీ జాబితాను విడుదల చేస్తామనీ, స్కూల్ అసిస్టెంట్ల నుంచి వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామని తెలిపారు. వారికి పదోన్నతుల ఆర్డర్లను జారీ చేస్తామని వివరించారు. ఈనెల 12,13 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. 14న అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్ బదిలీల కోసం వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. ఈనెల 19న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. ఈనెల 20న స్కూల్ అసిస్టెంట్ ఖాళీల వివరాలను ప్రకటించాలని తెలిపారు. 21 నుంచి 24 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామని వివరించారు. ఆయా తేదీల్లో పదోన్నతుల ఆర్డర్లను ఇవ్వాలని సూచించారు. 25న ఎస్జీటీల ఖాళీలను ప్రకటించాలని తెలిపారు. 26 నుంచి 28 వరకు తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామనీ, వెబ్‌ఆప్షన్లను స్వీకరిస్తామనీ, కౌన్సెలింగ్ నిర్వహించి ఎస్జీటీలకు బదిలీలు చేపడతామని పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి 30 వరకు ఎస్జీటీలకు బదిలీల ఉత్తర్వులను జారీ చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టేందుకు షెడ్యూల్‌ను విడుదల చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం ప్రకటించాయి. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్, పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించి పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు.

తీన్మార్.. విజయం

- వరంగల్- ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నిక
- సెకండ్ ప్రియార్టీ కౌంటింగ్‌తో తేలిన ఫలితం
- నిర్దేశిత ఓట్లు 1,55,095 సాధించి రాకేశ్‌రెడ్డిపై మల్లన్న గెలుపు
- మూడ్రోజుల పాటు కొనసాగిన కౌంటింగ్



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/మిర్యాలగూడ

ఉమ్మడి వరంగల్-ఖమ్మం- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపొందారు. ఉప ఎన్నిక ఫలితం శుక్రవారం రాత్రి వెలువడింది. మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజేత వెల్లడి కాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ పైచేయి సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కన్నా ముందుగా కోటా ఓట్లు 1,55,095 ఓట్లు సాధించి విజయం సాధించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్టు పోటీ సాగింది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా శుక్రవారం ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ఎన్నికల బరిలో ఉన్న 52 మందిలో చివరి అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ ప్రక్రియ మొదలుపెట్టారు. వెయ్యి ఓట్లలోపు ఉన్న అభ్యర్థులకు పోలైన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని ఒక్కొక్కరిని తొలగిస్తూ వచ్చారు. ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరు నెగ్గాలన్నా పోలైన 3,36,013 ఓట్లలో 23వేలకు పైగా చెల్లలేదు. చెల్లిన ఓట్లలో 50శాతం +1 వచ్చిన అభ్యర్థిని విజేతగా నిర్ణయించారు. ఈ మేజిక్ ఫిగర్ 1,55,095ను తీన్మార్ మల్లన్న ముందుగా అందుకోవడంతో ఆయన్ను విజేతగా ప్రకటించారు.

రెండో ప్రాధాన్యతలోనూ మల్లన్నే..

మొదటి ప్రాధాన్యత ఓట్లలో అత్యధికంగా తీన్మార్ మల్లన్న 1,23,813 ఓట్లు సాధించారు. మేజిక్ ఫిగర్‌కు ఆయన 31,282 ఓట్ల దూరంలో ఆగిపోయారు. ఈ నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఆయన తర్వాతి స్థానంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి 1,04,248 తొలి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. విజయం సాధించాలంటే నిర్దేశిత లక్ష్యానికి 50,847 ఓట్ల దూరంలో ఉన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి 43,313 తొలి ప్రాధాన్యం ఓట్లు సాధించారు. 1,11,782 ఓట్ల దూరంలో ఆయన ఆగారు. స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 29,697 తొలి ప్రాధాన్యం ఓట్లు రావడంతో ఈయన కూడా లక్ష్యానికి దూరంగా ఉన్నారు.

ఎలిమినేషన్ షురూ..

ఏ అభ్యర్థీ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. 52 మంది అభ్యర్థుల్లో ముందంజలో ఉన్న నలుగురిని ఉంచి మిగిలిన 48 మందిని ఎలిమినేట్ చేశారు. అయినా ఏ ఒక్క అభ్యర్థీ లక్ష్యాన్ని అందుకోకపోవడంతో స్వతంత్ర అభ్యర్థి అశోక్‌ను తొలగించి, ఆయన ఓట్లను షేర్ చేశారు. అశోక్ నుంచి ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మల్లన్న, రాకేశ్‌రెడ్డి దాదాపు సమానంగా పంచుకున్నారు. దాంతో మల్లన్న 1,23,709, రాకేశ్‌రెడ్డి 1,04,846 ఓట్లకు చేరుకున్నారు. గెలుపునకు ఇంకా మల్లన్నకు 31,386, రాకేశ్‌రెడ్డికి 50,249 ఓట్లు అవసరం పడ్డాయి. ఈ క్రమంలో మల్లన్న 18,863 ఓట్ల లీడ్‌లో ఉన్నారు. అశోక్ ఎలిమినేషన్ తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్లు కాంగ్రెస్‌కు 1489, బీఆర్ఎస్‌కు 848, బీజేపీకి 385 చొప్పున లభించాయి.

ఈ క్రమంలో మల్లన్న 19,375 ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లీడ్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని సైతం తొలగించి ఓట్లు షేర్ చేశారు. బీజేపీ అభ్యర్థికి పోలైన మొదటి ప్రాధాన్యత ఓట్లలో రెండో ప్రాధాన్యతకు వచ్చేసరికి బీఆర్ఎస్ అభ్యర్థికి ఎక్కువ మంది వేశారు. ఇలా సుమారు ఆరు వేల ఓట్లు రాకేశ్‌రెడ్డికి మల్లన్నతో పోలిస్తే అధికంగా పోలైనట్టు తెలుస్తోంది.

మల్లన్న గెలుపు లాంఛనమే..

రాత్రి 9.30 గంటల వరకు పూర్తిస్థాయి ఫలితం అధికారికంగా వెలువడలేదు. అయితే మలన్న గెలుపు దాదాపు ఖాయమేనని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిపై 18వేల మెజార్టీతో మల్లన్న కొనసాగుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుందని మల్లన్న కౌంటింగ్ కేంద్రం వెలుపుల మీడియాకు వెల్లడించారు. మూడ్రోజుల పాటు 9 గంటలకు ఓ షిఫ్ట్ చొప్పున రోజుకు మూడు షిఫ్ట్‌లుగా సిబ్బంది శ్రమించి ఫలితాన్ని తేల్చారు.

ఆందోళన వద్దు.. అవగాహన పెంచుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వస్తుంటాయి. ఇవి రాకుండా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం, వేడి ఆహారాన్ని మాత్రమే భుజించడం, నీరు నిల్వలేకుండా చూసుకోవడం, డెంగ్యూ ప్రబలకుండా దోమల ఉత్పత్తి జరగకుండా పాత సామానుల ను తీసేయడం ఉంచుకోవడం వంటివి చేయాలి.

ఈ వ్యాధులపరంగా రిస్క్ ఎక్కువ ఉన్న వారెవరు?

చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల ఆయా వ్యాధుల బారిన వీరు ఎక్కువగా పడే అవకాశముంది. ఇలాంటి వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షంలో తడవకూడదు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు ఉపయోగించాలి. ఇతరత్రా జాగ్రత్తలు తీసుకోవడం కూడా అవసరం.

సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే ఏమి చేయాలి?

సీజనల్ వ్యాధులకు ఆందోళన చెందాల్సిన పని లేదు. ప్రతి సారి ఈ వానాకాలంలో వచ్చే వ్యాధులే అవి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటివి వస్తే మూడు రోజుల్లో తగ్గిపోతాయి. అప్పటికీ తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచింది. సాధారణ డెంగ్యూ వస్తే ఆందోళన చెందాల్సిన పని లేదు. డెంగ్యూ షాక్ సిండ్రోమ్ (తీవ్రమైన దశ)కు చేరితే అది ప్రాణాంతంగా మారే ప్రమాదముంది. ఆ పరిస్థితిలో ప్లేట్ లెట్స్ తగ్గుతుంటాయి. ఆరోగ్యవంతునిలో 1.5 లక్షల నుంచి 4 లక్షల వరకు అవి ఉంటాయి. వాటి సంఖ్య లక్షలోపునకు తగ్గితే వెంటనే జాగ్రత్త పడాలి. అయితే వాటి సంఖ్య మరీ తగ్గి 20 వేల లోపుకు పడిపోతే ప్లేట్ లెట్స్ ఎక్కించుకోవాల్సి ఉంటుంది.

కుక్కకాటు, ఇతర జంతువులు గాయపరిచిన సందర్భాల్లో ఏం చేయాలి?

సాధారణంగా వేసవిలో ఎక్కువగా ఉండే కుక్కకాటు కేసులు వర్షాకాలంలో తక్కువగా ఉంటాయి. అయితే కుక్కకాటు, కోతులు కరవడం, పిల్లలు గీరడం, ఇతర జంతువులచేత గాయాలపాలైతే తప్పనిసరిగా దానికి తగిన చికిత్స చేసుకోవాలి. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా పలువురు చనిపోయారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కుక్కకాటుకు ఫీవర్ ఆస్పత్రిలో ఉచితంగా వ్యాక్సిన్లను అందిస్తున్నాం. ఇతర జంతువుల చేత గాయాలైనా ముందుగా వేసుకునే ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుంది. వ్యాక్సిన్ ను 5 దశల్లో వేస్తున్నాం. సాధారణంగా రేబీస్ వచ్చిన వారిలో ధ్వని, వాయు, నీటి ఫోబియా లక్షణాలుంటాయి.

ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలతో పాటు, కొత్తగా అందుబాటులోకి ఏమైనా సౌకర్యాలు రానున్నాయా?

ప్రస్తుతం ప్రతి రోజు 300 నుంచి 400 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. వారిలో దాదాపు 50 శాతం మందికి టెస్టులు అవసరం పడుతున్నాయి. వారికి పరీక్షలు చేసేందుకు అవసరమైన ల్యాబ్ సౌకర్యంతో పాటు అవసరమైనంత మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అందులో వైరాలజీ, ప్యాథాలజీ, బయోకెమిస్ట్రీకి సంబంధించిన పరీక్షలు చేస్తున్నారు.

రేబీస్‌కు బీబీనగర్ ఎయిమ్స్‌తో పాటు ఫీవర్ ఆస్పత్రిలో రోగ నిర్ధారణ పరీక్షలను చేస్తున్నాం. ఇటీవల నేషనల్ రేబీస్ ఎరాడికేషన్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం ఫీవర్ ఆస్పత్రిలో డయాగ్నస్టిక్ సేవలను గుర్తించింది. దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను పంపించాం. కొత్త అవుట్ పేషెంట్ బ్లాక్ అందుబాటులోకి రానుంది.



తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ ఇన్ఫ్రాక్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గట్టు బాలకృష్ణ, దొబ్బ అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ - బడంగ్ పేట్



నవతెలంగాణ-సిటీబ్యూరో
సుప్రజ ఏ యూనిట్ ఆఫ్ దంతూరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శిగా విజయ్ కుమార్ జన్మ దినం సందర్భంగా..రెడీ ఫోర్ సర్వ్ ఫౌండేషన్‌లో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇంటర్ బోర్డు కార్యాలయం ముట్టడి





నవతెలంగాణ - సంతోష్ నగర్
అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ మాట్లాడుతూ...కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలల మాఫియాపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేటు జూనియర్ కళాశాలలోని ఫీజుల దోపిడిని అరికట్టాలని కోరారు. ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం గుర్తింపు లేని జూనియర్ కళాశాలలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని చెప్పారు. కార్పొరేట్ కళాశాలలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలలో స్టడీ మెటీరియల్, యూనిఫార్మ్ పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా నాయకులు వంశీ, రఘు, అనిల్, పవన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ - సంతోష్ నగర్
మలక్‌పేట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. డివిజన్ కార్పొరేటర్ ఎండీ సైఫుద్దీన్ షఫీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పరిధిలోని పలు ప్రాంతాలలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే బాలల ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట నియోజకవర్గం కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజలకు సురక్షిత తాగునీరందిస్తాం'

నవతెలంగాణ - మలక్ పేట్







మలక్‌పేట్ నియోజకవర్గం ప్రజలకు సురక్షిత తాగునీరందిస్తామని ఎమ్మెల్యే బలాల అన్నారు. మలక్ పేట్ పల్టాన్ ప్రాంతంలో రూ.7లక్షల 18 వేలతో ఏర్పాటు చేసిన బూస్టర్ పంప్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులు సురక్షిత నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే బూస్టర్ పంప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ మినహజుద్దీన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

- కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్
యువత క్రీడల్లోనూ రాణించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు ప్రాంగణంలో కార్పొరేటర్ నేతృత్వంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులకు గణేష్ నగర్ కాలనీ ఫేస్ -1కు చెందిన మౌలానా బాబా టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లలను సెల్ ఫోన్లకు వ్యసనపరులను కానివ్వకుండా వివిధ రకాల క్రీడలకు అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. క్రీడలు ఆడడం వలన ఆరోగ్య రీత్యా దృఢంగా, మానసిక ఉల్లాసంగా ఉండడమే కాకుండా ఎటువంటి చెడు వ్యసనాలకు అలవాట్లు కాకుండా ఉంటారని అన్నారు. విద్యతోపాటు క్రీడలు ఆడడానికి పిల్లలను, యువతను ప్రోత్సహించాలని కోరారు. పరిసర ప్రాంతాల నుండి పెద్ద చెరువు ప్రాంగణానికి వాకింగ్ కోసం, వివిధ వ్యాయామాల కోసం, క్రీడల కోసం వచ్చే ప్రజలకు వసతులు కల్పనలో, అభివృద్ధికి కృషి చేస్తున్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ జలంధర్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, వేమన్ రెడ్డి, కవితా రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ మల్లాపూర్ గ్రామంలో చింతుల్ల కోటేశ్ తండ్రి చింతుల్ల రాములు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ చిగురింత నరసింహారెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి శుక్రవారం అక్కడికి చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పన్నాల రాజేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, మహేష్, నగేష్, అనిల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ - బడంగ్ పేట్

టీజీపీఎస్సీ

గ్రూప్ 1 ఎగ్జామ్స్‌కు ప్రత్యేక బస్సులు



నవతెలంగాణ - హయత్ నగర్
హయత్ నగర్ 1 డిపో నుండి టీజీపీఎస్సీ గ్రూప్ 1 ఎగ్జామ్స్ కు ప్రత్యేక ఆర్టీసీ బస్సులతో పాటు అభ్యర్థులకు సెంటర్ సమాచారం తెలిపేందుకు ప్రత్యేక కౌంటర్‌ను హయత్ నగర్ బస్టాండ్‌లో ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజర్ విజయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం జరిగే టీజీపీఎస్ సీ గ్రూప్ 1 ఎగ్జామ్స్‌కు దూర ప్రాంతాల నుండి వచ్చే వారు సిటీ బస్సులు, పరీక్షా కేంద్రాలకు వెళ్లే బస్సుల రాకపోకల గురించి ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 9700000459 ద్వారా స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డిని సంప్రదించాలని కోరారు. ప్రత్యేక బస్సులు కావాలంటే 45మంది ఉంటే 9959226138, 7382826476 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



నవతెలంగాణ - సంతోష్ నగర్
వేర్వేరు ఘటనల్లో నవవధువు, ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఐఎస్ సదన్ డివిజన్లోని ఓ కాలనీలో ఉంటున్న యువకుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల మే 24న అతనికి ఓ యువతితో వివాహమైంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నెల 4న ఉదయం విధులకు వెళ్లిన ఆ యువకుడు మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సదరు యువతి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు అతనికి చెప్పారు. దీంతో సమీప బంధువుల వద్ద ఆమె ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోయింది. యువతి భర్త సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో వృద్ధుడు..



విజయవాడకు చెందిన కందవల్లి నాగేశ్వరావు సైదాబాద్ డివిజన్ కరణ్బాగ్ కాలనీలోని కుమార్తె వద్ద ఉంటున్నాడు. మే 30న ఇంట్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయటికి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాలేదు. విజయవాడకు వెళ్లారేమో అని కుమార్తె భావించింది. కానీ అతను ఇంట్లోనే ఫోన్ వదిలి వెళ్లిపోయాడు. సమీప బంధువులు, సన్నిహితుల వద్ద అతని ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. కానీ అతని ఆచూకీ తెలియకపోవడంతో వెంటనే పోలీసులను ఆశ్ర యించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

వర్షాకాలం దృష్ట్యా

ముందస్తు చర్యలు చేపట్టాలి

బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజ్ సత్యం చారి

నవతెలంగాణ - హస్తినాపురం
రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు అందోజ్ సత్యం చారి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నేపథ్యంలో హస్తినాపురం డివిజన్ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. విద్యుత్ తీగలు భారీ చెట్ల మధ్యలో ఉండడం వలన వలన విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. డివిజన్‌లో ప్రభుత్వ సేవలు కొన్ని కాలనీలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న పలు కాలనీలకు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, మ్యాన్ హెూల్స్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ డివిజన్ ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నవతెలంగాణ - చైతన్యపురి
గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ శాఖ సీఐ శ్రీనివాస రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్ నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించారు. ఇందులో భాగంగా భద్రాచలంలో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న ప్రేమ్ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు ఆ గంజాయిని బాలాపూర్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గస్తీలో ఎస్సైలు ఫయాజ్, కృష్ణయ్యగౌడ్, రవి, వెంకట్, నర్సింహారావు, సరూర్ నగర్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



పేరుకుపోతున్న చెత్త

నవతెలంగాణ - మలక్‌పేట్
అక్బర్ బాగ్ చౌరస్తాలో మూడు, నాలుగు రోజుల నుండి చెత్త తొలగించకపోవడంతో పేరుకుపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో దుర్వాసన, దోమలు ఎక్కువ అవుతున్నాయని, వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - వనస్థలిపురం
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్య కాలనీ నందు నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి శుక్రవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితమే ఇక్కడ డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అందుకే సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు రఫీ, ప్రజ్ఞ, గుంటి జంగయ్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యంజాల సుధాకర్, జనరల్ సెక్రటరీ రామావత్ రవి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్, వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, సలహాదారులు గోపినాయక్, శోభమ్మ, హనుమంతు, నారాయణ, జాయింట్ సెక్రటరీ యాదగిరి, దేవేందర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి



- మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్
నేటి సమాజంలో చదువుకున్న యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధితో వృత్తి వ్యాపార రంగంలో రాణించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హైదరాబాదీ టీ హౌస్‌ను శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో రాణిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయంగా వృత్తి ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, కుమార్, టీ హౌస్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

భీమా నాయక్ సేవలు మరువలేనివి



- జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్

నవతెలంగాణ - చైతన్యపురి
అపార్ట్మెంట్స్ వాచ్మెన్‌గా పనిచేస్తూ వారి సమస్యలపై సీఐటీయూ అండతో పోరాటాలు చేసిన, వాచ్మెన్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ భీమా నాయక్ సేవలు మరువలేనివని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. చైతన్యపురిలోని సీఐటీయూ పార్టీ కార్యాలయంలో సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంతాప సభకు ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరూర్ నగర్ కేంద్రంగా అపార్ట్మెంట్స్ వాచ్మెన్‌గా పని చేస్తూ వారి సమస్యలపైన ఎంతో కృషి చేశాడని కొనియాడారు. డ్రైవర్ నైపుణ్యం ఉండడంతో స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేశాడని, ఎక్కడ పని చేసినా సీఐటీయూ పద్ధతిలో కార్మికుల ఐక్యతకు కృషి చేశాడని గుర్తుచేశారు. కామ్రేడ్ డి భీమా నాయక్ అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో చిన్న వయసు(39)తో మనకు దూరం అవడం చాలా బాధాకరం అని అన్నారు.
సంతాప సభలో సరూర్ నగర్ సర్కిల్ సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, కామ్రేడ్ డి. భీమా నాయక్ భార్య క్రాంతి, పిల్లలు, కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జి చైతన్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి మల్లేష్, క్షవర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్, ప్రైవేట్ అపార్ట్మెంట్ వాచ్మెన్‌గా ఉన్న సభ్యులు స్వామి, బాబన్న, అంజన్న, శంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ నుండి ముగ్గురు పోలీసులు బదిలీ

నవతెలంగాణ - హయత్ నగర్
ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత చేపట్టిన బదిలీల్లో భాగంగా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు పోలీసులు బదిలీ అయ్యారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ విక్రం రెడ్డి నాగోల్ పోలీస్ స్టేషన్‌కు, హెడ్ కానిస్టేబుల్‌లు మన్మోహన్ సరూర్ నగర్‌కు, రామ్ చందర్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్లకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం వారిని ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ఎక్కడ ఉన్నా ప్రజల కోసం పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని సూచించారు. వారిని సన్మానించిన వారిలో ఎస్ఐలు లింగారెడ్డి, మధు, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | జూన్ 08, 2024 | www.navatelangana.com

అభివృద్ధి పనులను ప్రారంభించాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

ఎన్నికల కోడ్‌తో నాచారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలం వచ్చినా నాచారం పెద్దనాలా డీసిల్టింగ్ పనులు చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాబా నగర్ ఎస్టీపీ నుంచి నల్లచెరువు వరకు ఉన్న ట్రంక్ లైన్‌పై చాలా కాలనీల వర్షపు నీటిలైన్‌లు కలిపారని, కానీ ఈ ట్రంక్ లైన్‌కు ఎలాంటి మెయింటెనెన్స్ చేయకపోతే చాలా కాలనీలు ముంపునకు గురవుతాయని పేర్కొన్నారు. ఇందిరానగర్‌లో ఉన్న ట్రంక్ లైన్‌లోని సిల్ట్ తొలగింపు పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం లబ్దిదారులపై ప్రయివేట్ వ్యక్తులు దాడి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ పరిధిలోని చైతన్య నగర్ హెచ్‌బీ కాలనీ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో కొంత మంది ప్రయివేట్ వ్యక్తులు డబుల్ బెడ్రూం లబ్దిదారులపై దాడి చేసి లబ్దిదారుల ఇండ్లకు తాళాలు వేశారు. ఇదేంటని ప్రశ్నించిన లబ్దిదారులపై దాడి చేయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితులు తమకు రక్షణ కల్పించాలని కుషాయిగూడ ఏసీపీ మహేష్, సీఐ రాజు నాయక్‌లకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్కాజిగిరి అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి డివిజన్ అభివృద్ధిపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులతో మల్కాజిగిరిలోని అన్ని డివిజన్ల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గాన్ని రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కలిగించే ందుకు రైల్వే ఉన్నతాధికారులకు, డ్రయినేజీ, తాగునీరు సమస్యల పరిష్కారానికి జలమండలి ఉన్నతాధికారులకు, పలు కాలనీల్లో బాక్స్ డ్రయినేజీ, స్ట్రోమ్ వాటర్ డ్రయినేజీ, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, కూడలిల సుందరీకరణ వంటి పలు అభివృద్ధి పనులపై చర్చించి నూతన అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. టెండర్ అయి మధ్యలో నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు, ప్రారంభించబోయే పనుల కోసం, జరుగుతున్న పనులపై ఆయా శాఖల అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, జవహర్ నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, జేపీసీ వెంకన్న, జీకే. హనుమంతరావు, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, కరంచంద్, చిన్న యాదవ్, శ్రీనివాస్ గౌడ్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శ్రీనివాసులు, మల్లేష్ గౌడ్, సయ్యద్ మోసిన్, బాలకృష్ణ, భాగ్యానంద్, ఉస్మాన్, ఇబ్రహీం, వంశీ, మహేష్, సూర్య ప్రకాష్, మల్లేష్ యాదవ్, సర్వే నరేష్ ,నరసింగరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీ స్వార్థ ప్రయోజనాలకు మమ్మల్ని బలి చేయాలని చూస్తావా



- నాపై వ్యక్తిగత విమర్శలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలకు సిద్ధం
- కార్పొరేటర్ సుభాష్ నాయక్

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి స్వార్థ రాజకీయాల కోసం తనను వ్యక్తిగతంగా కించపరిచే పనులు చేస్తున్నారని పీర్జాదిగూడ కార్పొరేషన్ 2వ డివిజన్ కార్పొరేటర్ కె.సుభాష్ నాయక్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడు తూ.. మేయర్ తన అనుచర వర్గం వారు కావాలనే తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మండిపడ్డారు. గత గురువారం మేయర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తనపై వ్యక్తిగత దూషణలు చేశారని పేర్కొన్నా రు. తాను కేవలం డివిజన్ అభివృద్ధి కోసమే అధికార పార్టీలోకి వచ్చానని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తనను చులకన చేసే విధంగా మేయర్ వర్గం వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కేసు పెడుతానని హెచ్చరించారు.

పార్కు స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకునేది



- పోచారం మున్సిపల్ చైర్మెన్ కొండల్ రెడ్డి

నవతెలంగాణ-ఘట్కేసర్

పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యంనంపేట్ శ్రీవేంకటేశ్వర హౌసింగ్ కాలనీలోని సర్వే నెంబర్ 137.138లోని 8 వేల గజాల స్థలం కబ్జా కు గురవుతుందని, ఆ కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కబ్జా కాకుండా రూ.20లక్షల మున్సిపల్ నిధులతో ఫెన్సింగ్ వేయించామని తెలిపారు. కబ్జాదారుల తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోచారం మున్సిపల్‌లో పార్క్ స్థలాలు కబ్జాలు కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రెడ్య నాయక్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సుర్వి రవీందర్, నాయకులు నర్రి కాశయ్య, ఆకిటి బాల్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, మోటుపల్లి శ్రీనివాస్, బైర ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

శ్రీరంగ గిరిపై రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవతో నేటి ఉత్సవ కార్యక్రమం మొదలైంది. అనంతరం ప్రభాత ఆరాధన, తిరుప్పావై, ప్రాబోధకి ఆరగింపు జరిగాయి. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పభుదాస్, దేవేందర్‌రెడ్డి స్వామి వారి సేవా కైంకర్యంలో పాల్గొన్నారు. అనంతరం ద్వారతోరణ ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్రహవనం జరిగాయి. ప్రసాదాన్ని సంతానార్థులైన జంటలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి అన్ని రకాల సాయం అందజేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, గంధం నాగేశ్వర్ రావు, ఆకుల మహేందర్, జంపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల పక్కనే చెత్త..ఇబ్బందుల్లో ప్రజలు

- పందుల స్వైరవిహారంతో తప్పని కష్టాలు
- పట్టింపులేని మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ-కీసర

ఇండ్ల పక్కనే చెత్త వేయడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. చుట్టూ చెత్తతో పాటు పందుల స్వైర విహారంతో సమీప కాలనీల ప్రజలు గత కొన్ని నెలలుగా రోగాల బారిన పడుతున్నారు. అయినా నాగారం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామంలోని హనుమాన్ నగర్‌కాలనీలో రోడ్డు పక్కనే ప్రజలు చెత్తను వేస్తుండటంతో సమీప ప్రజలు చెత్త దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. చెత్త ఇక్కడ వేయొద్దని మున్సిపల్ అధికారులు బోర్డు ఏర్పాటు చేసిన ఎవరూ పట్టించుకోకుండా యథేచ్ఛగా చెత్తను వేస్తున్నారు. చెత్త సమీపంలో కంప చెట్లు ఎక్కువగా ఉండటంతో పందులు స్వైర విహారం చేయడంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. వినాయకుడి గుడి నుంచి ముందు కాలనీలకు వెళ్లేవారు ఆ రోడ్డుగుండా వెళ్లాలంటేనే ముఖాలకు అడ్డుగా కర్చీఫ్ పెట్టుకుంటూ నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగారం మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తమ సమస్యను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త, పందుల సమస్యను మున్సిపల్ అధికారులు పరిష్కరించక పోతే జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకెళ్తామని ప్రజలు తెలిపారు.



చెత్త, పందుల సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



ప్రతీ రోజు ఇక్కడ కొందరు వ్యక్తులు చెత్త వేస్తుండటంతో చాలా దుర్వాసన వస్తుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే చెత్త వాసన మరింతగా పెరిగిపోతుంది. పందులు పెద్ద ఎత్తున్న చెత్తలో బోర్లుతూ ఉండటంతో దుర్వాసన ఎక్కువ అవుతుంది. సమస్యను పరిష్కరించాలని పలు మార్లు అధికారులకు ,ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

-తరిగొప్పుల సురేందర్ , స్థానికులు

ఆత్మీయ సమ్మేళనం ఓ మధురానుభూతి

- జలమండలి పూర్వపు అధికారుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఒకే చోట పనిచేసిన వారు పదవీ విరమణ అనంతరం కలుసుకోవడం, ఆత్మీ య సమ్మేళనంలో గత అనుభవాలను గుర్తుచేసుకోవడం ఓ మధురానుభూతిని మిగుల్చుతుందని జలమండలి అధికారు లు తెలిపారు. శుక్రవారం మారేడ్ పల్లి జీఎం వినోద్ నేతృత్వంలో మహేంద్రహిల్స్ లో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ -7 మారేడ్ పల్లిలో పనిచేసి పదవీ విరమణ పొందిన జీఎం, డీజీఎం, మేనేజర్లు, అధికారులంతా హాజరయ్యారు. ఇటీవలే ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పదవీవిరమణ పొందిన శ్రీధర్ బాబు, వెంకటేశ్వర్లు, ఆనం ద్ స్వరూప్, ప్రభాకర్ తదిరులు పాల్గొ న్నారు. వీరితోపాటు ప్రస్తుతం సీజీఎంగా పనిచేస్తున్న ప్రభు, డైరెక్టర్లు రవికుమార్, స్వామి తదితరులు హాజరయ్యారు. ఆత్మీయ సమ్మేళనంలో తాము పనిచేసిన సమయంలో జరిగిన సన్నివేశాలు, గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సమావేశం అనంతరం పూర్వపు అధికారులతో పాటు వేసవిలో నీటి సరఫరా, ట్యాంకర్ మేనేజ్ మెంట్ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు మెమొంటోలు అందించారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

- మూడో అంతస్తుపై నుంచి దూకిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

లాలాగూడలో పోలీసులను చూసి భయాందోళనతో పారిపోయే క్రమంలో భవనంపై నుంచి దూకి ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి లాలాగూడలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేశారు. పోలీసులు వస్తున్న విషయాన్ని గమనించిన పేకాటరాయుళ్లు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో భయాందోళనకు గురైన వినయ్(35) తప్పించుకునే ప్రయత్నంలో మూడంతస్తుల భవనంపై నుంచి దూకేశాడు. దాంతో తీవ్రగాయాలైన వినయ్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదిలావుండగా వినయ్ మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వినయ్ బిల్డింగ్‌పై నుంచి పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో దూకేశాడా లేకా మరో కారణ ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వినయ్‌ని పోలీసులు కొట్టడం వల్లే మనస్థాపానికి గురై బిల్డింగ్ పైనుంచి దూకేశాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్నికోణాల్లో విచారిస్తున్నారు.

రోనాల్డ్ రోస్‌ను కలిసిన కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చర్లపల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. చర్లపల్లిలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలవారికి గ్రేవ్ యార్డు నిర్మించాలని గతంలో ప్రతిపాదనలు పెట్టామని తెలిపారు. ఎలక్షన్ కోడ్‌తో పనులు నిలిచి పోయాయని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసినందున గ్రేవ్ యార్డు పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు సమస్యను వివరించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చర్లపల్లి డివిజన్‌కు నూతన కరెంట్ పోల్స్ 250హై మాస్ లైట్స్, సాధారణ లైట్స్ మంజూరు చేయాలని, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా నాలాలపై కప్పులు అమర్చాలని, డీసెల్టింగ్ పనులు చేపట్టాలని కోరారు. కార్పొరేటర్ సమర్పించిన వినతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ వెంటనే శ్రీదేవి యాదవ్ అడిగిన పనులను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో పిల్లలను చేర్పించండి



- రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ సిబ్బంది

నవతెలంగాణ-జవహర్‌నగర్

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పిల్లలను చేర్పించాలని శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ సభ్యులు, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ సిబ్బందితో కలిసి అన్ని మసీదుల దగ్గర క్యాంపులు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో బాలుర కోసం జగన్ గూడలో, బాలికల కోసం రాంపల్లి ఎక్స్ రోడ్ దగ్గర రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. ఐదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని పేరొకన్నారు. నాణ్యమైన ఉచిత విద్య హాస్టల్ వసతి కలదని, యూనిఫామ్స్, నోట్ బుక్స్, పుస్తకాలు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందించి పిల్లల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. జవహర్ నగర్‌లోని ప్రతి ముస్లింలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ సాదిక్, రఫిక్, మతీన్, హైమత్ పాషా, ఖాసీం శంషోద్దీన్, ఇమామ్, ఫైజల్ పాల్గొన్నారు.

'బడిబాట'ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



- కౌన్సిలర్ ఎలిజాల నాగేష్‌గౌడ్

నవతెలంగాణ-కీసర

ప్రభుత్వం అమలు చేస్తున్న బడిబాట కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఎలిజాల నాగేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడుచున్న బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిడు పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలో చేరాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యారులకు మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

అల్వాల్‌లో బడిబాట కార్యక్రమం



అల్వాల్‌లో..

అల్వాల్‌లోని టెంపుల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్లు శుక్రవారం బడి బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం ధనలక్ష్మీ మాట్లాడుతూ.. సర్కార్ బడుల్లో అన్ని వసతులు కల్పిస్తారని తెలిపారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అత్యంత అనుభవం గల ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తామని చెప్పారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు తోడ్పడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రవంతి, సంతోషి, సులోచన, తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని 135 డివిజన్ కాలనీలోని నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అధికారులతో చర్చించి తగు న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శంకర్, శోభన్ తదితరులున్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



నవతెలంగాణ-కీసర

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కీసర జెడ్పీటీసీ బెస్త వెంకటేష్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం చీర్యాల గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణ గౌడ్, పాల్గొన్నారు.

తూంకుంటలో ప్రతీ సోమవారం ప్రజావాణి



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహింపబడుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తూంకుంట పట్టణ ప్రజలను కోరారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ 13రోజులపాటు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అదనపు బాధ్యతలను హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

నవతెలంగాణ,సిటీబ్యూరో

బిల్ కలెక్టర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కీసర

మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టరకు ఉద్యోగ భద్రత కల్పించాలని బిల్ కలెక్టర్లు పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు, నగరంలోని సీడీఎంఏ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం తమను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించిందని, దీంతో తమ వేతనంలో పెద్ద ఎత్తున కోత పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి తమ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు బాబు, సబిత, భిక్షపతి, రమేష్, ధర్మారెడ్డి, లక్ష్మన్, సాయికృష్ణ, దుర్గేష్, మహేష్, శ్రీధర్, మహేష్ ప్రసాద్, అనీల్, పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా పీస్ కమిటీ సమావేశం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బక్రీద్ పండగ సందర్భంగా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సిఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మసీద్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ ఎ.సి.పి జి.హనుమంతరావుని ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిశాడు.ఆయనతో పాటు శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

'గ్రూప్-1' పకడ్బందీగా నిర్వహించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగాచ ఎలాంటి తప్పిదాల్లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో 105 సెంటర్లు ఉన్నాయనీ, 69,727 మంది విద్యార్థిని, విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. డిపార్టుమెంట్ ఆఫీసర్స్ 105 మంది, జాయింట్ కస్టోడియన్ ఆఫీసర్స్ 7, స్ట్రాంగ్ రూమ్స్ 7, రూట్స్ 18, రూటు ఆఫీసర్స్ 18 మంది, ఫ్లయింగ్ స్కాట్స్ 22 మంది, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్ 276, అబ్జర్వర్స్ 105 మందిని నియమించినట్టు తెలిపారు. జూన్ 9న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఈ పరీక్ష ఉంటుందన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు చేపట్టాల్సిన విధి విధానాలపై డిపార్టుమెంట్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖ పరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఎలాంటి తప్పిదాలకు తావునీయకుండా, అతి జాగ్రత్తగా పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు సమన్వయతో పని చేయాలనీ, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డిపార్టుమెంట్ ఆఫీసర్లు



కేంద్రాల్లో సిట్టింగ్ అరేంజ్‌మెంట్ వసతులను పరిశీలించాలన్నారు. ప్రశాపత్రాల తరలింపులో అప్రమత్తంగా వ్యవహరించాలనీ, పోలీస్ బందోబస్తు ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలనీ, పరీక్షా సమయంలో మూడు గంటల పాటు జిరాక్స్ సెంటర్లను పూర్తిగా మూసి వేయించాలన్నారు. ఆడ, మగ అభ్యర్థులను విడివిడిగా తనిఖీ చేయాలన్నారు. 100శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పని సరిగా తీసుకోవాలన్నారు. మాస్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు అందుబాటులో ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలనీ, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని తెలిపారు. ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థి హాల్ టికెట్, ఫోటోను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎలాంటి తప్పులు జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పరీక్ష రోజు ప్రతి సెంటర్‌ను మూడు సార్లు పరిశీలించాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోనికి ప్రవేశించడానికి ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందనీ, ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోనికి అనుమతించబడదని తెలిపారు పరీక్ష కేంద్రం మెయిన్ గేటు ఉదయం 10 గంటలకు మూసేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షకు కనీసం ఒక్కరోజు ముందుగా తమ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష కేంద్రం ఖచ్చితమైన ప్రదేశాన్ని తెలుసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, చేతి గడియారాలు, హ్యాండ్ బ్యాగులు, అనుమతించబడదని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగుతుందనీ, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ సూచనలు పాటించాలని సూచించారు. అభ్యర్థులు ఆందోళనకు గురి కావద్దనీ, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రశ్నాపత్రాన్ని భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను సన్నద్ధం చేయాలని జిల్లాకు ముఖ్యమైన సామాగ్రి, ప్రశ్నాపత్రాలు చేరుకుంటున్నందున వాటిని భద్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్టుమెంట్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వమే భవనాలు నిర్మించాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వమే భవనాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గాంధీనగర్ పారిశ్రామిక వాడలో గల శ్రీ భవాని శ్రమశక్తి కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు అతిథులుగా ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా నాయకులు బాలకోటయ్య, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఏసురత్నం అతిథులుగా హాజరై ఏఐటీయూసీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ సంఘం కొరకు ఉన్న ఖాళీస్థలంలో భవనం నిర్మించుకోవడానికి అందరు కలిసికట్టుగా పనిచేసి, ఉద్యమించాలని మన హక్కులను సాధించుకోగలుగుతామని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉండాలని పోరాటం చేసిందే ఏఐటీయూసీనని పేర్కొన్నారు. భవన నిర్మాణ, కార్మికులందరికి ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యం, ఇండ్లు లేని వారికి ఇండ్ల స్థలం కొరకు రానున్న రోజుల్లో పోరాటం నిర్వహించుకోడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యత్వాన్ని జిల్లా అధ్యక్షులు నాగప్ప, ఉపాధ్యక్షుడు సాయిలు నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి, వి. శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు వి.హరినాథ్ రావు, దళిత సంఘం అధ్యక్షుడు చర్లపల్లి రాములు, బాబు, భవన నిర్మాణ సంఘం నాయకులు రవి, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులకు శంకుస్థాపన



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ పరిధిలోని ఫతేనగర్ డివిజన్ జవహర్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ రూ.9 లక్షలతో వేయనున్న డ్రయినేజీ పనులను కాలనీ వాసులతో కలిసి పనులు ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. బస్తీలో సమస్యలు స్థానిక వెల్ఫేర్ సంఘం ప్రతినిధులను అడగి తెలుసుకున్నారు. మరి కొంత మేరకు డ్రయినేజీ లైన్ పెండింగ్ ఉందన్న స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే అక్కడున్న జలమండలి మేనేజర్ అనిల్ కుమార్ ఎక్కడెక్కడ పెండింగ్ పనులు ఉన్నాయో ఎంత నిధులు కావాలో అంచనాలు తయారు చేయమని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరు చేయించుకుని, పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలా రిటర్నింగ్ వాల్ పనుల కొరకు అంచనాలు తయారుచేశారని పేర్కొన్నారు. అతి త్వరలో నిధులు మంజూరు చేసుకుని పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కల రాము ముదిరాజ్, కుక్కల కీర్తి, వెంకటేష్, సుబ్బారాయుడు, విద్యాసాగర్, రామ నరసయ్య, శ్రీనివాస్, విజయ లక్ష్మి, కమల, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల కల్తీతో.. అనారోగ్యం పాలవుతున్న ప్రజలు





- నిబంధనలు పాటించని వ్యాపారులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ రాయుల్లు
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో మరింతగా కల్తీ

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాలలో ప్రజల నిత్యావసరాల కోసం ఉపయోగించే హోటల్స్, బేకరీల వివిధ పదార్థాలు కేకలు, ఐస్ క్రీములు, జ్యూస్ బండిలు, కేకులు, కల్తీ నూనెలు ఐస్ క్రీమ్‌లు రెస్టారెంట్స్, పండ్లు, ఆకుకూరలు వంటి అనేక తినే ఆహార పదార్థాలలో కల్తీమయంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని.. వివిధ ప్రాంతాలలో పలువురు ప్రజలు తెలియజేస్తున్నారు. లాబార్జినే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యాలను విస్మరిస్తూ కల్తీని నియంత్రించే అధికారులు లేకపోవడంతో కొందరు వ్యాపారస్తులు తినే ఆహార పదార్థాలు అతి తక్కువ నాణ్యతతో డబ్బు ఎక్కువ సంపాదించాలని కల్తీకి పాల్పడుతున్నారు. అనేకమంది ముఖ్యంగా చిన్నపిల్లలు వాంతులు విరోచనాలతో ఆస్పత్రిల పాలవుతున్నారని ప్రజలు తెలిపారు.

దుండిగల్ మునిసిపాలిటీకి ఆహార కల్తీ నియంత్రించే అధికారి లేరా..!

అతిపెద్ద జనాభా కలిగిన దుండిగల్ మున్సిపాలిటీలో వివిధ శాఖలకు అధికారి తప్పనిసరి విధులు నిర్వహించవలసి ఉండగా.. ఆహార కల్తీ నియంత్రించే అధికారి (ఫుడ్ ఇన్‌స్పెక్టర్) సంవత్సరాల తరబడి ఈ మున్సిపాలిటీ లేకపోవడమే వ్యాపారస్తులకు ఆడిందే ఆటగా విచ్చలవిడిగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజల అరోగ్యాలతో ఆటాడుకుంటున్నారు. తాజాగా దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ పరిధిలోని కెవిఆర్ వ్యాలీ ప్రణీత్ కార్యాలయం ఎదురుగా గల ఓవెన్ అండ్ స్పైస్ బేకరీలో కాలనీకి చెందిన ప్రవీణ్ తన కుటుంబంలో పుట్టినరోజు సందర్భంగా ఈ బేకరీకి వచ్చాడు. కౌంటర్‌లోని వ్యక్తిని తాజాగా ఉందా లేదా అడిగి మరీ గురువారం రాత్రి కొని, ఇంటికి తీసుకొని, పుట్టినరోజు సందర్భంగా తీసుకెళ్లి పాడై పోయిన కేకును తెలియక ఇంటిల్లిపాటి తిని అనారోగ్యాల పాలయ్యారు. వెంటనే అదే కేకును బేకరీకి తీసుకువెళ్లి సిబ్బందికి తినమని తెలిపి తినిపించగా వారే స్వయంగా కేకు పాడైపోయిందని తెలుపడం జరిగింది. ఇదే బేకరీ వారు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుచు తయారు చేసే అపరిశుభ్రమైన పట్టించుకునేవారు లేకపోవడంతో... ఇలాంటి సంఘటన కేవలం ఉదాహరణ మాత్రమే. ఇలాంటి సంఘటనలు దుండిగల్ మున్సిపల్ పరిధిలో అనేక అనేకం జరుగుతున్నాయని ప్రజలు తెలియజేస్తున్నారు.



> దుండిగల్ మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారి లేని విషయం వాస్తవమేనని.. కొన్ని సందర్భాలలో తాత్కాలిక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇటువంటి సంఘటనలపై చర్యలు తప్పక తీసుకుంటా మని సత్యనారాయణ తెలిపారు.
>
> దుండిగల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ..

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పదేండ్ల బాలుడు మిస్సింగ్ కలకలం రేపింది. సమాచారం అందుకున్న బాలానగర్ సీఐ నవీన్ కుమార్ వెంటనే స్పందించి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసును గంటల వ్యవధిలోనే బాలానగర్ పోలీసులు కేసును చేదించారు. బాలానగర్ సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీ నివాసితుడు ఎలిమినేటి రాజశేఖర్ రెడ్డి కుమారుడు ఎలిమినేటి కృతిక కళ్యాణ్ రెడ్డి (10), గురువారం సాయంత్రం ఆడుకుంటానని ఇంటి నుంచి వెళ్లిన పదేళ్ళ బాలుడు కనిపించకుండా పోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా గాలింపు చేపట్టారు. సైకిల్ పై గండిమైసమ్మ వైపు వెళ్లినట్లు గ్రహించిన పోలీసులు. కేసును కొద్ది గంటల్లో చేదించి, బాలున్ని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించడంతో వారుపోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్ 1 పరీక్షలకు అన్ని రూట్లలో బస్సులు నడపబడాతాయి..

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఈ నెల 9 వ తేదీన జరిగే గ్రూప్ 1 పరీక్షలు రాసే అభ్యర్థులకు, కూకట్‌పల్లి డిపో నుంచి అన్ని రూట్లలో బస్సులు నడపబడుతాయని డిపో మేనేజర్ ఇషాక్ బిన్ మొహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే సారి 30 మంది ఏదైనా సెంటర్‌కి ఉన్నప్పటికీ 1.5 చొప్పున చార్జీతో బస్సులు అందుబాటులో ఉంటాయనీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూకట్ పల్లి డిపో మేనేజర్ కోరారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అభిమాని (కేఎస్ఆర్ పిఎ) పోలిన సంపత్ పుట్టినరోజు సందర్భంగా, కే.ఎస్.ఆర్ ని కలిసి శాలువాతో సత్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కేఎస్ఆర్ కేక్ కటింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంగా శ్రీనివాసరావు, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్‌ల ప్రజలు కలిసి వారి సమస్యలను తెలియజేశారు. దానికి సానుకూలంగా స్పందించిన కే.ఎస్.ఆర్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తానెప్పుడూ ఎల్లవేళలా అందుబాటులో ఉండి తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

నవతెలంగాణ-దుండిగల్

కాలనీలో పలు సమస్యలపై పాదయాత్ర

- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో రోడ్లు, డ్రయినేజీ లైన్లకు సంబంధించి సమస్యలు ఉన్నాయని, కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వెల్ ఫెయిర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి, కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విజయనగర్ కాలనీలో కొన్ని డ్రయినేజీలు, సీసీ రోడ్లు గతంలోనే నిర్మించడం జరిగిందని, పెండింగ్ ఉన్న డ్రయినేజీ లైన్లను త్వరలో పూర్తిచేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ వైర్లకు, పారిశుధ్యానికి సంబంధించి, వర్షం నీరు నిల్వవుండడం వంటి సమస్యలను కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో ఉన్న సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, ఎస్.ఆర్.పి నాగేశ్వర్ నాయక్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, ఎస్.ఎఫ్.ఎ సుదర్శన్, సూపర్‌వైజర్ నరేందర్, విజయనగర్ కాలనీ వెల్ ఫెయిర్ అసోసియేషన్ ప్రెసి డెంట్ బి.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్స్ పి.మురళీకృష్ణ మోహన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీతో మూత్రాశయ రంధ్రానికి చికిత్స



- విజయవంతంగా నిర్వహించిన ఏఐఎన్‌యూ వైద్యులు
- 35 ఏండ్ల క్రితం సాధారణ ప్రసవం కారణంగా రంధ్రం

నవతెలంగాణ-సిటీబ్యూరో

యూరాలజీ రంగంలోనే సరికొత్త చరిత్ర సష్టించేలా.. మూత్రాశయానికి పడిన అతిపెద్ద రంధ్రాన్ని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ విన్సీ రోబోటిక్ టెక్నాలజీ సాయంతో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు మూసేసి రోగికి ఊరట కల్పించారు. వివరాలను ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ మహ్మద్ గౌస్ ఈ శస్త్ర చికిత్సలో పాల్గొన్న సీనియర్ కన్సల్టెంట్ మహిళా యూరాలజిస్ట్ డాక్టర్ సారికా పాండ్యాతో వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లాకు చెందిన 56 ఏండ్ల మహిళ.. 35 ఏండ్లుగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. అప్పట్లో సాధారణ ప్రసవం అయినప్పుడు ఆమె మూత్రాశయానికి పెద్ద రంధ్రం పడింది. అది దాదాపు ఐదారు సెంటీమీటర్ల పొడవు ఉంది. ఈ రంధ్రం కారణంగా ఆమెకు మూత్రం నిలిచేది కాదు. ఎప్పుడూ కారిపోతూనే ఉండేది. డైపర్లు లేదా ఏదైనా బట్ట అడ్డుపెట్టుకుని ఇన్నాళ్లు ఆమె ఎలాగోలా కాలం గడిపేసేవారు. ఇటీవల ఆమె భర్తకు మూత్రపిండాల్లో రాళ్ల తీయించడానికి ఆస్పత్రికి వచ్చారు. అప్పుడు ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక సదుపాయాలను చూసి, తన సమస్య కూడా చెప్పి, దానికి ఏదైనా పరిష్కారం ఉందా అని ఆమె అడిగారు. అప్పుడు తగిన వైద్య పరీక్షలు చేసి చూసి.. ఇన్నాళ్లుగా ఎందుకు చూపించుకోలేదని అడిగాం. దానికి ఆమె.. కొందరు వైద్యుల వద్దకు వెళ్లినా రంధ్రం పెద్దది కావడంతో తాము ఏమీ చేయలేమని చేతులు ఎత్తేయడం లాంటి కారణాలు చెప్పారు. హాస్పిటల్‌లో ఉన్న అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ సాయంతో మిల్లీమీటర్ల స్థాయి రంధ్రాలను కూడా వదలకుండా మొత్తం రంధ్రాన్ని చిన్న చిన్న కోతలతోనే పూడ్చారు.

ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



- వీవీఎంహెచ్‌ఎస్ ప్రిన్సిపల్ మండవ శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారానే వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస గౌడ్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ 'వివేకానంద విద్యా మందిర్ హై స్కూల్' లో శివ డయాగ్నస్టిక్ భాగ్యలక్ష్మి కాలనీ వారిచే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ...ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంతో ఉండాలని కనీసం సంవత్సరానికి ఒకసారైనా విధిగా పరీక్షలు చేయించుకోవాలని తను ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ... ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏవైనా అనారోగ్య సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ. శ్రీనివాస్ గౌడ్ కరెస్పాండెంట్ ఎం.సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయుల బృందం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం



టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటిరెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటిరెడ్డితో 'ఇంటరాక్షన్ ప్రోగ్రాం' టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీలో శుక్రవారం నిర్వహించారు. 10వ తరగతి 100 శాతం ఉత్తీర్ణత, అత్యధికంగా 10/10 జీపీఏ రావడానికి కృషిచేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఉపాధ్యాయ బృందానికి 2024 - 2025 విద్యా సంవత్సరానికి తగు సూచనలు ఇస్తూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నూతన విద్యా విధానాన్ని అవలంబిస్తూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన అందించాలని సూచించారు. విద్యతో పాటు సంస్కారవంతులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యతను గుర్తు చేశారు. సెల్ ఫోన్, టీవీ వంటి మాధ్యమాలకు దూరంగా ఉండే విధంగా తగు సూచనలు అందించాలని తెలియజేశారు. జీవిత విలువలతో పాటు చక్కటి క్రమశిక్షణ అలవర్చుకునే విధంగా విద్యార్థిని విద్యార్థుల మనస్తత్వాన్ని గమనించి, మానసిక దృఢత్వాన్ని మనోధైర్యాన్ని నింపుతూ.. కాలానికి అనుగుణంగా ప్రణాళికను రూపొందించి పరిపూర్ణమైన విద్యార్థులుగా తయారు చేయడం మన బాధ్యతని వారు సూచించారు.

పొంచివున్న ప్రమాదం ..



నవతెలంగాణ-బంజారాహిల్స్

చూసి నడవండి పొంచివున్న ప్రమాదం.. రహదారుల్లో అకాల వర్షాలకు భారీగా గుంతలు పడి కొన్ని సందర్భాల్లో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీ కొన్ని సందర్భాల్లో చేతులెత్తేసిన ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులు సజావుగా వెళ్లడానికి మార్గాలు చూపుతున్న దృశ్యాలు చూస్తూనే ఉన్నాం. జీహెచ్ఎంసీ వాటర్ బోర్డు సమన్వయ లోపం వలన రహదారులపై పలుమార్లు ఇటువంటి గుంతలు పడ్డ మరమ్మత్తులు చేపట్టడానికి వారాల పాటు సమయం తీసుకోవడం వలన అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్ ప్రధాన రహదారిపై ఈ భారీ గుంత ప్రమాదకరంగా ఏర్పడింది.

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న

- బాబా ఫసియుద్దీన్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని నగర మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా బాబా ఫసియుద్దీన్ జన్మదినం సందర్భంగా శుక్రవారం తన అభిమానులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన కార్యక్రమంలో సుమారుగా 100 మంది పైగా యువకులు అభిమానులు పాల్గొన్నారు.

డివిజన్‌లో డ్రయినేజీ, మంచినీరు సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ రామ్ రెడ్డినగర్‌లో డ్రయినేజీ, మంచినీరు సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ రామ్ రెడ్డి నగర్‌లో స్థానిక సమస్యలపై జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో డ్రయినేజీ సమస్య, మంచినీరు డ్రయినేజీ నీరులో కలవడం జరుగుతుంది వెంటనే ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఆఫీసర్లు త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి నగర్ జీహెచ్ఎంసీ ఏఈ సాయికిరణ్ శానిటేషన్ డిపార్ట్మెంట్ చందన హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ రవీందర్, కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, బత్తుల నాగరాజు యాదవ్, పెంటవెల్లి వెంకన్న, ఇరుపాటి లక్ష్మణ్, అనేం అశోక్ కుమార్, పుట్ట కృష్ణ, సింగ జోగి మల్లేష్ స్థానికులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో మెడికల్ క్యాంపు



నవతెలంగాణ, ఓయూ

అడ్డగుట్టలో మెడికల్ క్యాంపును లేబర్ కార్డు ఉన్న వాళ్ళకు లేబర్ ఆఫీస్ తరపున వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం అడ్డగుట్ట ఐద్వా ఆఫీసులో వైద్య పరీక్షలు నిర్వహించి 65 మందికి మెడిసిన్స్ అందజేశారు. వచ్చేవారం కూడా కార్డులు ఉన్న వాళ్లందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామన్నారు. అందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని కార్డులు లేని వాళు వెంటనే కార్డులు చేయించుకోవాలన్నారు. పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీపీ, షుగర్, థైరాయిడ్‌తో పాటుగా కంప్లీట్ బ్రిక్ పిక్చర్, యూరినల్ ప్రాబ్లమ్స్, విటమిన్ లోపం అన్ని కూడా ఈ వైద్య పరీక్షల ద్వారా తెలిసి మెడిసిన్స్ ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు జరిగే మెడికల్ క్యాంపులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ మెడికల్ సిబ్బంది విజయ్ రాజు, స్టాఫ్ నర్స్ అనుపమ, అంజమ్మ, ఫాతిమా, స్వరూప, అజయ్ బాబు,కే ఎన్ రాజన్న డి.యాదగిరి పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్స్ నేరవేర్చాలి



నవతెలంగాణ-ఓయూ

తమ న్యాయమైన డిమాండ్స్ నేరవేర్చాలని త్వరలోనే నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ఓయూ కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో ఓయూ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల అత్యవసర సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రావాల్సిన ఈపీఎఫ్ బకాయిలను కోర్టు ఇవ్వాలని ఆర్డర్ ఇచ్చినా కానీ ఓయూ అధికారులు ఇంతవరకు ఇవ్వకపోవడంపై ఉద్యోగులతో సుదీర్ఘంగా చర్చించి త్వరలోనే నిరసన కార్యక్రమంలో భాగంగా మహార్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ సూర్యచందర్, వైస్ ఛైర్మన్ ఎడ్ల అంజయ్య, అధ్యక్షుడు కట్టా వెంకటేష్, జనరల్ సెక్రెటరీ అరుణ్ కుమార్, తక్కళ్ళ చేతన్,వైస్ ప్రెసిడెంట్ కట్కూరి శ్రీకాంత్, తక్కళ్ళ అభిలాష్ ,యారాల రాజేష్, మన్మోహన్ ,కన్వీనర్ డాక్టర్.కె.వీరేశం, కో కన్వీనర్ చేర్యాల శ్రీనివాస్, జంగయ్య, సీతయ్య, మల్లికార్జున్, ఫిరోజ్, మల్లేష్, అంబరాణి, పుష్ప, సుజాత, సాయి, వేణు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-అంబర్‌పేట

ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పి. రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పురలోని రుక్కుస్ యెల్లు ఆర్కెడ్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న డి.రమా కుమారుడు డి.ప్రకాష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనికి వెళ్ళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి ఈ నెల 5న ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో తల్లి రమా కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

నవతెలంగాణ-ధూల్‌పేట్



యువతి అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ జిన్సి చౌరాహి, బస్తీ దవాఖాన ప్రాంతానికి చెందిన నర్సింగ్ కుమావత్ కూతురు పూనం కుమావత్ ఇంట్లోనే ఉంటుంది. వీరు రాజస్తాన్ ప్రాంతానికి చెందిన వారు ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నెల 7న సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా రక్త సంబంధికులు, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఎంతకీ ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నీట్ మెడికల్ ఎంట్రెన్స్‌లో ఆరోపణలపై నిగ్గు తేల్చాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

వైద్య కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షల్లో కాపీయింగ్ జరిగిన ట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీయుఎంఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో చేరేందుకు గత నెల 5న జరిగిన నీట్ ఎంట్రెన్స్‌లో అక్కడక్కడ కాపీయింగ్ జరిగిందన్న అనుమానాలు వస్తున్నాయని గత సంవత్సరం 720 మార్కులకు 720 మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధిస్తే ఈసారి 67 మంది విద్యార్థులకు వందకు 100% మార్కులు రావడం పట్ల విద్యాలయ విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వీటిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నిజమని తేలితే నింది తులను కఠినంగా శిక్షించాలని జాజుల డిమాండ్ చేశారు.

ఓయూ హాస్టల్స్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

- రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయు ప్రచారం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ హాస్టల్లో 1992 నుండి పనిచేస్తున్న హాస్టల్ అండ్ మెసేజ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయు అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ హాస్టల్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యూనివర్సిటీలో కనీస వేతనాలు అమలవుతున్నప్పటికీ వీడీఏ అమలు చేయకపోవడం అన్యాయమని, క్యాజువల్ లీవ్ లేకపోవడం ఈపీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించిన ప్పటికీ, అనేక అవకతవకల వల్ల వాటిని వినియోగించుకోలేకపోతున్నారన్నారు. దాదాపుగా 375 మంది ఉద్యోగుల్లో సగం మందికి మాత్రమే ఈఎస్ఐ కార్డులు ఇచ్చినప్పటికీ వాటిని ఆస్పత్రిల్లో చూయించి ట్రీట్మెంట్ కోసం అడిగితే వీటికి కాంట్రాక్టర్లు డబ్బు కట్టలేదని ఉద్యోగులకు జవాబు చెపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరన్నరకు పైగా పని చేస్తున్న కాంట్రాక్టర్లు నేటి వరకు హాస్టల్ ఉద్యోగులకు ఈఎస్ఐ కార్డులను, పీఎఫ్‌ను సరిగా అమలు చేయలేకపోయారని ఇలాంటి వారి పైన యూనివర్సిటీ ఎందుకు చర్య తీసుకోలేదన్నారు. కాంట్రాక్టర్లను ఎందుకు రద్దు చేయలేదని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ సౌకర్యాన్ని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొన్నది గత మూడు సంవత్సరాల నుండి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. నేడు వస్తున్న వేతనాలు ఉద్యోగులకు సరిపోవటం లేదని యూనివర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచాలని గతంలో ప్రతి సంవత్సరం రూ. 1500ల చొప్పున వేతనం పెరిగేది. కానీ మూడు సంవత్సరాల నుంచి ఆ పెంచేదాన్ని నిలిపివేసిందన్నారు. సంవత్సరానికి రూ.1500లను హాస్టల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరి తో పాటు యూనివర్సిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా చెల్లింపును పునరుద్ధరించాల న్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం వేరియబుల్ డియర్ నెస్ అలవెన్స్‌తో పాటు నేడున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయు డిమాండ్ చేస్తుందన్నారు. యూనివర్సిటీ ఐడెంటి కార్డులు ఇవ్వాలని యూనివర్సిటీ హాస్టల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిమాండ్లన్నింటినీ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూ నియన్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు ఎస్ .ఎల్. పద్మ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ బ్రాంచ్ నాయకులు శంకర్, లక్ష్మి, శివ, వెంకటేష్, విజయ, సుజాత, వనజ, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా బాబా బాబా ఫసియుద్దీన్ పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్, మొహమ్మద్ బాబా ఫసియుద్దీన్ జన్మదినం వేడుకలను బోరబండలోని ఎస్ఆర్ఆర్ పురం సైట్ -1 వద్ద కేక్ కట్ చేయించిన టీం బాబాన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎతున్న పాల్గొన్నారు. అనంతరం ఫసియుద్దీన్‌ను భారీ పూలమాలలతో , శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బస్తీలో కేక్ కటింగ్, పండ్లు పంపిణీ



ప్రజల మనిషి, బడుగు బలహీన వర్గాల, పేద, బీద వర్గాల ఆశాజ్యోతి, బోరబండ కార్పొరేటర్ నగర మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ జన్మదినం సందర్భంగా, బోరబండ డివిజన్‌లోని సైట్ వన్ కాలనీ నుండి వీకర్ సెక్షన్ వరకు ఉన్న అన్ని బస్తీలలో ,తన అభిమాన వర్గం, కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, సీనియర్ నాయకులు, ప్రతి ఒక్కరూ తన అభిమానంతో ప్రతి బస్తీల్లో కేక్ కటింగ్ లు, పూజా కార్యక్రమా లు, అర్చన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి మా బోరబండ అభివృద్ధి ప్రదాత బాబా ఫసియుద్దిన్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

కోదండరామ్‌ను కలిసిన ఓయూ ఉద్యోగులు



నవతెలంగాణ-ఓయూ

తెలంగాన విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘము (టీయుఎన్‌టీఈఏ) అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘాల నాయకులు గౌరవ ఆచార్యులు కోదండ రామ్ ని శుక్రవారం తార్నాక నివాసంలో కలిసి ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను ఓపీఎస్, సీపీఎస్, ఆరోగ్య కార్డులు, పాలక మండలిలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ముఖ్యమంత్రితో చర్చించడానికి చొరవ చూపాలని, సమయాన్ని ఇప్పించాలని, ముఖ్యమంత్రిని ఓయూకు తీసుకొని రావాలని అందుకోసం ఉద్యోగుల తరపున మీరు అపాయింట్మెంట్ తీసుకోవాలని కోరారు. అందుకు కోదండరామ్ స్పందిస్తూ తప్పకుండా సీఎంని ఓయూకి తీసుకొని రావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో ఓయూ ఎన్‌జీఓఎస్ అధ్యక్షుడు బియ్యని జ్ఞానేశ్వర్, నాగ రాజు, భీమయ్య,శంకర్ నాయక్, అశోక్, విజయ్, అక్బర్ బైగ్, భూమ్ రావు, రాజేశ్వర్ రావు, యూసుఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి అసమర్ధ నిర్ణయాలే పార్టీని ముంచాయి



- కాంగ్రెస్ పార్టీ నాయకులు మోత్కుపల్లి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్ధ నిర్ణయాలే పార్లమెంట్ ఎన్నికలలో పార్టీని ముంచాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు మోత్కుపల్లి నరసింహులు విమర్శించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోత్కుపల్లి సీఎం రేవంత్ వ్యవహారంపై తీవ్రంగా మండిపడ్డారు. రేవంత్ అసమర్ధ నిర్ణయాల కారణంగా 8 స్థానాలు బీజేపీ కైవసం చేసుకుందని విమర్శించారు. ఈసారి ప్రధాని కావాల్సిన రాహుల్ గాంధీ ప్రధాని కాలేకపోయారన్నారు. తన అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకు మళ్లిందని సిగ్గుగా చెప్పడం హాస్యస్పదమన్నారు. మాదిగ సామాజిక వర్గా న్ని రేవంత్ దూరం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో కీలక సామాజిక వర్గాన్ని దూరం పెట్టడమే కాక కేవలం ఒకే సామాజిక వర్గానికి ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లోనే ఉంటానని కాంగ్రెస్‌ను కాపాడుకునేం దుకు ఇలానే మాట్లాడుతానని స్పష్టం చేశారు. 30 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనను ఆరు గంటల పాటు అపాయింట్మెంట్ ఇవ్వకుండా అవమానించారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో ముకుంద రెడ్డి, ఎస్పీ ప్రసాద్, సుధాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డేగల సతీష్ బాబు'

- సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషి చేయాలి
- ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు డా.అంబటి కృష్ణమూర్తి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలోని సంఘటిత, అసంఘటిత కార్మికులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వారి సమస్యల పరిష్కరానికి యువ ఐఎన్‌టీయుసీ నేతలు కృషి చేయాలని ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు డా.అంబటి కృష్ణమూర్తి కోరారు. హైదరాబాద్, బషీర్ బాగ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఐఎన్‌టీయుసీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డేగల సతీష్ బాబును డా.అంబటి కృష్ణమూర్తి నియమించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు సరైన జీవన వేతనంతో స్థిరమైన ఆర్థిక వృద్ధి, వృత్తిపరమైన ఆరోగ్య భద్రత, సురక్షితమైన ఉపాధి, అందరికీ సార్వత్రిక సామాజిక రక్షణ వంటి సమస్యలపై ఐఎన్‌టీయుసీ అనేక విజయవంతమైన పోరాటాలు చేసి కార్మికుల హక్కుల రక్షణకు పాటు పడుతుందని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం చేసిన డా. అం బటి కృష్ణమూర్తికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, తన భుజాలపై వేసిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయుసీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధాని చేయ డం కోసం అహర్నిశలు పని చేస్తానని డేగల సతీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయుసీ జాతీయ కార్యదర్శి బి.నాగరాజు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్, నేతలు జేమ్స్, గురుప్రసాద్ రావు, క్రిష్టారెడ్డి, వికాస్ సింగ్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత, ముస్లిం, క్రైస్తవులకు షెడ్యూల్ కులాల హెూదా ఇచ్చి కుల గణన చేపట్టాలి

- దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ. గాలి వినోద్ కుమార్ డిమాండ్



నవతెలంగాణ-ఓయూ

దళిత ముస్లిం క్రైస్తవులకు షెడ్యూల్ కులాల హెూదా ఇచ్చి కుల గణన చేపట్టాలని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. గత రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం షెడ్యూల్ కులాల హెూదా ఇచ్చి కులగణన చేపట్టి అనుకూలంగా అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని త్వరలోనే చేపడుతున్న కులగణనలో తెలంగాణ దళిత, ముస్లిం, క్రైస్తవుల మత స్వేచ్ఛను కూడా పరిరక్షించి వారికి కులపరమైన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మండల కమిషన్ నుండి మొదలుకుంటే జస్టిస్ రంగనాథ్ కమిషన్ వరకు జాతీయ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కమిషన్లన్నీ సామాజికంగా ఆర్థికంగా వెను కబడిన దళిత, క్రైస్తవ, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేశాయన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి కులగణనలో మత కుల జనాభాను లెక్కించి అన్ని రంగాల్లో వారికి రావాల్సిన వాటిని ఇవ్వాల్సి ందిగా విజ్ఞప్తి చేస్తూ రిజిస్టర్ పోస్టు ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి బీసీ కమిషన్‌కు లేఖ పంపినట్లు ప్రొ. గాలి వినోద్ కుమార్ తెలిపారు.

పాఠశాలలు విజ్ఞానానికి నిలయాలు





- ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతుల గదులు
- ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య
- ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల విద్యా బోధన
- జిల్లాలో 5 లక్షల 50 వేల పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తాం
- జిల్లాలో త్వరలో 85 వేల 8.83 ఏకరూప దుస్తులు పంపిణీ
- బడిబాట కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా అధికారి రేణుక దేవి వెల్లడి

నవతెలంగాణ-పెద్దేముల్

ప్రభుత్వ పాఠశాలలు విజ్ఞానానికి నిలయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంబాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట రెండో రోజు కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి రేణుకదేవి పాల్గొని ప్రారంభించారు. మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతి గదులు, మినరల్ వాటర్, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, ఉచిత యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠ శాలలో పిల్లలను చేర్పించాలని విద్యార్థి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల విద్యా బోధన బోధిస్తున్నారన్నారు. వికారాబాద్ జిల్లాలో 5 లక్షల 50 వేలు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయ న్నారు. జిల్లాలో త్వరలో 85 వేల, 883 విద్యార్థులకు ఏక రూప దుస్తులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలో ఉపాధ్యాయులు మంచి విద్య బోధ న అందించడం ద్వారానే 10వ తరగతి మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ విద్యాధికారి వెంకటయ్య గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్ నాథ్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్లు జ్యోతి, మంజుల, ఉపాధ్యా యులు మాధురి, విజయలక్ష్మి, సంగీత, అనంతయ్య, శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలనకు చరమగీతం

- ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సంఘం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలనకు చరమగీతం పాడారన్నారు.గత ఐదు సంవత్సరాలుగా అరాచక పాలన కొనసాగిందని దానికి అన్ని వర్గాల ప్రజలు గొప్ప కార్యదీక్షత గల ఎంతో అనుభవమున్న నాయకుడు చంద్రబాబు నాయుడును తమ ఓటు ద్వారా ఎన్ను కొని ఆంధ్రప్రదేశ్‌లో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నట్టు భావిస్తున్నారని ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ సంఘం గౌరవ అధ్యక్షులు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పెన్షనర్స్‌ను నానా విధాల ఇబ్బందులకు గురి చేసిందని అందుకే 70 సంవత్సరాల వయస్సులో పెన్షనర్స్ అందరూ కలిసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా కూటమి కి మద్దతుగా ప్రజా క్షేత్రంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మహెూత్తర కార్యక్రమంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందుకు వెళ్లిన తమకు చంద్రబాబు నాయుడు ఘన విజయం సాధించడం అత్యంత సంతోషదాయకమని, రాబోవు ఐదు సంవత్సరాలలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమకు, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని భావిస్తున్నామని భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందే కార్యక్రమంలో తమ వంతు భాగస్వామ్యం అందిస్తామని తెలిపారు.

10న వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆరవ స్నాతకోత్సవం జూన్ 10న రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరుగుతుందని వ్యవసాయశాఖ కార్యదర్శి, ఇన్ చార్జి ఉపకులపతి ఎం. రఘునందన్ రావు తెలిపారు. తెలంగాణ గవర్న ర్, పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి సీపీ రాధాకృ ష్ణన్ అధ్యక్షతన ఈ స్నాతకోత్సవం జరుగుతుందని, భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ చెల్లా శ్రీనివాసులు శెట్టి ముఖ్యఅతిథిగా పాల్గొని స్నాతకోత్సవ ప్రసంగం చేయనున్నారని రఘునందన్ రావు వివరించారు. 587 విద్యార్థులకి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలని, 165 విద్యార్థులకి పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలని అందజేయనున్నట్లు తెలిపారు. 11 మంది పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, 8 మంది యూజీ విద్యార్థులు బంగారు పతకాలు పొందనున్నారని ఆయన తెలిపారు.

ఘనంగా సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ మేడుకలు

నవతెలంగాణ-కల్చరల్

ప్రధాన రోడ్లపై డస్ట్ బిన్లను జీహెచ్ఎంసీ తొలగించిం ది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడచెత్త వేయవద్దని ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. ఇంటింటికి వచ్చే చెత్త రిక్షాలకు, చెత్త సేకరణ వాహనాలకు ఇంట్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని రెండు వేరువేరు డబ్బాలను ఇంటింటికి పంపిణీ చేసింది. పరిసరాలను అపరిశుభ్రం చేస్తే రూ. 1000నుంచి రూ.5వేల వరకు జరిమానా చేస్తామని అక్కడక్కడ ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసింది. అయినా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదని, ప్రజల్లో మార్పు రానంత వరకు ఎన్ని కోట్లు ఖర్చు చేసినా, చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు ఏర్పాటు చేసినా చెత్తను రోడ్లపైనే వేయ డం కొంత మంది ప్రజలు అలవాటు చేసుకుంటున్నారని తెలిపారు. కొంత మంది చేస్తున్న తప్పిదాల వల్ల ఆ ప్రాంత ప్రజలందరూ ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఇంటి పక్కన ఉన్న రోడ్లపై చెత్తవేయడం అలవాటు చేసుకున్నారు. కాలనీల్లో, బస్తీల్లో రోడ్లు చెత్తకుప్పలతో నిండిపోయి ఉంటున్నాయి. తమ దృష్టికి వస్తే తప్ప అక్కడ చెత్తకుప్ప పేరుకుపోయి ఉన్న సంగతి తెలియడం లేదని జీహెచ్ఎంసీ సిబ్బంది అంటున్నారు. దీంతో రోజుల తరబడి చెత్తను తొలగించక పోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోయి ఆ ప్రాంత ప్రజలందరూ ఇబ్బందులకు గురవుతున్నారని అంటున్నారు. వర్షాలు ప్రారంభమవడంతో చెత్త మరింత పేరుకుపోయి ప్రజలు రోగాల భారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. రోడ్లపై చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలు మారాల్సిన అవసరం ఉందని జీహెచ్ఎంసీ సిబ్బంది కోరుతున్నారు.

హైదరాబాదులో ఇండియా ఆర్ట్ ఫెస్టివల్

- ప్రారంభించిన మంత్రి జూపల్లి

నవతెలంగాణ-మెహిదీపట్నం



కళా ప్రియులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. హైదరాబాదులోని పీవీ నరసింహారావు ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 68 దగ్గరలోని కింగ్స్ కోహినూర్ క్రౌన్ కన్వెన్షన్ హాల్‌లో ఎంతో ఆడంబరంగా ప్రారంభమైన ఈ ఫెస్టివల్ మూడు రోజుల పాటు కొనసాగి జూన్ 9న ముగుస్తుంది. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ఫెస్టివల్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఆర్ట్ ఫెస్టివల్ ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ డైరెక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ ఇప్పటివరకు తాము న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబై తదితర నగరాలలో 25 ఫెస్టివల్‌లను విజయవంతంగా నిర్వహించామని హైదరాబాదులో నిర్వహించడం ఇదే మొదటి సారి అన్నారు. ఈ ప్రదర్శనలో గ్యాలరీ ఎగ్జిబిట్లు, ఇండిపెండెంట్ కళాకారుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో జోగిని చౌదరి, మను పరేఖ్, కిషన్ ఖన్నా, శక్తి బర్మన్, సీమ కోహ్లి లాంటి ప్రత్యేక కళాకారుల యొక్క కళాఖండాలు ప్రదర్శనలో ఉంటాయని చెప్పారు. విభిన్నమైన కళాఖండాలను కళా ప్రియులకు అందించడానికి, వాటికి మార్కెట్ కల్పించడానికి ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫెస్టివల్‌లో కళాఖండాల ప్రదర్శనతో పాటు వివిధ రకాల ఫ్యూజన్ షో లు, సంగీత కచేరీలు, లైవ్ పెయింటింగ్ ప్రదర్శనలు ఉంటాయని ఆయన వివరించారు. భారతదేశ గొప్ప కళాత్మక వారసత్వాన్ని అన్వేషించే చలనచిత్రం 'ది ఎటర్నల్ కాన్వాస్-12000 ఇయర్స్ జర్నీ త్రు ఇండియన్ ఆర్ట్" చలనచిత్రం ఈ ఈవెంట్ లో ప్రదర్శించ బడుతుందని ఆయన పేర్కొన్నారు. కళాభిమానులు ఈ ప్రత్యేకమైన సంస్కృతిక కార్యక్రమాన్ని దర్శించేందుకు బుక్ మై షోలో టికెట్స్ ఒక్క టికెట్ 299 రూపాయల చొప్పున అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.


బీసీలు, బహుజనులు సొంత రాజకీయ శక్తిగా ఎదగాలి

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీలు బహుజన సొంత రాజకీయ శక్తిగా ఎదిగితే తప్ప విముక్తి ఉండదని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బీసీలు బడుగుల స్వయం రాజ్యాధికార భావవ్యాప్తి సమయత్తకు ఈ నెల 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సాధారణ సర్వసభ్య కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకుల సమావేశానికి ఎర్ర సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ.. కేంద్ర నూతన ప్రభుత్వ ఏర్పాటులో తమ ప్రధాన ఎజెండాగా బీసీ కులగణన అని ప్రకటించినందుకు జేడీయు (నితిశ్) రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీని ఆయన అభినందించారు. ఎన్డీఏ ప్రధాన భాగస్వామిగా ఏర్పడిన టీడీపీ కూడా ఈ ఎజెండాకు మద్దతు ఇచ్చి విజయానందించిన బీసీలకు సహకరించవలసిందిగా ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఈ ఎన్నికలలో బీసీ కుల జన గణన ప్రధాన ఎజెండాగా కేంద్ర రాష్ట్రాలలో అనూహ్య ఉన్నత ఫలితాలు పొందినందున రాష్ట్రంలో సంపూర్ణ కుల జనగణన, ఆ దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా వచ్చిన గణాంకాలను తక్షణమే ప్రచురించి కొత్త సవరణలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మారిన రాజకీయ పరిస్థితులలో చంద్రబాబు కేంద్ర రాజకీయాలలో కీలక బిందువైన సందర్భంలో ఈ రాష్ట్రంలో అన్ని పార్టీల అధ్యక్షులు పోటా పోటీగా ఆయనకు 'ఖుషామత్ లేదా వీర విధేయతలు" ప్రకటిస్తున్న పరిస్థితులలో రాష్ట్ర భవిష్యత్తుపై అయన తన తీవ్ర మనోవేదనను తెలిపారు. చంద్రబాబు, వైయస్‌లు కీలక పాత్ర పోషించిన ప్రతి సందర్భంలో తెలంగాణ అస్తిత్వం, స్వయం శక్తులు కోల్పోయిన సంఘటనలు ఆయన ఉదాహరించారు. ఈ రాష్ట్రంలో ఐటీ ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిస్తున్న తరుణంలో, రాష్ట్ర బడ్జెట్‌లో 25%, ఆర్థిక అభివృద్ధి రేటులో 75% ఐటీ రంగందే అయిన పరిస్థితులలో పొంచి ఉన్న ప్రమాదాన్ని అన్ని రాజకీయ సామాజికశక్తులు గమనంలో తీసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. దొరలు, పటేళ్ల, పట్వారీలు అధికారంలో ఉన్నంతకాలం ఈ ప్రమాదాలు బానిస బతుకులు అనివార్యం అవుతున్న ఈ సమయంలో బీసీలు బహుజనులు సొంత రాజకీయ శక్తిగా ఎదిగితే తప్ప విముక్తి ఉండదనే విషయాన్ని గ్రామస్థాయి వరకు తీసుకొని పోయే విధంగా కార్యాచరణ రూపొందించడానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల పదాధికారుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మెన్ గోరిగే మల్లేశ్ యాదవ్, నీల వెంకటేష్, పి.సుధాకర్, రాజ్ కుమార్, వేముల రామకృష్ణ, అనంతయ్య, మధుసూదన్‌రావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



పెండ్లి ఓ భద్రతగా సమాజంలో భావిస్తున్నాం. ఎందుకంటే అది అందరి ఆమోదం, భాగస్వాముల మధ్య స్థిరత్వం, హక్కు, బాధ్యతలను ఏర్పరిచే ఓ చట్ట బద్ధమైన ఒప్పందం కాబట్టి. అయితే ఈ మధ్య కాలంలో కొందరు పెండ్లికన్నా లివ్-ఇన్-రిలేషన్‌షిప్‌కు ఆసక్తి చూపుతున్నారు. కానీ కొంత మంది యువత ఈ సహజీవనాన్ని కేవలం వారి క్షణికమైన కోర్కెలు తీర్చుకు నేందుకు కూడా ఉపయోగిం చుకుంటారు. దాన్ని వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాంటి సమస్యతోనే గీత ఐద్వా అదాలత్‌కు వచ్చింది. ఇంతకీ ఆమె సమస్యకు పరిష్కారం దొరికిందో లేదో మీరే చదవండీ...

ఇదీ బంధానికి బలమే..!

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

గీతకు సుమారు 32 ఏండ్లు ఉంటాయి. మంచి ఉద్యోగం, ఉన్నతమైన కుటుంబం. ఇంట్లో వాళ్లు ఆమెకు పెండ్లి సంబంధాలు చూస్తుంటే ఆమె మాత్రం 'నాకు పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు కొన్ని రోజులు లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండి తర్వాత పెండ్లి చేసుకోవాలా? లేదా? అనేది నిర్ణయించుకుంటాను. ఈ విషయంలో నన్ను బలవంతం పెట్టొద్దు' అంటూ కుటుంబ సభ్యులతో గొడవ పెట్టుకుంది.


పెద్దలు పెండ్లి చేస్తాం అంటున్నా వినకుండా పదేండ్ల నుండి తను ప్రేమిస్తున్న అశ్విన్‌తో కలిసి జీవితం ప్రారంభించింది. వారు అలా ఉండటం ఇరు కుటుంబ సభ్యులకు ఏ మాత్రం ఇష్టం లేదు. చెప్తే వినేవాళ్లు కాదు. అందుకే చూస్తూ ఊరుకున్నారు. అయితే ఇద్దరూ సహజీవనం ప్రారంభించడానికి ముందు ఓ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఏమిటంటే ఎవరు ఎప్పుడైనా రావొచ్చు, పోవచ్చు. ఎవరికి నచ్చినట్టుగా వారు ఉండొచ్చు, మాట్లాడొచ్చు. ఎవరు ఎవరినైనా ఇంటికి తెచ్చుకోవచ్చు. ఇంకొకరు నీవు ఎందుకు ఇలా చేస్తున్నావు? అని అడగటానికి వీల్లేదు. ఇద్దరిలో ఎవరికైనా వేరే వ్యక్తి నచ్చితే వారితో వెళ్ళిపోవచ్చు. ఇంకొకరి చెప్పాల్సిన అవసరం లేదు. ఇలా చాలా కండీషన్స్ రాసుకున్నారు.

పెద్దలు పెండ్లి చేస్తాం అంటున్నా వినకుండా పదేండ్ల నుండి తను ప్రేమిస్తున్న అశ్విన్‌తో కలిసి జీవితం ప్రారంభించింది. వారు అలా ఉండటం ఇరు కుటుంబ సభ్యులకు ఏ మాత్రం ఇష్టం లేదు. చెప్తే వినేవాళ్లు కాదు. అందుకే చూస్తూ ఊరుకున్నారు. అయితే ఇద్దరూ సహజీవనం ప్రారంభించడానికి ముందు ఓ అగ్రిమెంట్ చేసుకున్నారు.

ఇలా ఆరు నెలలు గడిచిపోయింది. అశ్విన్‌లో చాలా మార్పు వచ్చింది. తన స్నేహితులను తీసుకొచ్చి ఇంట్లోనే తాగేవాడు. అంతే కాదు వేరే అమ్మాయిలను కూడా ఇంటికి తీసుకురావడం మొదలుపెట్టాడు. గీత ఇదేంటని అడిగితే 'ఎవరికి నచ్చినట్టు వారు ఉండాలి అనుకున్నాం కదా! ఇప్పుడు ఎందుకు ప్రశ్నిస్తున్నావు, మన అగ్రిమెంట్ ప్రకారం నన్ను ప్రశ్నించే హక్కు నీకు లేదు. ఇదంతా నచ్చకపోతే నువ్వే ఇక్కడి నుండి వెళ్ళిపో' అనేవాడు. 'నువ్వు స్నేహితులను ఇంటికి తీసుకొస్తే నేను తీసుకురాలేనా' అంటూ గీత కూడా తన స్నేహితులను ఇంటికి పిలవడం మొదలుపెట్టింది. ఇలాగైనా అశ్విన్ తన మాట వింటాడనుకుంది. కానీ దీనికి పూర్తి విరుద్ధంగా జరిగింది. గీత స్నేహితురాలు రూప ఇప్పుడు అశ్విన్‌కు దగ్గరయింది. వాళ్ళిద్దరూ కలిసి వేరే ఇల్లు తీసుకొని ఉంటున్నారు. అయితే గీతకు ఇప్పుడు మూడో నెల. అశ్విన్ తనను వదిలి వెళ్ళిపోయాడు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రుల వద్దకు ఎలా వెళ్ళాలో ఆమెకు అర్థం కావడం లేదు. ఏమీ తోచని స్థితిలో ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

మేము ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడాము. గీత తల్లిదండ్రులు 'మేము ఎంత చెప్పినా వినకుండా వెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ మీ దగ్గరకు వచ్చింది. ఈ రోజుల్లోనూ చాలామంది ప్రేమ వివాహం అంటేనే ఒప్పుకోవడంలేదు. కానీ గీత ప్రేమను అంగీకరించి అశ్విన్‌తో పెండ్లి చేద్దాం అనుకున్నాం. కానీ వాళ్ళు మాత్రం 'కొంతకాలం కలిసి ఉంటాం. ఆ తర్వాత ఇష్టముంటే పెండ్లి చేసుకుంటాం' అన్నారు. కలిసిన ఆరు నెలల్లోనే ఇలా జరిగింది. ఇప్పుడు కూడా వాళ్ళ ఇష్టం వచ్చినట్టే చేసుకోమనండి. మేము ఏం చెప్పినా దానికి వ్యతిరేకంగానే ఆలోచిస్తుంది గీత. సహాయం కోసం మీ దగ్గరకు వచ్చింది. మాకు మీ సంస్థపై నమ్మకం ఉంది. కాబట్టి మీరే తనకు దారి చూపించండి' అన్నారు.

అశ్విన్ తల్లిదండ్రులు 'మా వాడికి స్థిరత్వం లేదు. పదేండ్లుగా గీతను ప్రేమిస్తున్నాడు. కాబట్టి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకొని హాయిగా ఉంటారు అనుకున్నాం. కొన్ని రోజులు కలిసున్న తర్వాత పెండ్లి చేసుకుంటారనే అనుకున్నాం. కానీ ఈ అగ్రిమెంట్లు ఏంటో? అసలు స్వేచ్ఛ అంటే ఏంటో వీళ్ళకు అర్థం కావడం లేదు. అందుకే ఆరు నెలల్లోనే ఈ పరిస్థితి వచ్చింది. అశ్విన్ గురించి గీతకు పూర్తిగా తెలుసు. ఈ ఆరు నెలల్లో ఇంకా బాగా తెలుసుకొని ఉంటుంది. కాబట్టి ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా మాకు ఓకే. కలిసి ఉండాలా, విడిపోవాలా అనేది వారి ఇష్టం. ఆమె అశ్విన్‌ను పెండ్లి చేసుకొని ఇంటికి వస్తే మాత్రం బాగా చూసుకుంటాం' అన్నారు.



ఇక అశ్విన్‌తో మాట్లాడితే 'మేము ముందే అగ్రిమెంట్ రాసుకున్నాం. దాని ప్రకారమే నేను నాకు నచ్చినట్టు ఉంటున్నాను. మేము రిలేషన్‌లో ఉన్నప్పటి నుండి గీత ప్రతి దానికి నన్ను అడ్డుకుంటుంది. ఎక్కడికి వెళుతున్నావు, ఏం చేస్తున్నావు అంటూ ప్రతిదీ ఆరాలు తీస్తుంది. అయినా నేను ఇప్పుడు గీతతో ఉండడం లేదు. అమె స్నేహితురాలితో కలిసి ఉంటున్నాను. నేను ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ఇలా వదిలేయండి, ఇబ్బంది పెట్టకండి' అన్నాడు.

మేము ముందే అగ్రిమెంట్ రాసుకున్నాం. దాని ప్రకారమే నేను నాకు నచ్చినట్టు ఉంటున్నాను. మేము రిలేషన్‌లో ఉన్నప్పటి నుండి గీత ప్రతి దానికి నన్ను అడ్డుకుంటుంది. ఎక్కడికి వెళుతున్నావు, ఏం చేస్తున్నావు అంటూ ప్రతిదీ ఆరాలు తీస్తుంది. అయినా నేను ఇప్పుడు గీతతో ఉండడం లేదు. అమె స్నేహితురాలితో కలిసి ఉంటున్నాను. నేను ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ఇలా వదిలేయండి, ఇబ్బంది పెట్టకండి.

మరి అగ్రిమెంట్‌లో పిల్లల గురించి ఏమీ రాసుకోలేదేంటి. తిరగడం, తాగడం, శారీరక సంబంధాలు పెట్టుకోవడం ఇలాంటి విషయాలైతే చక్కగా రాసుకున్నారు. కానీ గీత నిన్ను నిజంగా ప్రేమిస్తుంది. అందుకే నీతో తల్లి కావడానికి సిద్ధపడింది. నీతో జీవితాంతం ఉండాలను కుంటుంది. కాబట్టే నువ్వు ఇంకొకరితో మాట్లాడు తుంటే భరించలేకపోతుంది. ఇప్పుడు నీకు నీ బేబీ కోసం ఆలోచించాల్సిన అవసరం ఉందా లేదా?' అని అడిగాము.

'పెండ్లి, బాధ్యత అంటే నేను భరించలేను. అందుకే లివింగ్ రిలేషన్‌షిప్‌కు ఓకే అన్నాను. ఆ బాధ్యతలను తట్టుకోలేకే ఇప్పుడు రూపతో ఉంటున్నా. ఆమెను ఎలా వదిలి పెట్టి రావాలి. నాకు ఆలోచించుకోడానికి కాస్త సమయం కావాలి' అన్నాడు. ఇద్దరూ కలిసి మా దగ్గరకు ఐదారు వారాలు వచ్చారు. కొన్ని రోజులు కౌన్సెలింగ్ తర్వాత అశ్విన్, గీతను పెండ్లి చేసుకోడానికి ఒప్పుకున్నాడు. రూపకు వేరే అబ్బాయితో పెండ్లి కుదిరింది.

సహజీవనం అనేది ఇద్దరూ అర్థం చేసుకోడానికి ఉపయోగపడుతుంది. ఇలాంటి సంబంధాలు కూడా బంధాలకు బలాన్నిస్తాయి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా కలిసి జీవించాలి అనే ధైర్యాన్నిస్తాయి. అంతే కాని నీ కోర్కెలు తీర్చుకోడం కోసం సహజీవనాన్ని వాడుకుంటే నడవదు. ఏ రిలేషన్‌లోనైనా బాధ్యలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడు మీరు తల్లిదండ్రులు కాబోతున్నారు. బాధ్యతలు మరింత పెరుగుతాయి. ఇవే మీ జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. బాధ్యతలను ఎప్పుడూ భారంగా అనుకోకూడదు. తాత్కాలిక సంతోషానికి అలవాటు పడితే రేపు నీకంటూ ఎవ్వరూ మిగలరు. కుటుంబం, బంధాలు, ఆప్యాయతలు, అనురాగాలు ఉన్నప్పుడే జీవితం సంతోషంగా ఉంటుంది అని అశ్విన్‌కు నచ్చజెప్పి ఇద్దరికీ పెండ్లి చేశాము.

- వై వరలక్ష్మి, 9948794051

షుగర్ అదుపులో ఉండాలంటే..

మధుమేహం నయం చేయలేని వ్యాధి, ఆహారం సహాయంతో మాత్రమే దీనిని నియంత్రించవచ్చు. రోజంతా తినడం, తాగడం వల్ల మీ బ్లడ్ షుగర్ కూడా హెచ్చుతగ్గులకు గురవుతుంది. అందువల్ల, డయాబెటిక్ పేషెంట్ తన ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యకరమైన అల్పాహారంతో రోజును ప్రారంభించడం



చాలా ముఖ్యం. అది మీ రక్తంలో చక్కెరను కూడా నియంత్రణలో ఉంచుతుంది. బ్రేక్‌ఫాస్ట్‌కు సంబంధించి కొన్ని వెరైటీలు...

మునగ పరాటా: మునగ ఆకులలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, పొటాషియం, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ ఎ, సి, బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. అదే సమయంలో, మునగ ఆకుల సారం హాని కలిగించే పలు ఎంజైమ్‌లను నిరోధించడంలో సహాయ పడుతుంది. ఐసోథియోసైనేట్స్ అనే రసాయన సమ్మేళనం మునగ ఆకులలో ఉంటుంది, ఇది మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, దాని ఆకులలో కనిపించే క్లోరోజెనిక్ ఆమ్లం కూడా శరీరంలో చక్కెరను మెరుగైన రీతిలో ప్రాసెస్ చేయడంలో సహాయపడుతుంది , ఇన్సులిన్‌ను కూడా ప్రభావితం చేస్తుంది. అటువంటి పరిస్థితిలో ఉదయాన్నే మునగ ఆకులతో తయారుచేసిన పరాటా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రాణదాత.

పోహా: పోహాలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు, ఐరన్ , యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇది మీకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో చాలా కూరగాయలు కలుపుకుని తినవచ్చు. పోహా గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది, దీనితో పాటు ఇందులో ఉండే ఫైబర్ , ప్రోటీన్ కూడా మీకు ప్రయోజనకరంగా ఉంటాయి.

ఓట్స్ : వోట్స్‌లో ఉండే బీటా గ్లూకాన్ రక్తంలో చక్కెరను పెంచుతుంది. ముఖ్యంగా అధిక బరువు ఉన్నవారిలో, ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది, దీని కారణంగా రక్తంలో అదనపు గ్లూకోజ్ పేరుకుపోదు. అంటే సాధారణంగా కనిపించే ఈ అల్పాహారం మధుమేహం వంటి తీవ్రమైన పరిస్థితులను ప్రభావితం చేస్తుంది.

నానబెట్టిన గింజలు: ఇవన్నీ కాకుండా, మీరు అల్పాహారంలో నానబెట్టిన పిస్తా, బాదం, వాల్‌నట్ , వేరుశెనగలను కూడా చేర్చవచ్చు. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది, అనేక ఇతర మార్గాల్లో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

ఎన్డీఏ నేతగా మోడీ

(మొదటిపేజి తరువాయి)

సుగమమైంది. దీనితో పాటు మోడీని కూటమి అధినేతగా ప్రతిపాదిస్తూ బీజేపీ అధ్యక్షుడు జె.పి నడ్డా చేసే తీర్మానాన్ని ఆమోదించటం కోసం ఎన్డీఏ ఎంపీలతో పాటు కూటమిలోని ముఖ్యమంత్రులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. కాగా, కూటమి నేతగా తనను ఎన్నుకోవటంతో మద్దతిస్తున్న ఎంపీల జాబితాను మోడీ.. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సమర్పించారు. కూటమి నేతలతో కలిసి శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన ఆయన.. ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం, మోడీ మీడియాతో మాట్లాడారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

(మొదటిపేజి తరువాయి)

ప్రచురించిందని ఆరోపిస్తూ బీజేపీ కర్నాటక విభాగం కేసు వేసింది. ఈ కేసులో భాగంగా శుక్రవారం రాహుల్ కోర్టుకు హాజరయ్యారు. 2019-2023 కాలంలో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో 40 శాతం కమీషన్ వసూలు చేసినట్టు "40 శాతం కమీషన్ ప్రభుత్వం"గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రకటనలు చేసిందని పేర్కొంటూ కమలం పార్టీ నేత కేశవప్రసాద్ జూన్ 2023లో పరువు నష్టం దావా వేశారు. వివిధ రకాల ఉద్యోగాలకు బీజేపీ 'రేటు కార్డులు' పెట్టిందంటూ హస్తం పార్టీ పోస్టర్లు అతికించిందని, దీని వల్ల కమలం పార్టీయ పరువుకు భంగం కలిగిందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై గతంలో విచారణ చేసిన బెంగుళూరు కోర్టు కర్నాటక ముఖ్యమంత్రి, అప్పటి ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లకు జూన్ 1న బెయిల్ మంజూరు చేసింది. వారితో పాటు నిందితుడిగా ఉన్న రాహుల్‌గాంధీ జూన్ 7న కోర్టులో హాజరు కావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల్లో భాగంగా శుక్రవారం కోర్టు ఎదుట హాజరయ్యారు.మరో కేసులో.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై 2018లో వేసిన పరువు నష్టం కేసును ప్రయాగ్‌రాజ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు శుక్రవారం వాయిదా వేసింది. దీని విచారణ జూన్ 18న చేయనున్నారు. 2005లో జరిగిన నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో సీబీఐ స్పెషల్ కోర్టు షాను 2014లో విడుదల చేసింది.

ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించండి

(మొదటిపేజి తరువాయి)

బోర్డ్, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇండ్లు, వచ్చిన ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ విక్రయించని ఇండ్లు, ఇండ్ల స్థలాల పరిస్థితిని సమీక్షించారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారి చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడతామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అమలు చేస్తున్న ప్యాకేజీల ధరలకే ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్సలు అందించేలా వారిని ఒప్పించాలని, ఈ పథకం సామాజిక బాధ్యతలో భాగమని వివరిస్తూ, వారితో చర్చలు జరపాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమర్షియల్ టాక్స్ కమిషనర్ శ్రీదేవి, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హస్తినలో సీఎం..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శనివారం ఢిల్లీలో నిర్వహించబోయే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బయల్దేరి వెళ్లారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు, ఈఏడాది వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షుల మార్పు తదితరాంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ భేటీకి రేవంత్‌తోపాటు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కూడా హాజరుకానున్నారు. మరోవైపు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే శనివారం సాయంత్రం ఢిల్లీలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలకు డిన్నర్ ఇవ్వనున్నారు. రాష్ట్రం నుంచి కొత్తగా ఎంపికైన కాంగ్రెస్ ఎంపీలకు ఈమేరకు ఏఐసీసీ నుంచి ఆహ్వానం అందింది. శనివారం మధ్యాహ్నం తర్వాత సీడబ్ల్యూసీ సమావేశం కానుంది. సమావేశంలో సీఎం రేవంత్ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై నివేదిక సమర్పించనున్నారు. పార్టీ గెలుపోటములపై ఈ సందర్భంగా విశ్లేషించనున్నట్టు సమాచారం.

పాఠాలు నేర్పిన ఫలితాలు

(మొదటిపేజి తరువాయి)

అధికార కేంద్రాలు ఏర్పడకుండా నరేంద్ర మోడీ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. విధేయత చూపని అభ్యర్థుల ఓటమికి చేయాల్సిందంతా చేశారు. అయితే వీరిలో చాలా మంది గెలుపొందడంతో రాబోయే ఐదు సంవత్సరాల్లో పార్టీలో అంతర్గతంగా తిరుగుబాటు చోటుచేసుకునే అవకాశం ఉంది.

ప్రతికూల పరిస్థితులు తప్పవు

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఒకటుంది. గతంలో దూరమైన పార్టీలే ఇప్పుడు బీజేపీకి చేరువయ్యాయి. ఆయా పార్టీలతో సంబంధాలు కొనసాగించడం మోడీకి అసౌకర్యంగానే ఉంటుంది. పైగా గతంలో తమకు ఎదురైన చేదు అనుభవాలను తెలుగుదేశం, జేడీయూ వంటి పార్టీలు ఎన్నటికీ మరచిపోలేవు. ఇప్పుడు తమకు అవకాశం రావడంతో ఆయా పార్టీలు తమ డిమాండ్ల చిట్టాను మోడీ ముందు ఉంచి వాటిని నెరవేర్చాల్సిందిగా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. పులి మీద పుట్రలా కొన్ని మత సంస్థలు కూడా ఇప్పుడు ధిక్కార స్వరాన్ని విన్పిస్తున్నాయి. అయోధ్య ట్రస్ట్ తమను పట్టించుకోలేదని, కించపరిచాయని ఆ సంస్థలు గుర్రుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ గత వైభవాన్ని, ప్రాభవాన్ని కనబరచడం అసాధ్యం. ఆయన తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

దూకుడు తప్పదు

బీజేపీలోని ఈ పరిణామాలను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మలచుకోవాల్సి ఉంటుంది. గత ఐదు సంవత్సరాలుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఏ విధంగా అయితే దూకుడుగా వ్యవహరించి బీజేపీ సైద్ధాంతిక అజెండాను ఎండగట్టారో ప్రతిపక్ష కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా ఇకపై అదే విధమైన వైఖరిని ప్రదర్శించాలి. తనపై బీజేపీ నాయకత్వం ఎంతగా ద్వేషపూరిత ప్రచారం చేసినప్పటికీ రాహుల్ చెక్కుచెదరక మొక్కవోని ధైర్యంతో ముందుకు నడిచారు. ప్రభుత్వ సామాజిక, ఆర్థిక విధానాలను తూర్పార పట్టారు. ఎన్నికల బాండ్ల పథకంలో చోటుచేసుకున్న కుంభకోణాన్ని ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు.

ఇది తొలి అడుగే

ఇటీవలి కాలంలో పలు ప్రగతిశీల శక్తులు భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు తమ వంతు కృషి చేశాయి. సినీ నిర్మాతలు, రచయితలు, కవులు, వివిధ సంఘాలు, వ్యాపారులు, యూట్యూబర్లు ఈ మహాయజ్ఞంలో భాగస్వాములయ్యారు. ఆనాడు ఏ కారణం చేతనో బయటికి రాలేని శక్తులు ఇప్పుడు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఇండియా కూటమికి బాసటగా నిలిచేందుకు ముందుకొచ్చాయి. పార్లమెంట్ లేదా రాష్ట్రాల చట్టసభల వద్ద నిరసనలు, బహిరంగ లేఖలు, పిటిషన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు, పత్రికా సమావేశాలు, ఉపన్యాసాలు...ఇలా వివిధ రూపాల్లో గత పది సంవత్సరాలుగా ప్రజలు ప్రభుత్వంపై తమ అసమ్మతిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఐదు సంవత్సరాలుగా వ్యూహాత్మకంగా సాగిన ఉద్యమ కార్యాచరణ బీజేపీని ఎన్నికల్లో ఓడించడమే కాకుండా సైద్ధాంతికంగా కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ఇదే అసలైన పోరాటం. ఎన్నికల్లో గెలుపు అనేది తొలి అడుగు మాత్రమే. మున్ముందు చేయాల్సిన కృషి చాలా ఉంది. ఇందుకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇప్పుడు అనుకూలంగా ఉన్నాయి.

పుణ్య క్షేత్రాలలోనూ తప్పని ఓటమి

హిందూత్వను హైజాక్ చేసేందుకు ప్రయత్నించిన బీజేపీ చివరికి ఫైజాబాద్‌లో కూడా ఓటమి పాలైంది. శ్రవస్తి, సీతాపూర్, చిత్రకూట్, మయాపూర్, షిర్డీ, తిరుపతి, రామనాథపురం వంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో కూడా బీజేపీకి పరాభవం తప్పలేదు. హిందూత్వ వాదాన్ని తలకెత్తుకున్నప్పటికీ అనేక హిందూ దేవాలయ ట్రస్ట్ బోర్డులు బీజేపీకి గుడ్డిగా మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు వ్యతిరేకంగా హిందువులను పోటీకి నిలబెట్టినప్పటికీ ప్రజలు బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. మతపరమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం చేసిన వారికి ఇది ఓ గుణపాఠం. చివరికి వారణాసిలో మోడీ మెజారిటీ కూడా పడిపోయింది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ వంటి నినాదాలు ఇచ్చినప్పటికీ దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు బీజేపీని కాదని ఇండియా కూటమికి ఓటేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ఎలా ఉన్నప్పటికీ మోడీ, షా ద్వయానికి దేశానికి నేతృత్వం వహించే నైతిక హక్కు మాత్రం లేదు.

శాసనసభ ఎన్నికలకు సంసిద్ధత

దేశంలో గాలి మార్పు స్పష్టంగా కన్పించింది. ప్రజలందరూ కులాలు, మతాలకు అతీతంగా గంగా-జమునీ తహ్జీబ్ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టారు. వసుధైక కుటుంబంపై విశ్వాసం ప్రకటించారు. ఇక వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వారంతా ఓ తనిర్ణయానికి వచ్చారు. ఈ సంవత్సరం చివర్లో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో కూడా బీజేపీకి చేదు అనుభవాలు మిగిల్చేందుకు ఇండియా కూటమి సిద్ధమవుతోంది. ఎందుకంటే అదేమంత కష్టం కాదు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి

(మొదటిపేజి తరువాయి)

బోర్డును ముట్టడించారు. బోర్డు గేటు పైకి ఎక్కి విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జెండాలు చేబూని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొందరు విద్యార్థులు గేటు పై నుంచి ఇంటర్ బోర్డు కార్యాలయంలోకి దూకారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సమయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 'వుయ్ వాంట్ జస్టిస్, ఫీజుల దోపిడీని అరికట్టాలి, కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'అంటూ ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు నినాదాలు చేశారు. ఫ్లకార్డులను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీచైతన్య, నారాయణ, రెసోనెన్స్, ఆకాశ్ లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు, అకాడమీల పేరుతో లాంగ్ టర్మ్, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకే క్యాంపస్‌లో అనుమతి లేకుండా హాస్టల్, కాలేజీని నడుపుతున్నాయని చెప్పారు. వాటిపై ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ లేదన్నారు. హైదరాబాద్ మాదాపూర్, అయప్ప సొసైటీలలో పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు తీసుకుని అనుమతి లేకుండా ప్రవేశాలు చేపడుతూ ఫీజుల దందా చేస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ఈ దందా నడుస్తున్నా అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్ కళాశాలల ఫీజుల దందా బంద్ చేసి నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఒకే క్యాంపస్‌లో కళాశాల, హాస్టల్ నడిపిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,684 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని తక్షణమే భర్తీ చేయాలని చెప్పారు. కళాశాలలు ప్రారంభమై వారం రోజులు దాటినా పాఠ్యపుస్తకాలు ఇంకా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టుగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఇవ్వాలనీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా ఆ సేవలను అందించి తప్పుల్లేకుండా మార్కులను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శికి వినతి

అనంతరం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, ఉపాధ్యక్షులు రజనీకాంత్, సంతోష్ రాథోడ్, బి శంకర్, సహాయ కార్యదర్శులు ఎం మమత, డి కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, ప్రణయ్, కార్తీక్‌లతో కూడిన ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల అక్రమాలపై అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామంటూ కార్యదర్శి హామీ ఇచ్చారని వారు తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య పవిత్ర, రాష్ట్ర నాయకులు నాగేందర్, శ్రీమాన్, శరణ్య, మస్కు చరణ్, గుండె శివ, తరంగ్, స్టాలిన్, కార్తీక్, శ్యామ్, విఘ్నేష్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం... ట్రాఫిక్ కష్టాలు నివారించండి

ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారీ వర్షాల వల్ల ప్రజలు పడుతున్న కష్టాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. నగర రహదారులపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, వాటిని సరిదిద్దే చర్యలు వెంటనే చేపట్టాలని చెప్పారు. శుక్రవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మున్సిపల్, పోలీస్, ఫైర్, వాతావరణ శాఖల ఉన్నధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నదనీ, ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారని ఆమె తెలిపారు. రహదారులపై నీరు నిల్వకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై పరిశీలన చేసి, శాశ్వత పరిష్కారాలు సూచిస్తూ నివేదిక ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారుల్ని కోరారు. సమావేశంలో డీజీపీ రవీ గుప్తా, విపత్తుల నిర్వహణ, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, జలమండలి ఎమ్‌డీ సుదర్శన్‌రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి :
ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్
పుట్ట లక్ష్మణ్, మణికంఠరెడ్డి సహా పలువురిని అరెస్టు చేసిన పోలీసులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల కబంధ హస్తాల్లో ఇంటర్ బోర్డు ఉందని ఏఐఎస్ఎఫ్ విమర్శించింది. అవినీతి, అక్రమాలకు అది నిలయంగా మారిందని తెలిపింది. నారాయణ, శ్రీచైతన్య ఇతర కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయల ఫీజులు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించింది. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గేటు ముందు బైఠాయించి ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. ఇంటర్ బోర్డు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు నాయకులు, విద్యార్థులు యత్నించారు. అక్కడే మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేసిన బేగంబజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు సంబంధించిన అనుమతి ఒక దగ్గర, తరగతులు మరో దగ్గర నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఈ రకంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని చెప్పారు. మార్కులు, ర్యాంకులే వాటి లక్ష్యమన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న దారుణాలను న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించాలని కోరారు. వాటిలో ఫీజులుంపై ప్రభుత్వం కొరఢా ఝుళిపించాలని సూచించారు. ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు గ్యార నరేష్, గ్యార క్రాంతి, రఘురామ్, నాగజ్యోతి, రెహమాన్, నెల్లి సత్య, బరిగెల వెంకటేశ్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞానంద దూకుడు

- వరల్డ్ నం.2 ఫాబియానోపై గెలుపు
- నార్వే చెస్ 2024

స్టావింగర్ (నార్వే): నార్వే చెస్ 2024లో భారత యువ కెరటం ఆర్. ప్రజ్ఞానంద దూకుడు కొనసాగించాడు. తొమ్మిదో రౌండ్‌లో వరల్డ్ నం.2 ఫాబియానో కరువాన (అమెరికా)పై విజయం సాధించాడు. ఫాబియానోపై గెలుపుతో 13 పాయింట్లకు ఎగబాకిన ప్రజ్ఞానంద మూడో స్థానంలో నిలిచాడు. వరల్డ్ నం.1, లోకల్ హీరో మాగ్నస్ కార్ల్‌సన్.. అలిరెజాపై విజయం సాధించి 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరో మ్యాచ్‌లో వరల్డ్ చాంపియన్ డింగ్ లైరెన్ చేతిలో ఓడిన హికారు నకమురు (14.5 పాయింట్లు) (అమెరికా) రెండో స్థానానికి పరిమితం అయ్యాడు. మహిళల విభాగంలో ఆర్ వైశాలి, కోనేరు హంపి చైనా గ్రాండ్‌మాస్టర్ల చేతిలో ఓటమి చెందారు.





ఫైనల్లో అల్కరాస్

- సెమీస్‌లో సినర్‌పై గెలుపు
- ఫ్రెంచ్ ఓపెన్ 2024

పారిస్ (ఫ్రాన్స్): స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మూడో సీడ్ అల్కరాస్ ఐదు సెట్ల మ్యాచ్‌లో విజయం సాధించాడు. రెండో సీడ్ జానిక్ సినర్ (ఇటలీ) పోరాడినా ఓటమి తప్పలేదు. 2-6, 6-3, 3-6, 6-4, 6-3తో అల్కరాస్ గెలుపొందాడు. మూడు సెట్ల అనంతరం 2-1 ముందంజలో నిలిచిన సినర్.. ఆ తర్వాత వరుస సెట్లలో ఓటమి చెందాడు. ఎనిమిది ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లు సాధించిన అల్కరాస్.. పాయింట్ల పరంగా 145-147తో వెనుకంజ వేసినా టైటిల్ పోరుకు చేరుకున్నాడు. సినర్ 22 గేమ్ పాయింట్లు సాధించగా, అల్కరాజ్ 23 గేమ్ పాయింట్లతో మెరిశాడు. ఆఖరు రెండు సెట్లలో ఒత్తిడి అధిగమించి వరుసగా గేములు గెలుపొందిన అల్కరాస్ ఆదివారం జరిగే టైటిల్ పోరులో కాస్పర్ రూడ్, అలెగ్జాండర్ జ్వెరెవ్‌లలో ఒకరితో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో పావొలిని, ఇగా స్వైటెక్ నేడు టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనున్నారు. డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వైటెక్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.

లో స్కోర్లు లోడింగ్?



- భారత్, పాక్ మ్యాచ్‌పై మార్కెట్ ఆందోళన
- ఐసీసీ తీరుపై ప్రసారదారు అసంతృప్తి
- ఆదివారం దాయాదుల మెగా మ్యాచ్

భారత్, పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్ మ్యాచ్. ఇరు దేశాల్లోనూ టెలివిజన్‌కు ప్రైమ్ టైమ్. వినోదం కోసం అభిమానులు, ఆదాయం కోసం ప్రసారదారు, అమెరికాలో క్రికెట్ బ్రాండ్ నిలబడేందుకు ఐసీసీ... ఇలా అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అత్యంత కీలక మ్యాచ్. టీ20 క్రికెట్ అంటేనే పరుగుల పండుగ. కానీ న్యూయార్క్ పిచ్‌పై వికెట్ల జాతర సాగుతున్న తరుణంలో భారత్, పాక్‌లోనూ స్వల్ప స్కోర్లు నమోదు కానున్నాయి!. ప్రపంచ కమర్షియల్ మార్కెట్ రాజధాని అమెరికాలో క్రికెట్‌ను బ్రాండ్‌ను పెంచగల మ్యాచ్‌లో లో స్కోర్లు ఐసీసీ లక్ష్యానికి గండి కొట్టే ప్రమాదం నెలకొంది.

నవతెలంగాణ క్రీడావిభాగం

దాయాదుల పోరుకు కొత్త పిచ్!: నాసా కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆరు డ్రాప్ ఇన్ పిచ్‌లు సిద్ధం చేశారు. ఇందులో 2, 4 పిచ్‌లను ఇప్పటివరకు వినియోగించారు. నేడు నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు 1, 3 పిచ్‌లలో ఒకటి వాడతారు. ఆదివారం జరిగే భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు మిగిలిన పిచ్‌లను వినియోగించనున్నారు. ఇప్పటికే కొత్త పిచ్‌లపై పేసర్లకు అనూహ్య బౌన్స్, పేస్ లభిస్తున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆ ప్రభావం రెట్టింపు అవుతుంది. శ్రీలంక 77, ఐర్లాండ్ 96 పరుగులకు ఆలౌటయ్యాయి. నేడు సఫారీ, డచ్ మ్యాచ్‌లోనూ వంద పరుగుల మార్క్ గగనమే కానుంది.

పేసర్లకు పండుగ: భారత్, పాకిస్థాన్ జట్లలో నాణ్యమైన పేసర్లకు కొదవ లేదు. అర్షదీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లు పదునైన స్వింగ్, బౌన్స్‌తో రాణించారు. పాక్ శిబిరంలో షహీన్ అఫ్రిది, మహ్మద్ ఆమీర్, నసీం షా, హరీశ్ రవూఫ్‌లు స్వింగ్‌కు పెట్టింది పేరు. టాస్‌తో సంబంధం లేకుండా ఎవరు బ్యాటింగ్‌కు వచ్చినా పరుగుల వేటలో చుక్కలు కనిపించనున్నాయి. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రోహిత్ శర్మ, రిషబ్ పంత్‌లు అనూహ్య బౌన్స్‌కు గాయపడే పరిస్థితి!. అర్షదీప్ సింగ్ వరుస వైడ్ల అనంతరం క్రాస్ సీమ్‌తో బంతి సంధించినా.. బంతి గింగిరాలు తిరుగుతూ దూసుకెళ్లింది. ఇరు జట్ల పేసర్లు వికెట్ల పండుగ చేసుకోనుండగా.. భారత్, పాక్ బ్యాటర్లకు డ్రాప్ ఇన్ పిచ్‌పై పరుగుల వేట కఠిన సవాల్‌గా మారనుంది.



ప్రసారదారు ఆందోళన: టీ20 క్రికెట్‌లో పరుగుల వేట ఆదాయాన్ని రెట్టింపు చేస్తుంది. పేసర్లు ఎంత గొప్పగా బంతులేసినా, కండ్లుచెదిరే రీతిలో వికెట్లను గిరాటేసినా ఇటు అభిమానుల్లో, అటు ప్రసారదారుకు సంతృప్తి ఉండదు!. పరుగుల వేట తటస్థ అభిమానులను క్రికెట్‌కు ఆకర్షితులను చేయగలదు. ప్రసారదారుకు రికార్డు వీక్షణలతో పాటు వాణిజ్య ప్రకటనల టారీఫ్ అమాంతం పెంచుకునేందుకు సులువైన మార్గం వేయగలదు. భారత్, పాక్ మ్యాచ్‌తో ఇటు ఐసీసీ, అటు ప్రసారదారు అత్యధిక ఆదాయం ఆర్జించేందుకు లక్ష్యం పెట్టుకున్నాయి. టికెట్ల కొనుగోలు రూపంలో ఐసీసీకి ఇప్పటికే గట్టి దెబ్బ పడింది. భారత్, పాక్ మ్యాచ్ డైమండ్ క్లబ్ టికెట్ ధర రూ.8.4 లక్షలతో ఐసీసీ గణనీయంగా ఆర్జించనుంది. సాధారణ స్టాండ్ టికెట్‌కు సైతం రూ.25 వేలు వసూలు చేస్తోంది. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌తో అభిమానుల్లో క్రేజ్, మార్కెట్ హైప్ తగ్గే ప్రమాదం ఉంది.

ఐసీసీ కింకర్తవ్యం: భారత్, పాక్ మ్యాచ్‌ను న్యూయార్క్‌లో నిర్వహించి.. ప్రపంచ కార్పోరేట్ మార్కెట్ రాజధాని అమెరికాకు క్రికెట్‌ను పరిచయం చేయాలని లక్ష్యం పెట్టుకున్న ఐసీసీ ఆ దిశగా సరైన ఆచరణ చేపట్టలేదు. డ్రాప్ ఇన్ పిచ్‌లు సాధారణంగా స్పందించేందుకు మైదానంలో కుదురుకునేందుకు కాస్త సమయం పడుతుంది. కనీసం 10-12 ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడాలి. అప్పుడే పిచ్ సహజంగా స్పందిస్తుంది. ఆస్ట్రేలియా నుంచి డ్రాప్ ఇన్ పిచ్‌లను తీసుకొచ్చి కొన్నాండ్లు ఫ్లోరిడాలో ఉంచిన ఐసీసీ.. టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందు మాత్రమే న్యూయార్క్‌కు తీసుకొచ్చింది. బంగ్లాదేశ్, భారత్ వార్మప్ మ్యాచ్ కొత్త డ్రాప్ ఇన్ పిచ్‌పై తొలి మ్యాచ్. డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఐసీసీ కొన్ని ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడేందుకు ఏర్పాటు చేయగలిగితే.. ఇప్పుడు ప్రపంచకప్‌లో స్వల్ప స్కోర్లు చూసేవాళ్లం కాదు. ఇవే పిచ్‌లు రెగ్యులర్ స్టేడియాల్లో ఎదురైతే ఇప్పటికే ఐసీసీ భారీ జరిమానాలతో కొరఢా ఝుళిపించి ఉండేది!.

స్కాట్లాండ్ మురిసె!

స్కాట్లాండ్ మురిసింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయం సాధించింది. గ్రూప్-బిలో తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఆసీస్, ఇంగ్లాండ్‌లను వెనక్కి నెట్టి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. నమీబియా తొలుత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేయగా.. 18.3 ఓవర్లలోనే స్కాట్లాండ్ లక్ష్యాన్ని ఛేదించింది. 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

- నమీబియాపై 5 వికెట్లతో గెలుపు
- మైకల్ లీస్క్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

నమీబియా 155/9, స్కాట్లాండ్ 157/5

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

మైకల్ లీస్క్ (35, 17 బంతుల్లో 4 సిక్స్‌లు), (1/16) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగాడు. తొలుత బంతితో ఆకట్టుకున్న మైకల్ లీస్క్.. ఛేదనలో బ్యాట్‌తో గెలుపు ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. మైకల్ మెరుపు ప్రదర్శనతో గ్రూప్-బిలో నమీబియాపై స్కాట్లాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 156 పరుగుల ఛేదనలో స్కాట్లాండ్ బ్యాటర్లు ఆకట్టుకున్నారు. ఓపెనర్ మైకల్ జోన్స్ (26, 20 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), రిచీ బెరింగ్టన్ (47 నాటౌట్, 35 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. మరో 9 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించిన స్కాట్లాండ్ మెరుపు విజయంతో గ్రూప్‌లో అగ్రస్థానం కైవసం చేసుకుంది. అంతకుముందు, నమీబియా తొలుత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. గెరార్డ్ ఎరాస్మస్ (52, 31 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో రాణించాడు.



స్కాట్లాండ్ స్టార్ మైకల్ లీస్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

మైకల్ మెరువగా..: స్కాట్లాండ్ లక్ష్యం 156 పరుగులు. బ్రిడ్జ్‌టౌన్‌లో స్లో పిచ్‌పై ఈ లక్ష్య ఛేదన కష్టమే. తొలి పది ఓవర్లలో మూడు వికెట్లు చేజార్చుకున్న స్కాట్లాండ్... మ్యాచ్‌పై పట్టు బిగించలేదు. జార్జ్ మున్సె (7), మైకల్ జోన్స్ (26), బ్రాండన్ మెక్‌ములన్ (19)లు ఆరంభంలో మెప్పించారు. రిచీ బెరింగ్టన్ (47 నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. మాథ్యూ క్రాస్ (3) నిరాశపరిచినా మైకల్ లీస్క్ (35) తోడుగా స్కాట్లాండ్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. బెరింగ్టన్, మైకల్ జోడీ 42 బంతుల్లోనే 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి నమీబియా ఆశలను ఆవిరి చేసింది. ఆఖర్లో మైకల్ నిష్క్రమించినా.. క్రిస్ (4 నాటౌట్) తోడుగా బెరింగ్టన్ లాంచనం పూర్తి చేశాడు. నమీబియా బౌలర్లలో ఎరాస్మస్ (2/29), రూబెన్ (1/36), బెర్నార్డ్ (1/20) రాణించారు.

ఎరాస్మస్ షో: టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న నమీబియా మంచి స్కోరు సాధించింది. ఓపెనర్ కోట్జే (0) నిరాశపరిచినా.. నికోలస్ డావిన్ (20), జాన్ ఫ్రైలింక్ (12) రాణించారు. మిడిల్ ఆర్డర్‌లో గెరార్డ్ ఎరాస్మస్ (52) అర్ధ శతక ఇన్నింగ్స్‌తో నమీబియాను ఆదుకున్నాడు. జేన్ గ్రీన్ (28, 27 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), డెవిడ్ వైసీ (14), స్మిత్ (11) విలువైన పరుగులు జోడించారు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ వీల్ (3/33), బ్రాడ్ (2/16)లు వికెట్ల వేటలో మెప్పించారు.

పోరాడినా.. ఫ్లాప్!

- క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ ఓటమి
- ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000



జకర్తా (ఇండోనేషియా): పారిస్ 2024 ఒలింపిక్స్ ముంగిట భారత అగ్రశ్రేణి షట్లర్లకు ఏదీ కలిసి రావటం లేదు. షటిల్ కోర్టులో ఆఖరు వరకు చెమటోడ్చుతున్నా... వెంట్రుక వాసిలో విజయానికి దూరమవుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఇండోనేషియా ఓపెన్ నుంచి నిష్క్రమించాడు. లక్ష్యసేన్ ఓటమితో సూపర్ 1000 టోర్నీలో భారత ఆశలకు తెరపడింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నం.4 డెన్మార్క్ షట్లర్ ఆండర్స్ ఆంటోన్సెన్ చేతిలో లక్ష్యసేన్ 22-24చ, 18-21తో పరాజయం పాలయ్యాడు. 61 నిమిషాల హోరాహోరీ మ్యాచ్‌లో లక్ష్యసేన్ అద్భుతంగా రాణించాడు. కానీ రెండు గేముల్లోనూ ఆఖర్లో అనవసర తప్పిదాలు విజయాన్ని దూరం చేశాయి. తొలి గేమ్‌లో ఆంటోన్సెన్ తొలుత 4-0తో ముందంజ వేశాడు. పుంజుకున్న లక్ష్యసేన్ 5-5తో స్కోరు సమం చేశాడు. 15-11తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆంటోన్సెన్ పుంజుకుని ఈసారి 16-16తో స్కోరు సమం చేశాడు. ఇక్కడ్నుంచి 22-22 వరకు నువ్వా నేనా అన్నట్టు ఒక్కో పాయింట్ కోసం సేన్, ఆంటోన్సెన్ పోటీపడ్డారు. 32 నిమిషాల తొలి గేమ్‌లో చివర్లో వరుస పాయింట్లు సాధించిన ఆంటోన్సెన్ 1-0 ఆధిక్యంలో నిలిచాడు. ఇక రెండో గేమ్‌లోనూ ఇదే కథ పునరావృతం. లక్ష్యసేన్, ఆంటోన్సెన్ ఆఖరు వరకు ఒక్కో పాయింట్ కోసం చెమటోడ్చారు. 18-18 వరకు పోటీ ఇలాగే సాగింది. మరోసారి ఆఖర్లో ఒత్తిడికి లోనైన లక్ష్యసేన్ వరుసగా మూడు పాయింట్లు కోల్పోయాడు. రెండో గేమ్‌తో పాటు సెమీఫైనల్ బెర్త్‌ను సైతం చేజార్చుకున్నాడు. ఈ విజయంతో లక్ష్యసేన్‌పై ఆంటోన్సెన్ 3-2తో ముఖాముఖి రికార్డును మెరుగుపర్చుకున్నాడు.

రాష్ట్రంలో గణనీయంగా వరి సాగు

బహుళ ప్రాచుర్యం పొందిన 'తెలంగాణ సోనా'

- 'ప్రపంచ వరి సదస్సు' ప్రారంభోత్సవంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్
- పలు దేశాల శాస్త్రవేత్తలు, వ్యాపారులు, రైతులు హాజరు
- వరి సాగు వృద్ధి, వాణిజ్యం, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై చర్చ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు గణనీయంగా పెరుగుతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ సోనా రకం బహుళ ప్రాచుర్యం పొందిందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రపంచ వరి సదస్సు 2024ను తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సదస్సుకు 30 దేశాల నుంచి 150 మంది ఎగుమతిదారులు, దిగుమతిదారులు, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఫిలిప్పీన్స్) శాస్త్రవేత్తలు, దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, తెలంగాణలోని అభ్యుదయ రైతులు, రైస్ మిల్లర్లు, వరి విత్తన కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వరి సాగులో వృద్ధి, మెరుగైన యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలు, ఎగుమతులకు అవసరమైన నాణ్యత ప్రమాణాలు, విత్తనోత్పత్తి, ఆధునిక రైస్‌మిల్లింగ్ విధానాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. అంతర్జాతీయ నిత్యావసరాల సంస్థ (ఐసీఐ) ప్రతి సంవత్సరం ఒక్కో దేశంలో 'ప్రపంచ వరి సదస్సు'ను గత 22 ఏండ్లుగా నిర్వహిస్తోంది. 'ధాన్యం ఎగుమతులు, దిగుమతుల సమాచారం, ఏయే దేశాలలో ఏయే రకాల వరి వంగడాలకు గిరాకీ ఉంది? వాటి నాణ్యత ప్రమాణాలు ఎలా ఉండాలి.బియ్యం మిల్లింగ్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలు, విత్తనోత్పత్తిలో నవీన పంథా' తదితర అంశాలపై తాజాగా నిర్వహించిన సదస్సులో చర్చించారు.

స్వాతంత్ర్యనంతరం దేశంలో వరి ఉత్పత్తి దాదాపు 8 రెట్లు పెరిగిందని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఏటా 26 మిలియన్ మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతున్నదని చెప్పారుక. పపంచ బియ్యం భాండాగారంగా దేశం అవతరించిందని చెప్పారు. తెలంగాణలో 220 వరి రకాలు సాగులో ఉన్నాయన్నారు. వరి ఉత్పత్తికి కావాల్సిన అన్ని వనరులు, సాంకేతికత రైతుకు అందుబాటులోకి వచ్చినా, సంక్షోభం అనేది నేటికి కూడా ఒక పెద్ద సవాలుగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తికి సంబంధించిన అంశాలతోపాటు, స్టోరేజ్, మార్కెట్‌కు సంబంధించిన సమస్యలు దీనికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ఎగుమతుల్లో, మన దేశ వాటా దాదాపు 45 శాతంగా ఉందన్నారు. ఇక్కడి నుంచి వివిధ రకాల వరి ధాన్యం సుమారు వంద దేశాలకు ఎగుమతి అవుతుందని గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన దేశాలు సైతం వరి దిగుమతుల కోసం భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. ఈ అవకాశాలను మనం పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే, రైతాంగానికి సరైన ధరతోపాటు మార్కెట్ నిల్వల సమస్య కూడా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక పెద్ద ఎత్తున రైతులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. స్థానిక, ప్రపంచ మార్కెట్‌లో ఉన్న డిమాండ్ దృష్ట్యా రాబోయే రోజుల్లో బియ్యం ఎగుమతులు మరింతగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో అత్యాధునిక రైస్ మిల్లులు ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. వ్యవసాయానికి తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరలకు ప్రభుత్వం సేకరిస్తుందని హామీ ఇచ్చారు. వివిధ పథకాల కింద ఫోర్టిఫైడ్ రైస్‌ను సరఫరా చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో నీటి పారుదల వనరులు పెరుగుతున్న వేళ... తెలంగాణ వరి ఉత్పత్తి థాయిలాండ్‌తో సమానంగా పెరిగిందని చెప్పారు. తెలంగాణ వరి ఉత్పత్తిలో మన రాష్ట్రం...దేశంలోనే రెండవ స్థానంలో ఉందన్నారు. భవిష్యత్తులో ఈ ఉత్పత్తి మరింత పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో మిల్లింగ్ ఇండస్ట్రీ ద్వారా అనేక మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. మిల్లర్లతో తమ ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తున్నదనీ, విదేశాలకు ఎగుమతి చేసే ధాన్యంలో తెలంగాణ ధాన్యం నాణ్యమైందిగా గుర్తు పొందిందన్నారు. సదస్సులో అంతర్జాతీయ నిత్యావసరాల సంస్థ అధ్యక్షుడు జెరిమీజివింగర్, ప్రపంచ బియ్యం ఎగుమతిదారుల సమాఖ్య, సంఘాల అధ్యక్షులు ప్రేమ్‌గార్గ్, బివి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే చేరండి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా విద్యార్థులకు సూచించారు. 2024-25 విద్యాసంవత్సరంలో గుర్తింపు ఉన్న కాలేజీల జాబితాను acadtgbie.cgg.gov.in , "స్రఎఱవ.ఎస్రస్ర.స్రశీఐ.ఱఅ అధికారిక వెబ్‌సైట్లలో పొందుపరిచామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీలకు నష్టం చేసే జీవో నెం.10ని రద్దు చేయాలి

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలి : అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు సునిత, జయలక్ష్మి
- ఐసీడీఎస్ కమిషనర్ ఆఫీస్ ఎదుట ధర్నా



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు నష్టం కలిగించే జీవో నెం.10ను రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సునిత, పి.జయలక్ష్మి అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని వెంగళరావునగర్ డివిజన్‌లో ఉన్న శిశు విహార్, ఐసీడీఎస్ కమిషనర్ ఆఫీసు ఎదుట శుక్రవారం అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

65 సంవత్సరాలు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేలు చెల్లిస్తామని, 65ఏండ్లు నిండిన వారి వివరాలు అధికారులు సేకరించి అందజేయాలని గత ప్రభుత్వం జీవో నె.10 జారీ చేసిందని తెలిపారు. దాని వల్ల అంగన్‌వాడీలు తీవ్రంగా నష్టపోతారని, ఆ జీవోను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, కొత్త జీవోను జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2023లో 24 రోజులు నిరవధిక సమ్మె చేసిన సందర్భంగా నాటి మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీలతో చర్చలు జరిపారని తెలిపారు. ఆ సందర్భంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, 60ఏండ్లు దాటిన వారికి వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇస్తామని మంత్రులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలను అమలు చేయాలని ఇప్పటికే అనేకసార్లు మంత్రులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, అయినా ప్రభుత్వం నేటికీ కొత్త ఉత్తర్వులు జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా పాత జీవో నెం.10 ఉత్తర్వులనే మళ్లీ ముందుకు తెచ్చి అమలు చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే వెనక్కి వెళ్లాలని, కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం శిశు విహార్ ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతివెస్లీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఐసీడీఎస్ డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ఫైల్ పెడతామని, వీఆర్ఎస్ అంశాన్ని పొందుపరుస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మంగ, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఈ వెంకటమ్మ, పి.స్వర్ణ, పద్మ, కవిత, కోటేశ్వరి, రాష్ట్ర నాయకులు వెంకటమ్మ, సుభద్ర, భానుమతి, రాజమణి, రుక్మిణి, రమాబాయి, మాసమ్మ, చంద్రకళ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.